


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



పాలస్తీనాకు సంఘీభావం మానవత్వ లక్షణం

4లో

మంగళవారం | 14-05-2024 | మహబూబ్‌నగర్ | సంపుటి 07, సంచిక: 163 | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## సిపిఐ సిట్టింగ్ ఎంపి
# సెల్వరాజ్ మృతి



**చెన్నై :** నాగపట్టిణం సిపిఐ సిట్టింగ్ లోక్‌సభ సభ్యులు, తమిళనాడు సీనియర్ కమ్యూనిస్టు నాయకులు ఎం.సెల్వరాజ్ సోమవారం మరణించారు. ఆయన వయస్సు 67 సంవత్సరాలు. శ్వాస , కిడ్నీ సంబంధిత సమస్యలకు చికిత్స పొందుతూ చెన్నైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో తెల్లవారు జామున 2:40 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఇటీవల తిరువరూరు జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. ఆరోగ్య సమస్యలు ఎక్కువవడంతో చెన్నై లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ కన్నుమూశారు. సెల్వరాజ్‌కు భార్య కమలావతనం, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.ఆయన భౌతికకాయాన్ని చెన్నై నుండి నాగపట్టిణంకు తరలించారు.సెల్వరాజ్ స్వగ్రామం సీతమల్లిలో మంగళవారం నాడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన గడిచిన మూడేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపి సెల్వరాజ్‌కు బదులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి వాయ్ సెల్వరాజ్‌ను పార్టీ బరిలోకి దింపింది.

**సామాన్య కుటుంబం నుండి ఎంపి వరకు**

1957 మార్చి 16న తమిళనాడులోని తిరువరూరు జిల్లా కప్పలుదయ్యన్‌లో ఎన్.మునియన్, ఎం.కుంజమ్ముల్ దంపతులకు ఎం.సెల్వరాజ్ జన్మించారు. ఆయనను అందరూ సెల్వరసు అనే పేరుతో పిలుస్తారు. ఆయన పియుసి పూర్తి చేశారు. చిన్న వయసులోనే సెల్వరాజ్ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్‌లలో వివిధ హోదాలలో పని చేశారు. అనంతరం నీదపట్టణం పట్టణ కమిటీ సభ్యునిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం నాగపట్టిణం జిల్లా కార్యదర్శిగా, సిపిఐ జాతీయ సమితి సభ్యుడిగా, ఎంపిగా కొనసాగింది. ఆయన నాలుగు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. సెల్వరాజ్ 32వ ఏటనే తొలిసారిగా నాగపట్టిణం నుండి 1989లో లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. తరువాత 1996, 1998, 2019లో విజయం సాధించారు. గత లోక్‌సభ ఎన్నికలలో 2.11 లక్షల భారీ మెజారిటీతో సమీప ఎఐఎడిఎంకె అభ్యర్థిపై విజయదుందుభి మోగించారు.

**కావేరీ సమస్యపై 110 కిలోమీటర్ల మానవ హారం**

దళిత వర్గానికి చెందిన సెల్వరాజ్ కావేరీ నది డెల్టా ప్రాంతంలో ప్రజాదరణ కలిగిన నేత. డెల్టా రైతుల సమస్యపై నిత్యం పోరాటాలు చేశారు. కర్నాటకతో కావేరీ నదీ జలాల సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం చర్య తీసుకోవాలనే డిమాండ్‌కు మద్దతు కూడగట్టడంలో కీలక పాత్ర పోషించారు. కావేరీ నది వివాదాల

తరువాయి 2లో



వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణం బాలుర ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సిద్దిపేట జిల్లాలోని చింతమడకలో బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఖాజాగూడ ప్రభుత్వ పాఠశాలలో సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డిలు కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## రాష్ట్రంలో సా॥ 5 గంటలకు వరకు
# 61.16% ఓటింగ్

- తుది ఓటింగ్‌శాతంపై నేడు స్పష్టత
- ఒకే రోజు 400 ఫిర్యాదులు
- 38 కేసులు నమోదు
- హైదరాబాద్ లోక్‌సభ నియోజక వర్గంలో రీ పోలింగ్‌పై నేడు నిర్ణయం
- తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వెల్లడి




ప్రజాపక్షం/హైదరాబాద్

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముగిసిందని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి వరకు పోలింగ్ శాతంపై స్పష్టత వస్తుందని, పూర్తి సమాచారాన్ని మంగళవారం ప్రకటిస్తామన్నారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజక వర్గంలో రీ పోలింగ్ అంశాన్ని పరిశీలించి మంగళవారం నిర్ణయం తీసుకుంటామని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. పోలింగ్ ముగిసిన

తరువాయి 2లో

## 'పోలింగ్'లో విషాదం

**ఇద్దరు సిబ్బంది, ఒక ఓటరు మృతి**



లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున రాష్ట్రంలోని పలు విషాధ సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సిబ్బంది గుండెపోటుతో మరణించగా, పోలింగ్ కేంద్రంలో ఒక ఓటరు గుండెపోటుతో మృతిచెందాడు. హైదరాబాద్, రెడ్ హిల్స్‌లోని బూత్ నంబర్ 151లో ముషీరాబాద్ టిఎంఆర్‌ఎస్ బాలుర స్కూల్‌కు చెందిన ప్రిన్సిపాల్ నర్సింహ ఎన్నికల విధులలో గుండెపోటు, డీహైడ్రేషన్‌తో మరణించాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వరావుపేట నెహ్రూనగర్‌లోని 165 పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న శ్రీకృష్ణ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన చుంచుపల్లిలో సీనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్నాడు. కాగా ఉప్పల్‌లో ఓటు వేసేందుకు వెళ్ళిన భరత్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మి కి ఒక్క సారిగా గుండెపోటు రావడంతో పోలింగ్ స్టేషన్‌లోనే పడిపోయింది. దీంతో వెంటనే ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

తరువాయి 2లో

## ఇవిఎంలలో...
# 1717 మంది భవితవ్యం

- లోక్‌సభ నాలుగోదశ ఎన్నికల్లో 62 శాతం పోలింగ్
- ఆంధ్ర, బెంగాల్ రాష్ట్రాల్లో హింస
- శ్రీనగర్‌లో కనిష్టస్థాయి పోలింగ్
- పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 75.66 శాతం పోలింగ్




**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా నాలుగో విడత ఓటింగ్ ముగిసింది. 96 నియోజకవర్గాల్లో 1717 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా బారులు తీరిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఓటు వేశారు. 96 స్థానాల్లో సాయంత్రం 5 గంటల సమయానికి 62.31 శాతం పోలింగ్ నమోదైంది. తెలంగాణలో 17 లోక్‌సభ నియోజకవర్గాలలో ఓటర్లు ప్రశాంతంగా ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. 61.16 శాతం పోలింగ్ జరిగింది. దీంతో దేశంలో మొత్తం 543 లోక్‌సభ స్థానాలకుగాను నాలుగు దశల ఓటింగ్ ద్వారా 389 స్థానాల్లో పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో హింస చెలరేగింది. ఇవిఎంలు ధ్వంసమయ్యాయి. పోలీసులపై దాడులు జరిగాయి. కాగా రోడ్లు, ఇతర అభివృద్ధి చేయలేదని విమర్శిస్తూ, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని గ్రామాలలో ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. భారత ఎన్నికల సంఘానికి ఈ విడతలో మొత్తం 1,088 ఫిర్యాదులు అందాయి. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 75.66 శాతం పోలింగ్ నమోదుకాగా, జమ్మూ కశ్మీరులో శ్రీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో అతి కనిష్టంగా 35.75 శాతం (సాయంత్రం ఐదు గంటలనాటికి) పోలింగ్ నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ–లోక్‌సభకు ఒకేసారి జరిగిన ఏకవిడత పోలింగ్‌లో ప్రధానంగా పలనాడు, కడప, అన్నమయ్య జిల్లాలలో హింసకు పాల్పడ్డారంటూ తెలుగుదేశంపార్టీ–వైఎస్‌ఆర్‌సిపి, బెంగాల్‌లో టిఎంసి, బిజెపిలతో పాటు కాంగ్రెస్ సారథ్యానగల కూటమి నాయకులు పరస్పరం వేరు వేరుగా ఎన్నికల సంఘానికి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. తాడిపత్రిలో వైఎస్‌ఆర్‌సిపి రౌడీషీటర్లు బీభత్సం సృష్టించారని, ఎక్కువశాతం పోలింగ్ జరగకుండా అడ్డుకున్నారని, పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయిందనీ టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఫిర్యాదు చేశారు. తెలుగుదేశంపార్టీ ఐదు పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకుందని వైఎస్‌ఆర్‌సిపి ఫిర్యాదు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలకు, 25 లోక్‌సభ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. సాయంత్రం ఆరు గంటల వరకూ కొనసాగిన పోలింగ్‌లో ఎపిలో 68.04 శాతం, బీహార్‌లో 54.14, జార్ఖండ్‌లో 63.14, మధ్యప్రదేశ్‌లో 68.01, మహారాష్ట్రలో 52.49, ఒడిశాలో 62.96, తెలంగాణలో 61.16, ఉత్తర ప్రదేశ్‌లో 56.35 శాతం మేరకు ఓటర్లు ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్

తరువాయి 2లో

# పోటెత్తిన ఓటర్లు

- ఎండా, వాన లెక్కచేయని జనం
- సాయంత్రం 5 గంటలకే 68 శాతం పోలింగ్
- అనేక ప్రాంతాల్లో వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణ
- తెనాలి ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించిన ఓటరు
- తంగెడలో నాటుబాంబు దాడులు



**అమరావతి:** ఓటర్లు పోటెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 6 గంటల నుంచే జనం పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో ఎండ, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ ప్రజలు లెక్కచేయలేదు. అలాగే అనేక చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ జనం బెదరలేదు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసినా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉండటం విశేషం. ఎట్టిపరిస్థితుల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్న ఆరాటంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. దీంతో వీరందరికీ ఓటు వేసేందుకు ఈసీ అవకాశం కల్పించింది. సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 68 శాతం పోలింగ్ నమోదు కాగా, సమయం ముగిశాక కూడా దాదాపు 3,500కు పైగా కేంద్రాల వద్ద పోలింగ్ కొనసాగుతోంది. రాత్రి 10 గంటల వరకు ఈ పోలింగ్ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ అరకు, పాడేరు, రంపచోడవరంలో మాత్రం గడువు ప్రకారం సాయంత్రం 4 గంటలకే ముగియగా, కురుపాం, పాలకొండ, సాలూరులో సాయంత్రం 5 గంటలకే పరిసమాప్తమైంది. మిగతా చోట్ల సాయంత్రం 6 గంటలకే పోలింగ్ సమయం ముగిసినా దాదాపు ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో రాత్రి పొద్దు పోయే వరకు క్యూలైన్లలో ఓటర్లు వేచి ఉన్నారు. ఓటుహక్కు వినియోగించుకొనేందుకు జనం పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉండటంతో అందరికీ స్లిప్పులు ఇచ్చిన ఎన్నికల సంఘం అధికారులు... వారందరికీ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అవకాశం కల్పించడంతో పోలింగ్ శాతం భారీగా నమోదయ్యే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు చెపుతున్నారు. ఇక అనేకచోట్ల ఇవిఎంలు మొరాయించాయి. గంటల తరబడి పోలింగ్ ఆలస్యమైంది. అనేక ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా మాచర్లను అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా పరిగణించి భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినప్పటికీ పెద్దఎత్తున హింస చెలరేగింది. నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పెద్దఎత్తున అల్లర్లు చోటుచేసుకున్నాయి. కొన్ని పోలింగ్

తరువాయి 2లో

## పోటాపోటీగా ఇసికి ఫిర్యాదులు

**సిఎం రేవంత్‌రెడ్డి, కెటిఆర్, కిషన్‌రెడ్డిలపై.....**

ప్రజాపక్షం / హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ పలు రాజకీయ పార్టీలు పరస్పరం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. సిఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ బిజెపి ఎంపి అభ్యర్థి రఘునంధన్‌రావు సోమవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కొడంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడటమే కాకుండా బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలపైన, ప్రధాని మోదీపైనా విమర్శలు గుప్పించారని, రేవంత్ తీరు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా పేర్కొంటూ రఘునందన్‌రావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కాగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు నందినగర్‌లో కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడి కాంగ్రెస్, బిజెపిలపైన, ప్రధాని మోడీపైన విమర్శలు చేసి ఎన్నికల కోడ్‌ను

తరువాయి 2లో

## కేజ్రీవాల్‌ను సిఎంగా తొలగించే
# నిర్ణయం ఎల్‌జిదే

**పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ:** మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన కారణంగా ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి నుంచి అరవింద్ కేజ్రీవాల్‌ను తొలగించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం కొట్టివేసింది. ఈ విషయంపై చర్యలు తీసుకోవాల్సింది ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అని స్పష్టం చేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అరెస్టు చేసిన తర్వాత ఆయన్ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని కోరడం న్యాయబద్ధమైన విషయమని, కానీ దానికి చట్టపరమైన హక్కు లేదని స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు ఏప్రిల్ 10న కొట్టివేసింది. అనంతరం పిటిషనర్ కాంత్ భాటి సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. మరోవైపు, సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తే జూన్ 5నే తాను తీహార్ జైలు నుంచి విడుదలవుతానని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ తెలిపారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చిన కేజ్రివాల్ పార్టీ కార్యాలయంలో ఆమ్ ఆద్మీ

తరువాయి 2లో

## గ్రామాల్లో ఎక్కువ...
# పట్టణాల్లో తక్కువ

- హైదరాబాద్‌లో కనిపించని ఓటరు చైతన్యం
- అత్యధికంగా భువనగిరిలో 72 శాతం...
- అత్యల్పంగా హైదరాబాద్‌లో 39 శాతం పోలింగ్



ప్రజాపక్షం/ హైదరాబాద్

రాష్ట్రంలో సోమవారం 17 లోక్‌సభ స్థానాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాలలో మొత్తం 61.16 శాతం (సాయంత్రం 5 గంటలకు) పోలింగ్ నమోదు కాగా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ నియోజక వర్గంలో 50.58 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తుది పోలింగ్ శాతాన్ని మంగళవారం

తరువాయి 8లో

## హమ్మయ్య.....
# పోలింగ్ ప్రశాంతం

- ఊపిరిపీల్చుకున్న పోలీసులు
- 38 ఎఫ్ఐఆర్‌లు నమోదు
- బిజెపి అభ్యర్థి మాధవీలత, ఎంఎల్‌ఎ రాజాసింగ్‌పై కేసు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని 17 లోకసభ స్థానాలకు సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోక పోవడంతో రాష్ట్ర పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. వివిధ పోలీసు స్టేషన్‌లలో 38 ఎఫ్ఆర్‌లు నమోదు చేశారు. ఆయా జిల్లాలలో జరిగిన పోలింగ్ ప్రక్రియ, పోలీసు బందోబస్తును డిజిపి రవిగుప్తా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో సిసిటివిల ద్వారా పర్యవేక్షించారు. ఇక్కడి నుంచి ఆయా జిల్లాల ఎస్‌పిలు, కమిషనరేట్ల కమిషనర్లకు సలహాలు, సూచనలు జారీ చేశారు. ఇక మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో నాలుగు గంటలకే పోలింగ్ ముగిసింది. మహబూబాబాద్,

తరువాయి 8లో

## పాక్ ఆక్రమిత కశ్మీరులో ఘర్షణలు

### పోలీస్ ఆఫీసర్ మృతి



**ముజఫరాబాద్ :** పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో కొద్దిరోజుల క్రితం చెలరేగిన ఘర్షణలు ఉద్ధృతమయ్యాయి. వేలాది ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. పెరుగుతున్న ధరలు, విద్యుత్ భారాలు, పన్నులు సమస్యలుగా మారడంతో ప్రజలు వీధుల్లోకి వచ్చారు. అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వరుసగా శాంతియుత పద్ధతుల్లో ప్రదర్శనలు జరుగుతున్నాయి. అతే పోలీసులతో జరిగిన ఘర్షణల్లో ఇద్దరు పౌరులు మరణించగా, ఒక ఎస్ఐ కూడా మరణించాడు. పోలీసులకు ప్రదర్శకులకు మధ్య జరుగుతున్న ఘర్షణల్లో అద్నాన్ ఖురేషీ అనే ఒక సబ్ ఇన్స్‌పెక్టర్ గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘర్షణలకు సంబంధించి ఇప్పటివరకూ 100 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయనీ, విద్యుత్ వ్యయం ఖర్చులు రోజు రోజుకూ అనూహ్యంగా పెరుగుతున్నాయనీ స్థానిక వ్యాపారులు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. వారు జెఏసి కమిటీగా ఏర్పడి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ముజఫర్‌నగర్‌లో కూడా వారం రోజులుగా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. దీంతో రోజువారీ వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అవాంతరాలు ఏర్పడ్డాయి. వ్యాపార లావాదేవీలు స్తంభించాయి. తాజాగా శని, ఆదివారాల్లో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దుకాణాలన్నీ మూతపడ్డాయి. భారీ ప్రదర్శనలు జరిగాయి. హక్కుల కార్యకర్తలు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, ప్రదర్శకులకు మధ్య ఘర్షణ చెలరేగింది. ఇస్లాంఘర్‌లో జరిగిన ఘర్షణల్లో ఒక తూటా ఎస్ ఐ ఖురేషీ గుండెల్లోకి దూసుకుపోయిందని సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ కమ్రాన్ అలీ మీడియాకు చెప్పారు.

## సూడాన్‌లో యుద్ధం: 27 మంది మృతి

**ఖార్టూమ్ :** సూడాన్ ఉత్తర డార్ఫర్‌లో సైన్యంలోని రెండు వర్గాలమధ్య అధికారం కోసం జరుగుతున్న ఘర్షణలలో కనీసం 27 మంది పౌరులు మరణించారని మరో 130 మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి సోమవారం వెల్లడించింది. మృతుల్లో ఎక్కువమంది పిల్లలు, మహిళలు ఉన్నారు. ఈ తాజా ఘటనలతో 170 కుటుంబాలు ఇళ్ళు వదలి పారిపోయాయి. సూడాన్ సాయుధ బలగాలు (ఎస్ఏఎఫ్), ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఎస్ఎఫ్) మధ్య అంతర్యుద్ధం జరుగుతోంది. ఎల్‌ఫాషెర్ ఆసుపత్రిలో పడకలన్నీ గాయపడిన వారితో నిండిపోయాయి. ఇంకా అనేకమందికి చికిత్స కోసం పడకలు లేక నేలమీదే పడుకోబెట్టారు. ఐక్యరాజ్యసమితి మానవతా సహాయ వ్యవహారాల కార్యాలయం ఈ విషయం వెల్లడించింది. ఎల్ ఫాషర్ శివార్ల ప్రాంతంలో వేలాదిమందిని ఆర్ఎఎఫ్ సిద్ధం చేసింది. దాడికి సన్నాహాలు చేస్తున్నది. మరో వైపు ఎస్ఏఎఫ్, దాని అనుబంధ దార్ఫర్ సాయుధ గ్రూపులు ఎల్ ఫాషర్‌లోకి ప్రవేశించేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో కూడా భారీగా తన సైన్యాలను మోహరించింది. దీంతో రాబోయే రోజుల్లో ఈ అంతర్గత యుద్ధం మరింత ఉద్ధృతరూపం దాలుస్తుందని భయపడుతున్నారు. దార్ఫర్ అంతటా అర్ధయుద్ధం హింసాకాండతో అతలాకుతలమవుతూ ఉండటంతో సుమారు 8,00,000 మంది ప్రజలు ఘోరమైన కరువు పరిస్థితుల్లో ఏమీ తిండి దొరకని స్థితిలో పడుతున్నారని, వెంటనే ఈ అంతర్గత యుద్ధం ఆపాలని ఐక్యరాజ్యసమితి గతవారంలోనే హెచ్చరిక చేసింది. 2023 ఆగస్టు 15వ తేదీన అధికారం కోసం, ఆధిపత్యం కోసం ఎస్ఎఎఫ్ఆర్ఎఎఫ్‌ల మధ్య అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఈ యుద్ధం కారణంగా ఒసిహెచ్ఎ తాజా అంచనాల ప్రకారం, సుమారు 80.70 లక్షలమంది ప్రజలు స్థిరమైన కుటుంబ జీవితాన్ని కోల్పోయారు. హింసాకాండ కారణంగా వారంతా ఇళ్ళు వదిలి పారిపోయారు. వీరిలో భారతీయులు కూడా ఉన్నారు. అనేక మంది తిరిగి భారత్‌కు చేరుకున్నారు.

# జైల్లో జర్నలిస్టులు, ప్రతిపక్షాలు

### ట్యూనీషియాలో భారీ ప్రదర్శన






**ట్యూనిస్ :** ప్రభుత్వం జైలులో నిర్బంధించిన జర్నలిస్టులు, న్యాయవాదులు, ఇతర ప్రతిపక్ష నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ట్యూనీషియాలో వందలాదిమంది ప్రజలు భారీ ప్రదర్శన జరిపారు. అదే విధంగా దేశంలో అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించేందుకు ఒక కచ్చితమైన తేదీని నిర్ణయించాలనీ, ఇక జాప్యం లేకుండా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తర ఆఫ్రికాలో ఆల్జీరియా, లిబియా, మధ్యధరా సముద్రం సరిహద్దులుగా ఉన్న దేశం ట్యునీషియా రిపబ్లిక్‌లో ప్రభుత్వం అన్యాయంగా జర్నలిస్టులను, ప్రతిపక్ష కార్యకర్తలు, నాయకులను జైళ్ళల్లో నిర్బంధించడంతో ప్రజలు వందలాదిమంది దేశ రాజధాని ట్యునిస్ వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు జరిపారు. తక్షణం వారిని విడుదల చేయాలని, దేశ అధ్యక్ష పదవికి న్యాయబద్ధంగా అందరికీ అవకాశం కల్పిస్తూ ఎన్నికలు జరపాలని ప్రజలు నినాదాలు చేశారు. దేశంలో రాజకీయ అస్థిరత నెలకుని ఉండటం, ఆర్థిక సంక్షోభంతో దేశం తల్లడిల్లిపోవడం వంటి విపరీత పరిస్థితులమధ్య ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజలు వందలాదిమంది నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. దేశాధ్యక్షుడు కైస్ సాయిద్ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా దుయ్యబట్టే దేశంలోని ప్రముఖ న్యాయవాది సోనియా దహ్మానీని పోలీసులు అరెస్టు చేశారు. డీన్‌షిప్ ఆఫ్ లాయర్స్ భవంతిలోకి శనివారంనాడు పోలీసులు దూసుకువెళ్ళి దహ్మానీని అరెస్టు చేశారు. ప్రభుత్వ విధానాలను విమర్శిస్తున్నందువల్లనే ఆయనను పోలీసులు అరెస్టు చేశారనీ దేశంలో ప్రజలకు అసమ్మతి తెలియజేసే హక్కు, న్యాయబద్ధమైన అధికారాలను అణచివేయవద్దని ప్రదర్శకులు నినాదాలు చేశారు. 2021 జులైలో ట్యూనీషియా అధ్యక్షుడు తనుకు తానుగా కుట్ర చేసి శాసన వ్యవస్థ మొదలు మీడియా వరకూ సర్వాధికారాలను ఆక్రమించాడు. దాని కంటే నాలుగు నెలల ముందు ప్రధాన మంత్రి హైచెమ్ మెకిక్‌ను ఇతర మంత్రులను పదవుల నుండి తొలగిస్తూ ఒక డిక్రీ జారీ చేశారు. పార్లమెంటును రద్దు చేశారు న్యాయ వ్యవస్థను రద్దుచేశారు. దేశంలో సమస్యల పరిష్కారానికి అధ్యక్ష పాలన ఒక్కటే పరిష్కారమని పార్లమెంటరీ వ్యవస్థ పనికిరాదనీ ఆయన ప్రకటించారు. ఒక్క విదేశాంగ మంత్రి ఓత్‌మన్ జెరండీని మాత్రమే నియమించారు. కొత్త రాజ్యాంగాన్ని రచించి ఆమోదింపజేసుకున్నారు. తన అధికారాలు కొనసాగించేందుకు మెజారిటీ ప్రజల భాగస్వామ్యం లేకపోయినా తూ తూ మంత్రంగా ఎన్నికలు జరిపించారు.

### జార్జియా పార్లమెంటు ఎదుట

# రాత్రితెల్లార్లూ ప్రదర్శనలు

### నేడు వివాదాస్పద బిల్లు ఆమోదం!



**తిబ్లిసి :** వివాదాస్పద బిల్లును రద్దు చేయాలని కోరుతూ జార్జియా (ఆసియా-యూరప్ మధ్య ప్రాంతం యూరోసియా దేశం) లో కొద్ది రోజులుగా కొనసాగుతున్న నిరసన ప్రదర్శనలు తారాస్థాయికి చేరుకున్నాయి. మీడియయా స్వేచ్ఛకు, యూరోపియన్ యూనియన్‌లో జార్జియాదేశం చేరడానికకి ఆటంకం కలిగించే వివాదాస్పద బిల్లును ఉపసంహరించచాలని ఈ ప్రదర్శనలు జరుగుతున్నాయి. వేలాదదిమంది ప్రదర్శకులు జార్జియా పార్లమెంటు వెలుపల తిష్టవేసి నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా 20 మందిని అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి తెల్లవారూ భారీ వర్షం మధ్య ప్రదర్శకులు నృత్యాలు చేస్తూ పట్టు వదలకుండా నిరసనలు వ్యక్తం చేశారు. తెల్లవారి ఉదయం పది గంటలకు పార్లమెంటు భవంతికి చేరుకున్న ఎంపీలపై ప్రదర్శకులు విరుచుకుపడ్డారు. ''రష్యాకు బానిసలు, మీరంతా రష్యన్లు'' అంటూ నినాదాలు చేశారు. ఈ నిరసనల మధ్య వివాదాస్పద ఫారిన్ ఇన్‌ఫ్లుయిన్స్ బిల్లును పార్లమెంటు మంగళవారంనాడు మధ్యాహ్నం తుది విడతగా ఆమోదించేందుకు సిద్ధపడింది. దేశంలో అసమ్మతి గళాన్ని అణచివేసేందుకే ఈ బిల్లు తీసుకువచ్చారని పెద్ద ఎత్తున దేశంలో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే దేశ సార్వభౌమాధికారం, బాహాటత్వం పెరుగుతుందని అధికారపార్టీ ఎంపీలు అంటున్నారు. ఈ ఈ బిల్లు ఆమోదం పొందితే జార్జియా ఇక యూరోపియన్ యూనియన్‌లో చేరేందుకు అవకాశాలు సన్నగిల్లిపోతాయని ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఫారిన్ ఇన్‌ఫ్లుయిన్స్ బిల్లుకు వ్యతిరేకంగా జార్జియా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఐనా గానీ ప్రభుత్వం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తున్నది. ప్రదర్శకులు సోమవారం ఉదయం కూడా పార్లమెంటు ఎదుట భారీ సంఖ్యలో గుమిగూడారు. నిరసనలు తెలియజేశారు. ఐతే భద్రతా దళాలు వారిని మెయిన్ స్క్వేర్ నుండి దూరంగా వెనక్కి నెట్టేశాయి. అధికార డ్రీమ్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సోమవారం ఉదయం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టారు. పార్లమెంటు కమిటీ ఈ బిల్లును ప్రవేశపెట్టి ఆమూలాగ్రంగా అర్థమయ్యేవిధంగా చదివి చెప్పాల్సి ఉండగా కేవలం 67 సెకన్లలోనే ప్రాథమికంగా ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు అంగీకారం తెలియజేశారు.

# యుద్ధ వ్యూహం మార్చిన పుతిన్!

### రష్యా రక్షణమంత్రిగా ఆండ్రూ డెలవ్ సోవ్



**మాస్కో :** ఉక్రేన్‌కు అమెరికా సహా యూరప్ దేశాలు మరింత ఆర్థిక సైనిక సహాయం పెంచిన పూర్వరంగంలో రష్యా మంత్రివర్గంలో ఆకస్మిక మార్పులు సంభవించాయి. అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ యుద్ధ వ్యూహం మార్చారా? అనే ప్రశ్నకు ఔననే అంటున్నారు యుద్ధ పరిశీలకులు. రష్యా రక్షణమంత్రిగా ఇప్పటివరకూ పనిచేసిన సెర్గీ షోయిగ్యూను ఆ పదవి నుండి తప్పించారు. ఆయన స్థానంలో ఆర్థికవేత్త, మాజీ ఉపప్రధానమంత్రి ఆండ్రీ బెవ్ సోవ్‌ను నియమించారు. ఈ మేరకు మంత్రివర్గంలో మార్పులు చేశారు. ఈ మార్పులను రష్యా పార్లమెంటు ఆమోదించవలసి ఉంటుంది. అదేవిధంగా ఇప్పటివరకూ రక్షణమంత్రిగా ఉన్న షోయిగ్యూను రష్యా జాతీయ భద్రతా మండలి కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 2008 నుండీ జాతీయ భద్రతామండలి కార్యదర్శిగా పనిచేస్తున్న నికోలాయి పాత్రిషేవ్‌ను తొలగించి షోయిగ్యూను నియమించారు. అదేవిధంగా ఇప్పటివరకూ రక్షణమంత్రిగా పనిచేసిన షోయిగ్యూను ఆకస్మికంగా ఆ పదవి నుండి తొలగించి కొత్త పదవిలో నియమించారు. ఉక్రేన్‌కు ఇప్పటివరకూ తెరవెనక ఉండి సహాయం చేసిన యూరప్, నాటో కూటమి దేశాలు శక్తిమంతమైన ఆయుధాలు సమకూర్చేందుకు, యుద్ధ తీవ్రత పెంచేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్న తరుణంలో పుతిన్ రక్షణమంత్రి పదవిలో కూడా మార్పులు చేసి కొత్తరక్తం ఎక్కించారు. యుద్ధ వ్యూహంలో మార్పులు చేయడంతోపాటు యుద్ధ వ్యవయాన్ని వీలైనంత వరకూ వ్యూహాత్మకంగా కొనసాగిస్తూ ఖర్చు తగ్గించాలనే ఆలోచనలో ఉన్నందువల్లనే కొత్త వ్యూహానికి పుతిన్ తెరలేపారని యుద్ధ పరిశీలకులు వ్యాఖ్యానించారు. ఇప్పటికే రష్యా తన స్థూల జాతీయోత్పత్తిలో 6.7 శాతం మేరకు వ్యయాలు తీసి యుద్ధం కోసమే ఖర్చు పెడుతున్నది. సరికొత్త యుద్ధ వ్యూహాలకు పదును పెట్టడంకోసమే ఒక ఆర్థికవేత్తను ఆ స్థానంలో రక్షణమంత్రిగా నియమించారని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. డ్రోన్లతో యుద్ధం చేయడంలో ఉక్రేన్ కూడా రష్యాతో సరిసమానస్థాయిలో వ్యూహాలు పన్నుతూ ఉండటంతో పుతిన్ యుద్ధ వ్యూహాలు మారుస్తున్నారు.

**31 డ్రోన్లు, 16 క్షిపణులు కూల్చేసిన రష్యా:** ఆదివారం రాత్రికి రాత్రి సరిహద్దు ప్రాంతాల్లోకి ఉక్రేన్ ప్రయోగించిన 31 డ్రోన్లు, 16 క్షిపణులను రష్యా సైన్యం కూల్చివేసినట్లు ఆ దేశ రక్షణమంత్రిత్వశాఖ సోమవారం ప్రకటించింది. సరిహద్దుల్లోనే బెలగొరోడ్ లోకి ఉక్రేన్ ఇటీవలికాలంలో డ్రోన్ల దాడులు ముమ్మరం చేసింది. ఆక్రమిత క్లెమ్లిన్‌లోకి ప్రయోగించిన ఏడు డ్రోన్లు నాలుగు గైడెడ్ క్షిపణులలను, కుర్స్క్‌లోకి ప్రయోగించిన ఎనిమిది డ్రోన్లు, నాలుగు క్షిపణులను రష్యా సైన్యం ధ్వంసం చేసింది. అదేవిధంగా అంతకుముందురోజు సరిహదు బెలగరోడ్ ప్రాంతంపై ఉక్రేన్ జరిపిన దాడుల్లో 15 మంది ప్రజలు మరణించారు. మరో 30 మంది గాయపడ్డారు. ఆ ప్రాంత గవర్నర్ సోమవారం ఈ విషయం ప్రకటిచారు. ఇదిలా ఉండగా, ఉక్రేన్‌లోని ఈశాన్య ఖార్ఖివ్ ప్రాంతంపై రష్యా ఆకస్మిక దాడులు చేయడంలో గడచిన శుక్రవారం నుండి 4,000 మంది ఇళ్ళు వదలి పారిపోయారని ఆ ప్రాంత గవర్నర్ చెప్పారు.

## ఇసికి ఫిర్యాదులు

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఇదే సమయంలో కేంద్రమంత్రి, సికింద్రాబాద్ ఎంపి అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ ఆయనపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ పేరును ప్రస్తావించడంపై కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది.

పోలింగ్ రోజు వ్యక్తుల పేర్లు ప్రస్తావించడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. కిషన్‌రెడ్డిపై ఉల్లంఘన కేసు నమోదు చేయాల్సిందేనని ఇసిని కాంగ్రెస్ కోరింది. అటు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సైతం చింతమడకలో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ పేరు ప్రస్తావించారు. బిజెపి సొంత రూల్స్ ప్రకారం 75 సంవత్సరాల వయస్సు తర్వాత ఎవరూ ఏ పదవిని చేపట్టరని, కాబట్టి ప్రధాని మోదీ కూడా తప్పుకోవాలని, ఇప్పుడు భారతదేశంలో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర అని ఇందులో ఎలాంటి సందేహం లేదని వ్యాఖ్యానించారని, ఇది ఎన్నికల ఉల్లంఘనే అని బిజెపి అభ్యంతరం వ్యక్తం చేసింది.

## నిర్ణయం ఎల్‌జిదే

(మొదటి పేజీ తరువాయి)

కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నప్పుడు తనను అవమానపరిచే ప్రయత్నాలు జరిగాయని ఆయన చెప్పారు. తీహార్ జైలులోని తన గదిలో రెండు సిసిటివి కెమెరాలు అమర్చారని, ఆ దృశ్యాలను 13 మంది అధికారులు పర్యవేక్షించారని ఆరోపించారు. సిసిటివి దృశ్యాలను ప్రధాని కార్యాలయానికి అధికారులు అందజేసినట్లు కేజ్రీవాల్ ఆరోపించారు. మోదీ తనను గమనించే వారని కౌన్సిలర్లతో చెప్పారు. తనపై మోదీకి ఎలాంటి పగ ఉందో తెలియదన్నారు. ప్రజలు ఆమ్ ఆద్మీ నేతలను గౌరవిస్తున్నారని, ప్రేమిస్తున్నారని వివరించారు. ఆప్ సర్కార్ పని చూసి బిజెపి భయపడుతోందన్నారు. జూన్ 2న తిరిగి జైలుకు వెళతానన్న కేజ్రీవాల్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలను జైలు నుంచే చూస్తానని చెప్పారు. తనను అరెస్ట్ చేసినతర్వాత ఆమ్ ఆద్మీ మరింత సమైక్యంగా పని చేస్తోందని ఆయన తెలిపారు.

## 61.16% ఓటింగ్

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని ఎన్నికల కార్యాలయంలో వికాస్ రాజ్ సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు సుమారు 61.16 శాతం వరకు పోలింగ్ జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 400 ఫిర్యాదులు అందాయని, ఇందులో 38 కేసుల ను నమోదయ్యాయని, సి విజిల్ ద్వారా 225 వరకు, టోల్‌ఫ్రీ ద్వారా 50 ఫిర్యాదులు అం దాయని వివరించారు. రూ. 330 కోట్లను స్వా ధీనం చేసుకున్నామన్నారు. వాతావరణం కూ డా తమకు సహకరించిందని, అందరూ సహకరించారని చెప్పా రు. రాష్ట్ర వ్యాప్తంగా 14 వందల పోలింగ్ కేం ద్రాల్లో (సాయంత్రం 6గంటల వరకు) క్యూ లైన్‌లో నిలబడ్డారన్నారు. మంచి వాతావరణంలో పోలింగ్ జరిగిందని, శాంతిభద్రతల అంశంలో ఎటువంటి ఇబ్బంది రాలేదని, రాత్రి 7 గంటల తర్వత ఓటింగ్ డేటా ఎంట్రీ మొదవుతుందన్నారు.

**ఇవిఎం తరలింపు వాహనాలకు జిపిఎస్ :**

పోలింగ్ కేంద్రాల నుండి స్ట్రాంగ్ రూమ్ వరకు ఇవిఎంలను తరలించే వాహనాలకు జిపిఎస్‌ను అనుసంధానం చేశామని వికాస్ రాజ్ తె లిపారు. స్ట్రాంగ్ రూములకు తరలించే పక్రి య సోమవారం అర్ధరాత్రి రెండు గంటల వరకు కొనసాగే అవకాశం ఉ న్నదన్నారు. ఎన్నికల పరిశీలకులు అన్ని నివేదికను పరిశీలించిన తర్వా త, ఉప ఎన్నిక అంశంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 44 స్ట్రాంగ్ రూములు ఉన్నాయని, ఇక్కడే ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. 150 పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలో సమస్యలు వస్తే వాటిని మార్చినట్టు వికాస్ రాజ్ వివరించారు.

# కేసిఆర్ కేఏ పాల్ లాగే మాట్లాడుతున్నాడు...!

### కేసిఆర్‌పై నాకు సానుభూతి ఉంది.. కొడంగల్‌లో కుటుంబ సమేతంగా ఓటు వేసిన సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / కొడంగల్:** ఓటమి పాలవ్వడంతో మానసిక ఒత్తిడితో.. నిరాశతో కేసిఆర్ కూడా కేఏ పాల్ లాగే మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కుటుంబ సమేతంగా కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితో పాటు సోదరుడు తిరుపతిరెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పాలమూర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశి చంద్‌రెడ్డితో కలిసి తమ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి 39.5 శాతం ఓట్లు వచ్చాయని ఈ పార్లమెంట్ ఎన్నికలలో అంతకు మించి ఓటింగ్ శాతం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు మా ప్రభుత్వ పాలనకు రెఫరెండం అంటు వాఖ్యానించారు. కాని బిజేపీ పార్టీ కూడా మోది పాలనకు రెఫరెండం అంటు చెప్పుకోస్తున్నారని అన్నారు. సెప్టెంబర్ 17,2025తో మోదికి 75 సంవత్సరాలు నిండుతాయి అలాంటప్పుడు వయస్సు పరిమితి దాటితే ఎవ్వరు ప్రదాని అనేది బిజేపీ తేల్చుకోవాలని హితవుపలికారు. దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని జోష్యం చెప్పారు. మ్యాజిక్ ఫిగర్ రాకపోతే బిజేపీ ఎన్డీఏకు దేశంలో మద్దతు ఇవ్వడానికి ఎవ్వరు సిద్దంగా లేరన్నారు. బిజేపీ పార్టీ కేవలం 336 సీట్లకే పోటీ చేస్తుంటే 400 సీట్లు ఏలా వస్తాయని అంటున్నారు. ఇది ఏలా సాధ్యం అంటు ప్రశ్నించారు. 13 ఏళ్లుగా సిఎం, 10 ఏళ్లుగా పిఎంగా పనిచేసిన మోది మన రాజ్యాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదని రేవంత్ తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవని, సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే దేశంలోత రిజర్వేషన్లు అమలులో ఉన్నాయన్నారు. ముస్లీం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఏపిలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. దేశ ప్రజలకు మోదీ మాయమాటలు చెబుతు మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇండియా కూటమి పేరుతో మేం ప్రజలకు ఓట్లు అడుతుంటే... బిజేపీ మాత్రం మోదీ పేరు తో ఓట్లు అడుగుతుందని వాఖ్యానించారు. ఎవర్ నామ్ దార్.... ఎవరు కామ్ దార్... దీన్ని బట్టే ప్రతి ఒక్కరికి అర్థమవుతుందని ఎవ్వరు అట్టడుగు ప్రజల కోసం పనిచేస్తున్నారో చర్చకు సిద్దం అంటు ప్రతిపక్ష పార్టీల నాయకులకు సవాల్ చేశారు. దేశంలో మోదీ వ్యతిరేక వేవ్ నడుస్తోందన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడిన మోదీపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. నవనీత్ కౌర్ 15 సెకన్ల కామెంట్స్‌పై చర్యలు లేవని, బిజేపీ నేతలు ఎవ్వరు ఏమి మాట్లాడిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కాని కాంగ్రెస్ వాళ్లు ఒక చిన్న వీడియో వైరల్ కేసులో మాపై కేసులు మోపి ఎంఏచ్ఏ కు రంగంలోకి దిపింది బిజేపీ అంటు మండిపడ్డారు. ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తుందనడానికి ఇది ఒక నిదర్శనమని చెప్పుకోచ్చారు. బిజేపీ వాషింగ్ మిషన్‌లో చేరగానే కొంతమంది అవినీతి నాయకుల మరకలు తోలగిపోయాయా అంటు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి అధాని, అంబానిలు డబ్బులు ఇస్తున్నారన్న మోదీకి ఒక్కడే అడుగుతున్న ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను పంపి అదానీ, అంబానీల ఆఫీసులపై సోదాలు నిర్వహించాలని మోదీ ఆరోపణాలు నిజమైతే ప్రజలకు పూర్తి వివరాలు తెలిసిపోతాయని అన్నారు. మోదీ ఎందుకు విచారణకు ముందుకు వెళ్లడం లేదా తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో కేసిఆర్ ఒక అవినీతి పాలనను సాగించారని ధనిక తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చి తెలంగాణకు చీడపురుగా ఉన్నారని విమర్శలు గుప్పించారు. కేసిఆర్ చేసిన అప్పులను తీర్చుతు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. రుణమాఫి అనేది అసాధ్యమైన టాస్క్ కాదన్నారు. ఎట్టి పరిస్థితులలో వచే పంద్రాగస్టు లోగ రైతులకు రుణమాఫి చేసి తీరుతామని రేవంత్ చెప్పారు. వీరితో పాటు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పిఏసిఎస్ చైర్మెన్ కట్కం శివ కుమార్‌గుప్త, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణం రాజు, పార్టీ మం డల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, శ్రీరాంరెడ్డి, టీపీసీసీ సభ్యులు మహ్మద్ యూసుఫ్, పట్టణ అధ్యక్షుడు నయ్యాం, ధాములతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 1717 మంది భవితవ్యం

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో బురఖా వేసుకుని ఓటింగ్ వచ్చిన మహిళలను ముసుగు తొలగించి గుర్తింపు కార్డును ధృవీకరించాలని బిజెపి అభ్యర్థి మాధవీలత డిమాండ్ చేశారన్న ఆరోపణలపై వీడియో క్లిప్పులు వెలుగుచూడటంతో ఎన్నికల సంఘం అధికారులు ఆమెపై కేసు నమోదు చేశారు.

**ఆంధ్రలో ఇవిఎం ధ్వంసం, హింస:** వేమూరు, ఇచ్ఛాపురం, కుప్పం, మాచెర్ల, మా ర్కాపురం, పాలకొండ, పెడకూరపాడు సహా అనేక నియోజకవర్గాలలో తెలుగుదేశంపార్టీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిందంటూ వైఎస్ఆర్‌సిపి ఎన్నికల సంఘానికి లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. వేమూరు ని యోజకవర్గంలో ఐదు పోలింగ్ బూత్‌లను టిడిపి తన స్వాధీనం చేసుకుందనీ, తక్షణం అదనంగా పోలీసు బలగాలను అక్కడికి తరలించాలనీ కోరింది. కుప్పం నియోజకవర్గంలో పోలింగ్ అధికారి బూత్‌నెంబరు 57లో ప్రతిపక్ష టిడిపి నాయకులతో కుమ్మక్కు అయ్యారనీ, రిగ్గింగ్‌కు అనుమతించారనీ వైఎస్ఆర్‌సిపి ఫిర్యాదు చేసింది. వైఎస్ఆర్‌సిపి నాయకుడు, తెనాలి ఎంఎల్‌ఎ ఎ.శివమార్ ఒక ఓటరుతో వాగ్వాదానికి దిగి అతడిపై చేయి చేసుకున్నారని పోలీసులు చెప్పారు. దాంతో ఓట ర్లు కూడా ఆయనపై తిరగబడ్డారు. రైల్వేకోడూరు నియోజకవర్గం దేవరపల్లిలో ఇవిఎం ధ్వంసం కాగా, టిడిపి, వైఎస్ఆర్‌సిపిలకు చెం దిన కార్లు కూడా ధ్వంసమయ్యాయి. మైదుకూరు నియోజకవర్గంలో నక్కలదిన్నె గ్రామం లో టిడిపి పోలింగ్ ఏజంట్‌పై దాడి చేశారు. తర్వాత అతడిని ఆసుపత్రికి తరలించారు. చిత్తూరులోని గుడిపాల మండలం మండి కృష్ణాపురం గ్రామంలో వైఎస్ఆర్‌సిపి ఏజంట్ సురేశ్ రెడ్డిని టిడిపి మద్దతుదారులు కత్తులతో పొడిచారు. దర్శి నియోజకవర్గం ఆరవల్లిపాడులో పార్టీ సభ్యులు బి.అంజరెడ్డిపై టిడిపి మద్దతుదారులు దాడి చేశారని వైసిపి ఫిర్యాదు చేసిం ది. ఇదిలా ఉండగా, పశ్చిమ బెంగాల్‌లోని ఎ నిమిద నియోజకవర్గాలలో చెదురుమదురు ఘటనలు జరిగాయి. బీర్భూమ్, బర్ధమాన్-దుర్గాపూర్ నియోజకవర్గాలలోని పలు ప్రాం తాలలో టిఎంసి - బిజెపి కార్యకర్తల మధ్య ఘర్షణలు చెలరేగాయి. బిజెపి అభ్యర్థి దిఈప్ ఘోష్ కాన్వాయ్‌పై టిఎంసి కార్యకర్తలు రెండుచోట్ల రాళ్ళు విసిరారు. కాగా ఒడిశాలో పలుచోట్ల ఇవిఎంలు మొరాయించాయి. 65 బ్యాలెట్ యూనిట్లు, 83 కంట్రోల్ యూనిట్లు, 110 వివిప్యాట్‌లను మళ్ళీ తీసుకువెళ్ళి అమర్చారు. ఒడిశాలో ఇద్దరు పోలింగ్ అధికారులను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. జార్ఖండ్‌లో మావోయిస్టులు ఓటర్లను వెళ్ళనీయకుండా చెట్లు కొట్టేసి ఓటింగ్ ప్రక్రియను అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని భద్రతాదళాలు వమ్ముచేశాయి.

## సెల్వరాజ్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

ట్రిబ్యునల్ ఏర్పాటును కోరుతూ 1989లో తంజావూరు నుండి వేదారణ్యం వరకు 110 కిలోమీటర్ల మేరకు భారీ మానవహారాన్ని ని ర్వహించారు. మత, కుల అరాచకాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు, భూ పోరాటాల కు నేతృత్వం వహించారు. వ్యవసాయంలో కొ త్త పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, నిరక్షరాస్యతను పారద్రోలేందుకు విశేష కృషి చేశారు.

**డి.రాజా, తమిళనాడు సిఎం స్టాలిన్ సంతాపం:** సెల్వరాజ్ మృతికి ప్రముఖులు అనేక మంది సంతాపం వ్యక్తం చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఒక సంతాప ప్ర కటనలో ప్రజల హక్కులు, డెల్టా ప్రాంత రై తుల కోసం అనేక నిరసన పోరాటాలను ఎంపి సెల్వరాజ్ నిర్వహించారని కొనియాడారు. ఆయన పట్ల తనకు ప్రత్యేక అభిమానమని, ఇద్దరం ఒకే ప్రాంతం చెందిన వారమని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ముతురాసన్ కూడా సంతాపం వ్యక్తం చేశారు. సిపిఐ ఎం పి సెల్వరాజ్ మృతి పట్ల సిపిఐ జాతీయ ప్రధా న కార్యదర్శి డి.రాజా విచారం వ్యక్తం చేశారు. ఆయన క్షేత్రస్థాయి నాయకుడని, దశాబ్దాల క్రితం యువజనోద్యమం నుండి తమ సాన్నిహిత్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. 4 సా ర్లు ఎంపిగా ఎన్నికైన సెల్వరాజ్ కార్మికులు, రై తులు, వ్యవసాయ కార్మికుల సంక్షేమం కో సం చురుకైన పాత్ర పోషించారని తెలిపారు.

**అంత్యక్రియలకు నారాయణ:** సెల్వరాజ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు సిపిఐ జాతీయ కార్యదర్శి, తమిళనాడు ఇన్‌చార్జ్ డాక్టర్ కె.నారాయణ సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుండి నాగపట్టిణంకు వెళ్ళారు. సెల్వరాజ్‌ను స్థానిక ప్రజలు దేవుడిలాగా చూస్తారని, అలాంటి ఆదర్శపూరిత వ్యక్తి చనిపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, చాడ సంతాపం:**

ఎంపి సెల్వరాజ్ ధైర్యశాలి, మంచి పోరాట యోధుడు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన మర ణం కేవలం తమిళనాడుకే కాకుండా, దేశం యావత్తు కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని అ న్నారు. సెల్వరాజ్ కుటుంబ సభ్యులకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి తరుపున ప్రగాఢ సా నుభూతిని తెలియజేశారు. సెల్వరాజ్ మర ణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెం కట్ రెడ్డి అన్నారు. యువజన సమాఖ్యలో పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగి, నాలుగు సార్లు ఎంపి కావడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

## పోటెత్తిన ఓటర్లు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాల్లోని ఈవీఎంలను అధికార పార్టీకి చెందిన శ్రేణులు పగులగొట్టారు. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు దొండపాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడానికి వెళ్లిన సందర్భంగా ప్రత్యర్థులు ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఆయన వెంట వచ్చిన మూడు కార్లను ధ్వంసం చేశారు. రెంటాల గ్రామంలో టీడీపీ ఏజెంట్లను భయపెట్టి బయటకు పంపడంతో అక్కడకు టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి చేరుకున్నారు. దీంతో ఆయనను వైసీపీ నేతలు అడ్డుకుని, ఆయన కారుతో పాటు, వెంట వచ్చిన నాలుగు కార్లను ధ్వంసం చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని దలవాయిలో ఈవీఎంను ధ్వంసం చేశారు. తుమ్మకోటలో టీడీపీకి అనుకూలంగా ఓట్లు పడుతున్నాయన్న ప్రచారంతో వైసీపీ శ్రేణులు పోలింగ్‌బూత్‌లోకి చొరబడి ఈవీఎంను ధ్వంసం చేశారు. కొత్తపల్లి సర్పంచ్‌పై దాడి చేశారు. సత్తెనపల్లి, అచ్చంపేటలో టీడీపీ, వైసీపీ శ్రేణులు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. వినుకొండ నియోజకవర్గ పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో ఇరువర్గాలకు చెందిన ఏజెంట్ల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో వీవీ ప్యాట్స్ ధ్వంసమై పోలింగ్ కొద్దిపేపు ఆగింది. నెల్లూరు జిల్లా వరికుంటపాడు జెడ్పీ స్కూలులో, చిత్తూరు జిల్లా నగరి సీతారామపురంలో, అల్లూరి జిల్లా రెంతాడ తదితర అనేక ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించి పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. విజయవాడ పార్లమెంటు అభ్యర్థి కేశినేని చిన్ని వాహనాలపై కంభంపాడులో వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయి. దాచేపల్లి మండలం తంగెడలో వైసీపీ శ్రేణులు నాటు బాంబులు, పెట్రోల్ సీసాలతో దాడులకు తెగబడ్డారు. పోలింగ్ ముగిసే సమయంలో ఓటు విషయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఓటింగ్ శాతం పెరిగితే తమకు నష్టం జరగుతుందేమోనన్న భయంతో వైసీపీ శ్రేణులు నాటు బాంబులతో దాడులకు దిగాయి. మరోవైపు రాళ్ల వర్షం కురిపించడంతో ఓటర్లు భయాందోళనకు గురై పోలింగ్ కేంద్రం నుంచి పరుగులు తీశారు. ఈ ఘర్షణలో సుమారు పది ద్విచక్రవాహనాలు, నాలుగు దుకాణాలు మంటల్లో దగ్ధమయ్యాయి. నరసరావుపేట పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద అధికారపార్టీ శ్రేణులు హల్‌చల్ చేశాయి. టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవింద్ బాబు కారుపై దాడి చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. అనంతరం టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటివద్దకు వెళ్లి ఆందోళన చేపట్టాయి. దీంతో ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడికి చేరుకున్న పోలీసులు రబ్బర్ బుల్లెట్లు, బాష్పవాయువు ప్రయోగించి రెండు వర్గాలను చెదరగొట్టారు. నకరికల్లు మండలం చీమలమర్రిలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా 20 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. తెనాలిలో వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ప్రశ్నించిన ఓటరుపై చేయిచేసుకోగా, తిరిగి ఆ ఓటరు కూడా ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించాడు. దీంతో హతాశులైన ఆయన వెంట ఉన్న అనుచరులు ఆ ఓటరుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతపురం జిల్లాలోనూ వివిధ నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణలు జరిగాయి.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |



## తీరుమార్చుకోని కంగన

వివాదాస్పద వ్యాఖ్యలకు మారుపేరుగా నిలిచిన ప్రముఖ నటి కంగనా రనౌత్ ఎన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ తన తీరు మార్చుకోవడం లేదు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గం నుంచి బిజెపి తరఫున ఆమె పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. భారత దేశ తొలి ప్రధాని సుభాష్ చంద్రబోస్ అంటూ కొత్త వాదనకు తెరతీసిన ఆమె, మితిమీరిన ఉత్సాహంతో, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్‌ను విమర్శించబోయి, బిజెపికే చెందిన తేజస్వీ సూర్యపై నోరు పారేసుకొని, తీవ్రమైన ట్రోలింగ్‌ను ఎదుర్కొంది. తాజాగా, భారత దేశాన్ని 'హిందూ రాష్ట్ర'గా మార్చే ప్రయత్నాలు 2014లోనే మొదలయ్యాయని వ్యాఖ్యానించి, బిజెపిపై ప్రతిపక్ష పార్టీలు చాలాకాలంగా చేస్తున్న విమర్శలను పరోక్షంగా బలపరచింది. భారత దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, భారత్‌ను హిందూ దేశంగా ఎందుకు ప్రకటించలేదని ఆమె ప్రశ్నించారు. ఆ పొరపాటును సరిచేసేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ప్రతిజ్ఞ కూడా చేశారు. ఆమెను ఉటంకిస్తూ ఎఎన్‌ఐ కథనం ప్రకారం, కాంగ్రెస్‌పై ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. 'మన పూర్వీకులు మొఘలులు, బ్రిటిషర్ల పాలనల్లో శతాబ్దాల తరబడి బానిసత్వాన్ని చవిచూశారు. ఎన్నో బాధలు పడ్డారు. ఎంతో మంది త్యాగాల ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించింది. కానీ, బ్రిటిష్ ఆలోచనా సరళిని అనుసరిస్తూ, భారత్‌ను హిందూ రాష్ట్రంగా ప్రకటించలేకపోయారు. ఈ పొరపాటును సవరించాల్సిన అవసరం ఉంది' అంటూ, రాజ్యాంగంలో నిర్దేశించిన లౌకిక విధానాన్ని తొలగించి, మత రాజ్యాన్ని స్థాపించేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నదనే విషయాన్ని పరోక్షంగా ప్రకటించింది. ఇలా వుంటే, మండి నియోజకవర్గంలో కాంగ్రెస ఆధిపత్యమే ఎక్కువ. మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ కుమారుడు విక్రమాదిత్య సింగ్ కాంగ్రెస్ తరఫున పోటీలో ఉన్నారు. ఆయన నుంచి కంగనకు గట్టి పోటీ తప్పదనేది నిజం. జూన్ ఒకటో తేదీన ఇక్కడ పోలింగ్ జరుగుతుంది. ఈలోగా కంగన ఇంకెన్ని వ్యాఖ్యలు చేస్తుందో.. ఇంకెన్ని వివాదాలకు తెరదీస్తుందో చూడాలి.

## వివాదానికి తెర!



తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నాయకుడు కుణాల్ ఘోష్‌తో పార్టీకి ఉన్న వివాదానికి తెరపడింది. ఏడో దశ పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్‌కు టిఎంసి అధికారికంగా సమర్పించిన జాబితాలో ఘోష్ పేరు ఉంది. దీనితో అతను మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే అవకాశం లభించింది. ఉత్తర కోల్‌కతా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి తాపస్ రేతో కలిసి ఒక సభలో ఘోష్ పాల్గొనడం వివాదానికి కారణమైంది. టిఎంసి ఎమ్మెల్యేగా ఉన్న తాపస్ రే, తన పదవితోపాటు, పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేసి, బిజెపిలో చేరారు. ఆ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దిగారు. ఆయనతో కలిసి ఒకే వేదికను పంచుకున్న ఘోష్‌ను టిఎంసి అధినాయకత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. తన స్టార్ క్యాంపైనర్ల జాబితా నుంచి పేరు తొలగించింది. అయితే, టిఎంసి రాజ్యసభ సభ్యుడు డెరిక్ ఒబ్రియాన్, పశ్చిమ బెంగాల్ విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసుతో ఘోష్ చర్చలు జరిపారు. దీనితో అతను తిరిగి టిఎంసిలో కీలక భూమిక పోషిస్తారనే విషయం దాదాపుగా స్పష్టమైంది. అనుకున్న విధంగానే చివరి దశ పోలింగ్‌లో టిఎంసి స్టార్ క్యాంపైనర్ల జాబితాలో అతనికి తిరిగి చోటు దక్కింది. బిజెపితో సన్నిహితంగా ఉంటున్నాడన్న విమర్శలు ఎదుర్కొంటున్న ఘోష్ ఇప్పటికైనా, తన పంథాను మార్చుకోకపోతే, టిఎంసి టిఎంసి అధిష్టాని ఆగ్రహానికి గురికాక తప్పదు.

### రంగంలోకి ఇండిపెండెంట్ అభ్యర్థి

## లడఖ్‌లో త్రిముఖ పోరు



సెరింగ్ నామ్‌గ్యాల్



హాజీ హనీఫా జాన్



తాషి గ్యాల్సన్

లడఖ్ లోక్‌సభ నియోజకవర్గంలో బిజెపి, కాంగ్రెస్ మధ్య ప్రత్యక్ష పోటీ ఉంటుందని అంతా ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చిన తరుణంలో, స్థానిక గ్రూపులు బలపరుస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి రంగంలోకి దిగడంతో, త్రిముఖ పోరుగా మారింది. విస్తీర్ణం పరంగా (173.266 చదరపు కిలోమీటర్లు) దేశంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన లడఖ్‌లో ఈనెల 20న పోలింగ్ జరగనుంది. జమ్మూకశ్మీర్‌ను విభజించి, 2019లో కేంద్ర పాలిత ప్రాంత హోదాను కల్పించిన తర్వాత ఈ ప్రాంతంలో జరుగుతున్న మొదటి లోక్‌సభ ఎన్నిక ఇదే. తాషి గ్యాల్సన్‌ను బిజెపి తన అభ్యర్థిగా నిలబెట్టింది. అత్యధిక పర్యాయాలు ఈ సీట్‌ను గెల్చుకున్న కాంగ్రెస్ తరఫున సెరింగ్ నామ్‌గ్యాల్ రంగంలో ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)తో కుదిరిన ఒప్పందం ప్రకారం, ఆ పార్టీ మద్దతు కాంగ్రెస్‌కు లభిస్తుంది. కాగా, చివరి క్షణాల్లో కార్గిల్ డెమోక్రాటిక్ అలయన్స్ (కెడిఎ) బలపరచిన హాజీ హనీఫా జాన్ ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధం కావడంతో, త్రిముఖ పోరులో గెలిచేది ఎవరనేది ఆసక్తి రేపుతున్నది. ప్రాంతీయ గ్రూపులు మద్దతు ప్రకటించడంతో, జాన్ గట్టిపోటీని ఇవ్వడం ఖాయంగా కనిపిస్తున్నది.

లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఎబి) ఆధ్వర్యంలో, కొన్ని సంవత్సరాలుగా స్థానిక సమస్యలపై పోరు కొనసాగుతున్నది. ఇందులో కీలకంగా వ్యవహరించిన జాన్‌కు ప్రజా ఉద్యమాలను నిర్మించగలిగే శక్తిసామర్థ్యాలు ఉన్నాయి. స్థానికులకు చేరువగా ఉంటూ, వారి డిమాండ్ల పరిష్కారం కోసం పోరాడుతున్న జాన్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సుమారు 1.84 లక్షల మంది ఓటర్లు ఉన్న ఈ స్థానంలో కాంగ్రెస్‌తోపాటు బిజెపికి కూడా అతని రాకతో సవాళ్లు పెరిగాయి. ఇక్కడ ముస్లిం జనాభా ఎక్కువ. కార్గిల్ జిల్లాలో 95,926, లేహ్ జిల్లాలో 88,877 మంది చొప్పున ఓటర్లు ఉన్నారు. చాలాకాలంగా తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి. దీనితో బిజెపి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. తమ డిమాండ్ల పరిష్కారం కోసం స్థానికులు నిర్వహించిన రిలే నిరాహార దీక్షలకు ఎన్నికల కారణంగా బ్రేక్ పడింది.

ప్రముఖ విద్యావేత్త, సంఘ సంస్కర్త సోనమ్ వాంగ్‌చుక కూడా ఈ ఉద్యమంలో భాగస్వామి. ఆయన తన 21 రోజుల నిరాహార దీక్షను మార్చి 26న ముగించారు. లోక్‌సభ ఎన్నికలపై ఈ అంశం ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తున్నది. స్థానిక సమస్యలకు ఓటర్లు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో, బిజెపికి విజయావకాశాలు గణనీయంగా పడిపోయాయి. పరిస్థితిని చక్కదిద్దడానికి కేంద్ర మంత్రి కిరణ్ రిజుజును బిజెపి అధిష్టానం లడఖ్‌కు పంపింది. ఆయన స్థానిక గ్రూపు ల నేతలను కలిసి చర్చలు జరిపినా, హామీలు ఇచ్చినా ఆశించిన ఫలితం రాలేదు. ఈ గ్రూపులు స్వతంత్ర అభ్యర్థి జాన్‌కు మద్దతు పలకడమే బిజెపి పట్టు కోల్పోయిందనడానికి నిదర్శనం.

ఏ రకంగా చూసినా, ఇటు బిజెపికి, అటు కాంగ్రెస్‌కు ఈసారి గట్టిపోటీ తప్పదని స్పష్టమవుతున్నది.

## ఓటుకు పోహా, జిలేబీ!



ఓటుకు నోట్లు ఇచ్చేవారు కొందరు.. మద్యం బాటిళ్లు, బహుమతులు ఇచ్చేవారు మరికొందరు. కానీ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 'ఓటుకు జిలేబీ' బాగా ప్రచారమైంది. మొత్తం 29 స్థానాలకుగాను, ఇండోర్‌తో సహా చివరి ఎనిమిది నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ ముగిసింది. కాగా, తమతమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎక్కువమంది ఓటర్లను ఆకర్షించేందుకు ప్రఖ్యాత ఫుడ్‌స్ట్రీట్ '56 దుకాన్' ఓ ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ముందుగా ఓటువేసిన 3000 మందికి ఉచితంగా 'పోహా', 'జిలేబీ' అందిస్తామని ప్రకటించింది. అందుకు తగినట్టుగానే తమ ఐదు బ్రాంచీల్లో పోహా, జిలేబీని అందించింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9.30మధ్యలో ఓటువేసిన మూడు వేల మంది పోహా, జిలేబీ రుచి చూశా రు. మొదటిసారి ఓటు వేసిన యువతకు, సీనియర్ సిటిజన్లకు ఈ రెంటితో పాటు ఐస్‌క్రీమ్ ను కూడా ఈ సంస్థ ఉచితంగా పంచిపెట్టింది. ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తున్న ఈ స్ట్రీట్ ఫుడ్ సంస్థను అంతా ప్రశంసిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు కూడా చేయని గొప్ప పనికి ముందుకు రావడం అద్భుతమని అంటున్నారు.

కాగా, ఇండోర్ లోక్‌సభ నియోజకవర్గంలో 25,26,803 మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోనే ఇది అతి పెద్ద నియోజకవర్గం ఇదే. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో, బిజెపి సిట్టింగ్ ఎంపి శంకర్ లాల్వానీ విజయం సులభమవుతుందని అంటున్నారు.

1989 నుంచి బిజెపికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఈసారి 14 మంది పోటీపడుతున్నప్పటికీ, ఆ పార్టీదే పైచేయిగా ఉంటుందని అంచనా. కాగా, కాంగ్రెస్ మాత్రం 'నోటా' (ఎవరికీ కాదు) ఆప్షన్‌ను ఎంచుకోవాలని ఓటర్లను కోరింది.

పోలింగ్ ముగిసిన నేపథ్యంలో, విజయం ఎవరిని వరిస్తుందో తెలియాలంటే, జూన్ 4వ తేదీ వరకూ వేచి చూడక తప్పదు.

## కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం ఉంది

### రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/మంథని:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనపై ప్రజల్లో విశ్వాసం ఉందని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ పథకాల అమలు విషయంలో ప్రజల కు మేలు చేయాలనే తపనతో ముందుకు నడుస్తుందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మూడు మాసాల్లోపే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కొంత స్థబ్దత ఏర్పడిందన్నారు. ఎన్నికల కోడ్ ముగియగా నే ప్రతి పథకం అమలులోకి తీసుకువస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దఎత్తున ప్రజలు కాంగ్రెస్ పార్టీకే ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రంలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

తనతో పాటు పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ఆయా నియోజక వర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించడం జరిగిందని, పోలింగ్ సరళి కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం గడ్డం వంశీకృష్ణ భారీ మెజార్టీతో గెలువడం ఖాయమేనని ఆయన స్పష్టం చేశారు. అనంతరం తన స్వగ్రామైన కాటా రం మండలం ధన్వాడ గ్రామంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఆయన సోదరుడు శ్రీనుబాబు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి వెంట జిల్లా అధికార ప్రతినిధి ఇనుముల సతీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ సీపతి బానయ్య, వార్డు కౌన్సిలర్ చొప్పకట్ల హన్మంతరావు, నాయకులు గోటికారి కిషన్‌జీ, మూల పురుషోత్తంరెడ్డి, మంథని సురేష్, పాపారావు, సదానందంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో ఉద్రిక్తత

## గానుగుపహాడ్‌లో లాఠీచార్జి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం పోలింగ్ జరగగా పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జనగామ పట్టణంలోని ధర్మకంచెలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. జనగామ మండలం గానుగుపహాడ్‌లో రాజకీయ పార్టీల నాయకులు, ఓటర్లపై పోలీసులు లాఠీచార్జీ చేశారు. మరో ఒకటిరెండు చోట్ల చెదురుముదురు సంఘటనలు జరగగా మిగతా చోట్ల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. వేసవి ఎండను సైతం లెక్కచేయకుండా వచ్చి ఓట్లు వేశారు. జనగామ పట్టణంలో జరిగిన సంఘటన నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బిఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశంలు పలు బూత్‌లను పరిశీలించారు.

**ధర్మకంచెలో బాహాబాహీ**

జనగామ పట్టణంలోని ధర్మకంచె పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాయకుల మధ్య బాహాబాహీగా గొడవ జరిగింది. ధర్మకంచె పాఠశాలలో మూడు బూత్‌లు ఏర్పాటు చేయగా 263 బూత్‌ను పరిశీలించేందుకు కాంగ్రెస్ ఎలక్షన్ ఏజెంట్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి వెళ్లారు. బూత్‌లో ఉన్న బిఆర్‌ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్ మీరెలా వస్తారన్ని ప్రశ్నించారు. తాను ఎన్నికల ఎజెంట్‌ను అని చెప్పినా వినిపించుకోకుండా పోలింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. గొడవ విషయం తెలుసుకున్న ఎసిపి అంఖిత్‌కుమార్, సిఐ రఘుపతిరెడ్డి అక్కడకు చేరుకున్నారు. పోలింగ్ ఏజెంట్ పత్రాలు చూపాలని కోరడంతో కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి చూపించగా పోలీస్‌లు ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. బూత్‌ను పరిశీలించిన కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి బయటకు వెళుతుండగా సుమారు 15 మందితో పల్లా రాజేశ్వర్‌రెడ్డి పోలింగ్ స్టేషన్‌కు వచ్చారు. ఎసిపి అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే గొడవ జరిగింది. ఎసిపి వారించినా ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వినలేదు. పోలీసులు ఎంతచెప్పినా వినకపోడంతో ఎసిపి అంఖిత్‌కుమార్ ఆగ్రహానికి లోనయ్యారు. ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని వెనక్కు నెట్టేశారు. డోంట్ టచ్ మీ అంటు పల్లా పదేపదే అంటున్నా పోలీసులు వెనక్కునెట్టి పంపించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి హుటాహుటిన అక్కడకు చేరుకొని ఎన్నికల ఎజెంట్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డితో కలిసి మళ్లీ పోలింగ్ బూత్‌లోకి వెళ్లి పరిశీలించారు. ఇరు వర్గాలను శాంతింపజేసే క్రమంలో పోలీసులు వ్యయప్రయాసలకు గురయ్యారు. గొడవ సందర్భంగా 263 బూత్‌లో అరగంటకు పైగా పోలింగ్ నిలిచిపోయింది. ఎసిపి, సిఐలు ఎజెంట్ల మధ్య గొడవను సర్దుమణచడంతో తిరిగి ప్రారంభమైంది.

**గానుగుపహాడ్‌లో :** జనగామ మండలంలోని గానుగుపహాడ్‌లో పోలీసులు రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఓటర్లపై లాఠీ చార్జీ చేశారు. బిజెపి నాయకులు బాలెట్ బాక్స్‌తో ప్రచారం చేయడంతో పాటు కండువాలు కప్పుకున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ రఘుపతిరెడ్డి హుటాహుటిన అక్కడకు వెళ్లారు. కొందరు బాలెట్ బాక్స్‌తో నమునాతో ప్రచారం చేయడానికి గుర్తించి లాఠీచార్జీ చేశారు. అయితే అక్కడ కొంద రు ఓటర్లకు సైతం దెబ్బలు తగలడంతో వారు ఆందోళన చేశారు. తరువాత వారిని శాంతిపజేయగా పోలింగ్ ప్రశాంతం జరిగింది.

**బిజెపి ఎజెంటుగా పల్లా : కాంగ్రెస్ అభ్యర్థి చామల**

జనగామ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి బిజెపి ఎజెంట్‌గా పనిచేశారని, బిజెపి అభ్యర్థికి ఓట్లు వేయించమని చెప్పడంతో కార్యకర్తలు సైతం విస్మయానికి గురయ్యారని కాంగ్రెస్ అభ్యర్థి చామల విమర్శించారు. బిజెపి ఓట్లు వేయిస్తూ బూత్‌ల వద్ద గొడవలు చేస్తున్నారు. ఇది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. బిఆర్‌ఎస్ కండువా తీసేసి బిజెపి కండువా కప్పుకుంటే మంచిదని హితవు పలికారు. మద్యం కేసులో అరెస్ట్ అయి తీహార్ జైల్లో ఉన్న కవితను విడిపించుకోవడం కోసమే బిఆర్‌ఎస్ పార్టీ బిజెపితో కుమ్మక్కు అయ్యిందని విమర్శించారు.

## కేంద్రంలో ప్రాంతీయ పార్టీలదే కీలకపాత్ర

### మాజీ సిఎం కెసిఆర్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో ప్రాంతీయ పార్టీలే కీలకపాత్ర వహిస్తాయని బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట చంద్రశేఖర్‌రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేటంత స్పష్టమైన మెజార్టీ రాకపోవచ్చన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కెసిఆర్ తన పురిటగడ్డ చింతమడక గ్రామంలో సతీసమేతంగా ఓటు వేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పొందుపర్చుకున్న నిబంధనల ప్రకారం 75 ఏండ్లు దాటిన తర్వాత ఎవ్వరు ఎలాంటి పదవులు చేపట్టరాదన్నారు. ఈ నిబంధన ప్రకారం నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి పదవి నుండి తప్పుకోవాల్సి వస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 70శాతం పైగా పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఇండియా కూటమిలో చేరుతారా అని విలేకరుల అడిగిన ప్రశ్నకు కెసిఆర్ సమాధానాన్ని దాటవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు, సతీమణి శోభ తదితరులు పాల్గొన్నారు.





**చింతమడకలో :** కెసిఆర్ సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవెల్లిలో స్థిర నివాసం ఏర్పాటు చేసినప్పటికి ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తన స్వంత గ్రామమైన చింతమడకలో ఓటు హక్కును వినియోగించుకోవటం ఆనవాయితీగా వస్తుంది. సోమవారం ఉదయం 11 గంటలకు చింతమడకకు కెసిఆర్ సతీమణి శోభతో కలసి చేరుకున్నారు. హెలిఫ్యాడ్ నుండి కెసిఆర్, శోభ కారులో పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. చింతమడక పోలింగ్ కేంద్రానికి వచ్చిన కెసిఆర్‌ను చూసేందుకు గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కెసిఆర్ వారికి అభివాదం చేసి.. ఆప్యాయంగా పలకరించారు. గ్రామస్తులందరిని పలుకరిస్తూ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకన్న అనంతరం హెలిప్యాడ్ లో తిరుగు ప్రయాణమైనారు.

## కాంగ్రెస్‌కే మొగ్గు చూపిన ఖమ్మం ఓటర్లు

### నగరంలో భారీగా తగ్గిన పోలింగ్

### పల్లెల్లో ఉత్సాహంగా ఓటేసిన జనం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఓటర్లు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 10 గంటల వరకు పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. మహిళా ఓటర్లు సైతం వరుసలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మం పార్లమెంటు పరిధి లో అశ్వారావుపేట నియోజక వర్గంలో అత్యధికంగా 80 శాతం పోలింగ్ జరిగింది. పాలేరులో 78 శాతం పోలింగ్ జరగగా మిగిలిన నియోజక వర్గాల్లో కడపటి వార్తలు అందే సమయానికి 80 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణ ప్రాంతాలలో ఓటర్లు ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు ఉత్సుకత ప్రదర్శించలేదు. మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని పినపాక నియోజక వర్గంలో 65.91శాతం, ఇల్లందు నియోజక వర్గంలో 69.11శాతం, భద్రాచలం నియోజక వర్గంలో 64.72 శాతం ఓటింగ్ నమోదైంది. ఇదిలా ఉండగా బిజెపి గణనీయంగా ఓట్లు చీలుస్తుందని విశ్లేషకులు భావించగా పోలింగ్ నాటికి ఆ పరిస్థితి లేకుండాపోయింది. కొన్ని సామాజిక వర్గాల వారు కొద్దిశాతం బిజెపికి మొగ్గు చూపా రు. కానీ గ్రామీణ ప్రాంతాలలో మెజార్టీ పోలింగ్ బూత్‌లలో బిజెపికి ఏజెంట్లులేని పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్‌కు నియోజక వర్గ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో మొగ్గు కనిపించింది.



**ఓట్లను బహిష్కరించిన గ్రామస్తులు– సర్ది చెప్పిన అధికారులు :** ఏన్కూరు మండలం రాయ మాధారం గ్రామస్తులు నాగార్జున సాగర్ కాలువపై బ్రిడ్జి నిర్మించాలని అనేక ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ ఓటింగ్‌ను బహిష్కరించారు. ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లకుండా రోడ్డుపై కూర్చొని నిరసన తెలియజేశారు. అధికారులు గ్రామస్తులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన తర్వాత మూడు గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కొత్త గూడెం నియోజక వర్గం లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్ల గొల్లగూడెం గ్రామంలో ఓటర్లు ఓటు వేసేందుకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో ట్రైనీ ఏఎస్‌పి విక్రంసింగ్, కొత్తగూడెం డిఎస్పి రెహ్మాన్ గ్రామస్తులతో చర్చలు జరిపి పోలింగ్‌లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకున్నారు.



## ప్రజాస్వామ్యం బలపడాలంటే అందరూ ఓటు వినియోగించుకోవాలి

### సిద్దిపేటలో సతీసమేతంగా ఓటు వేసిన మాజీమంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్ అంబిటాస్ స్కూల్ 114 పోలింగ్ కేంద్రంలో మాజీమంత్రి హరీష్‌రావు కుటుంబసమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. తాను కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా ప్రజలు పోలింగ్‌లో పాల్గొంటున్నారన్నారు. గతంలో కంటే పట్టణాల్లో పోలింగ్ పెరుగుతుందన్నారు. ప్రశ్నించే గొంతుక ఉండాలని ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. మేధావులు, విద్యావంతులు, పోలింగ్‌లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ప్రజాస్వా మ్యం బలపడాలంటే అందరు ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశం భారత దేశం అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల కంటే పోలింగ్ పెరుగుతుందన్నారు, ప్రజలు తప్పకుండ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మాజీ మంత్రి హరీష్‌రావు వెంట సతీమణి శ్రీనిత, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు తదితరులు పాల్గొ న్నారు.

ప్రజాపక్షం
మంగళవారం, మే 14

# కశ్మీర్‌లో కీలకమైన ఎన్నికలు

సోమవారం సార్వత్రిక ఎన్నికల నాల్గవదశలో 9 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ–కశ్మీర్‌లో శ్రీనగర్ – మొత్తం 96 లోక్‌సభ నియోజకవర్గాలకు పోలింగ్ పరిసమాప్తమైంది. ఓటర్లు ఎండల తీక్షణతను లెక్కచేయకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు దాదాపు ప్రశాంతంగా పూర్తి అయినాయి.

ప్రస్తుత ఎన్నికల రౌండ్‌లో జమ్మూ–కశ్మీర్‌లో శ్రీనగర్ నియోజకవర్గానికి మాత్రమే పోలింగ్ జరిగింది; దాదాపు 36 శాతం ఓట్లు పోలు కావటం విశేషం. గత ఎన్నికలతో పోలిస్తే ఇది దాదాపు 3 రెట్లు. పోలింగ్ శాతం రీత్యానేగాక గత ఆరు సంవత్సరాల పరిణామాలరీత్యా కూడా ఈ పోలింగ్‌కు, తీవ్రవాదుల అడ్డా అయిన ఈ గడ్డపై ప్రశాంతంగా పోలింగ్ ముగియటానికి ప్రాధాన్యత ఉంది. ఆరేళ్ల క్రితం జమ్మూ–కశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీని రద్దుచేసి గవర్నర్‌పాలన విధించాక, నరేంద్రమోడీ రెండవ ప్రభుత్వం అధికారం చేబట్టిన కొద్ది మాసాలకే – 2019 ఆగస్టు 5న, ఆ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన భారత రాజ్యాంగం ఆర్టికల్ 370ని రద్దుచేసి, రాష్ట్రాన్ని జమ్మూ–కశ్మీర్, లఢాక్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించటం తెలిసిందే. దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజానిరసన పెల్లుబికింది. కాలమే కొన్ని గాయాలకు జవాబు చెబుతుందన్నట్లు జమ్మూ–కశ్మీర్ ప్రజలు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ, ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వ స్థాపనకోసం ఆరాటపడుతున్నారు, ఆందోళన చేస్తున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు భౌతిక పరిస్థితులు అనుకూలించినపుడు, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్రప్రభుత్వం సిద్ధం కాకపోవటం చిత్రంగా ఉంది. కేంద్ర హోంశాఖ నిరంకుశత్వం కింద ఆరేళ్లుగా బ్యూరోక్రాట్స్ పాలనలో ప్రజ లు విసుగెత్తి ఉన్నారు. రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ, అసెంబ్లీ ఎన్నికలను రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తుండగా, ముందు ఎన్నికలు, ఆ తర్వాత రాష్ట్ర ప్రతిపత్తి అంటోంది కేంద్రం. ఏదిఏమైనా ఇది ఎంత త్వరగా జరిగి ప్రజాస్వామ్యం పునరుద్ధరణ పొందితే అంతమేలు.

కేంద్రపాలిత ప్రాంతాలుగా రాష్ట్ర విభజన తదుపరి జమ్మూలో 2, కశ్మీర్‌లో 3 లోక్‌సభ స్థానాలున్నాయి. లఢాక్‌కు ఒక లోక్‌సభ స్థానం కేటాయించారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో నియోజవర్గాల సరిహద్దులను తారుమారు చేశారు. ఒక్కొక్క లోక్‌సభ నియోజకవర్గంలో 18 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూలోని 2 స్థానాలకు మాత్రమే పోటీచేస్తున్న బిజెపి, 1996 నాటినుండి తొలిసారి కశ్మీర్‌లోయలో అభ్యర్థులను పోటీకి దించలేదు. అయితే ఇంటింటికీ ఎన్నికల ప్రచారం చేస్తూ ప్రధాన పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపిలకు కాకుండా మంచి అభ్యర్థిని ఎంచుకుని ఓటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నది. అంటే బిజెపి నేరుగా కాకుండా ప్రాక్సీలను ప్రోత్సహిస్తున్నదని భావించవచ్చు. కాంగ్రెస్ కూడా అభ్యర్థులను ప్రకటించలేదు. ఎన్నికల క్షేత్రం ప్రాంతీయ పార్టీలకు అప్పగించబడింది. మరో చిత్రమేమంటే గుప్కార్ అలయెన్స్ పేరుతో ఆర్టికల్ 370 పునరుద్ధరణ, రాష్ట్ర ప్రతిపత్తి పునఃస్థాపన కోసం కృషిచేసిన కూటమిలోని ఎన్‌సి, పిడిపిలు ప్రత్యర్థులుగా పోటీచేస్తున్నాయి. శ్రీనగర్ సీటుకు పోటీదారుల్లో ఆగా సయీద్ రుహుల్లా మెహిది (ఎన్‌సి), వహీద్ ఉర్ రెహ్మాన్ పారా(పిడిపి), అష్రాఫ్ మీర్ (అప్నిపార్టీ) ప్రధాన ప్రత్యర్థులు. మాజీ కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ అజాద్ పోటీలో లేరు. అనంత్‌నాగ్–రాజోరీ, బారాముల్లా, జమ్మూ, ఉధంపూర్ పోలింగ్ జరగాల్సి ఉంది. ఎవరు గెలిచినా జాతీయ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోవచ్చు. కాని దేశానికి కిరీటంలాంటి కశ్మీర్ ప్రజల రాష్ట్రకాంక్ష నెరవేర్చటం కొత్త ప్రభుత్వ తక్షణ విధి.

# పాలస్తీనాకు సంఘీభావం మానవత్వ లక్షణం

పాలస్తీనాకు అమెరికా ఎన్ని ఓదార్పు మాటలు చెప్తున్నా.. ఐక్య రాజ్య సమితి ఎంత సాయాన్ని ప్రకటిస్తున్నా, గాజా స్ట్రిప్‌లో పరిస్థితులు మెరుగుపడలేదు సరికదా, మరింత దారుణంగా మారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా ఇజ్రాయెల్ బలగాలు కొనసాగిస్తున్న దాడులతో, రఫాసహా ఎన్నో ప్రాంతాల్లో లక్షలాది మంది పాలస్తీనియన్ల బతుకులు దుర్భరంగా మారాయి. ఆకాశాన్ని అంటే ఆలివ్ చెట్లు ఇజ్రాయెల్ దమనకాండను మౌనంగా చూస్తున్నాయి. నిరంతరంగా రోదిస్తున్నాయి. జోర్డాన్ నదిలో పారుతున్నవి నీళ్లు కాదు.. రక్తాలు, కన్నీళ్లే. పాలస్తీనియన్ల ఆశలు.. ఆశయాలు తీరని కలగా మారి, మధ్యధరా సముద్రంలో మృత జీవాల్లా తేలుతున్నాయి. పాలస్తీనాపై దురాశ ఒకరిది.. భయం మరొకరిది. దాడులు ఒకరివి.. ప్రాణాల కోసం పరుగులు మరొకరివి. శతాబ్దాల సంస్కృతుల ఘర్షణలు ఇప్పటికీ రక్తమోడుతునే ఉన్నాయి. ఇజ్రాయెల్ మత విద్వేష లావా పొంగుతునే ఉంది. గాజా స్ట్రిప్‌ను వల్లకాటిలా మారుస్తునే ఉంది. పాలస్తీనియన్ల శాంతి కపోతాలు జాత్యంహంకార దాడులకు నేరకొరుగుతున్నాయి. ఎక్కడ చూసినా దైన్యమే.. ఎంత వెతికినా శాంతి శూన్యమే. మానవతా సాయానికి అడ్డుపెట్టవద్దంటూ ఇజ్రాయెల్‌కు అమెరికా హుకుం జారీ చేయడం ఓ ప్రహసనం. రఫాను ఖాళీ చేసి, ఉత్తర దిశగా వెళ్లాలని సూచిస్తూనే, అక్కడ కూడా దాడులు కొనసాగిస్తూ ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న మారణకాండ అమెరికా, ఐరోపా దేశాలకు కనిపించడం లేదు. పెద్దరికమే తప్ప అధికారాలు లేని ఐక్య రాజ్య సమితి ఎప్పటిలా ప్రకటనలకే పరిమితమైంది. మానవతా సాయం కింద అందే ఆహారం, మందులను కూడా రఫాలోకి రానీయకుండా ఇజ్రాయెల్ దళాలు అడ్డుకుంటునే ఉన్నాయి. ఈనెల 7న 'కెరెమ్ షాలమ్' సరిహద్దును మూసేశాయి. అంతర్జాతీయ సమాజం నిరసనల నేపథ్యంలో, తిరిగి తెరచినా, ప్రజలకు అరకొర సాయమే అందుతున్నది. అడుగడుగునా విధ్వంస భవనాలు... ఆకలి కేకలు.. గాజా ఆకలితో అల్లాడిపోతున్నది. హమాస్‌ను అంతం చేయడమే లక్ష్యంగా దాడులను మరింత ఉధృతం చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నేతన్యాహు చేసిన భీషణ ప్రతిజ్ఞ అమెరికాకు వినిపించకపోవడంలో ఆశ్చర్యం ఏముంది? అసలు ఒకసారి గాజా వీధుల్లో తిరిగితే కదా అక్కడి పరిస్థితులు అర్థమయ్యేది? శిథిలాలు నిండిన వీధుల్లో ఆకలితో అల్లాడుతున్న పిల్లలు కనిపించేది. తాము సృష్టించని.. తమకు సంబంధం లేని ఘర్షణల్లో తామెందుకు బలవుతున్నామో అర్థంకాని మనుషులను కలుసుకునేది. కళ్లుండి చూస్తే, శాంతి కోసం ఎదురుచూసే ప్రజలు కనిపిస్తారు. ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని ప్రజల ముఖాల నుంచి నవ్వు మాయం కావడం కనిపిస్తుంది. అమాయక కళ్లు గుండెల్ని కదిలించివేస్తాయి. మనసుండి గ్రహిస్తే, నీటి ధారలు అట్టలుకట్టిన బేల ముఖాలు మౌనంగా వేసే ప్రశ్నలు వినిపిస్తాయి. ప్రజల బతులు ఎడారి బంజరులుగా మారిన వైనం తెలుస్తుంది. కోల్పోయిన పిల్లల కోసం ఆక్రోశించే తల్లులు... ఒరిగిపోయిన కొడుకుల కోసం రోదించే తండ్రులు.. తల్లిదండ్రుల జాడ తెలియక, వారి కోసం అమాయకంగా ఎదురుచూస్తే చిన్నారులు... గాయాలతో ఆసుపత్రుల ముందు చికిత్స కోసం పడిగాపులు పడుతున్న వృద్ధులు.. ఎవరో ఒకరు, ఏదో ఒక సాయం అందించకపోతారా అని ఎదురుచూస్తే ఆశాజీవులు కనిపిస్తారు. జాత్యహంకారంతో రగిలిపోయే దేశాలు మానవత్వాన్ని ఎన్నడో మరచిన వైనాన్ని మనకు గుర్తుచేస్తారు. ఛిద్రమైన జీవితాలు.. విరిగిన కలలు శరీరాలు... ఇవే, పాలస్తీనియన్లను పరిచయం చేసే అంశాలు. గాజా లో హింస చక్రం నిరంతరం తిరుగుతునే ఉంది. ఘర్షణలు, మానవతా సంక్షోభాల కారణంగా లెక్కలేనన్ని అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గాజాలో దుర్భర పరిస్థితులకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. తగిన వైద్య సంరక్షణ లేక, ఎంతో మంది చిన్నారులు తమ తల్లిదండ్రుల చేతుల్లోనే తుదిశ్వాస విడుస్తున్నారు. చివరికి మృత దేహాలను ఖననం చేయడానికి చోటు కూడా దొరకడం లేదు. ఇంతటి హృదయవిదారకమైన పరిస్థితులు మరెక్కడా కనిపించవు. ఆత్మీయులను కోల్పోయిన వారి రోదనలు యుద్ధంలో దెబ్బతిన్న ప్రాంతాల్లో మారుమోగుతున్నాయి. జనావాసాలు, పాఠశాలలు, ప్రార్థనాస్థలాలే కాదు... ఆసుపత్రులపైనా ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తూ, వేలాది మందిని హత్య చేస్తున్నది. సుమారు 40,000 మంది పౌరులు మృతి చెందినట్టు పాలస్తీనా అధికారులు వెల్లడిస్తున్నారు. ఆహారం, నీరు, నివాసం వంటి ప్రాథమిక సదుపాయాల కొరత గాజాలో ఇప్పటికే భయాన పరిస్థితులు సృష్టించింది. ఇజ్రాయెల్, ఈజిప్టు కొనసాగిస్తున్న దిగ్బంధనలు, ఆంక్షలు ప్రజలకు కనీస అవసరాలు కూడా అందకుండా చేస్తున్నది. వైద్యం మృగ్యమవుతుండగా, నిరంతరం భయం, అనిశ్చితి మధ్య జీవించడం వల్ల మానసిక ఒత్తిడి పెరుగుతున్నది. ఎక్కడ చూసినా శవాలు బాంబుల మోతలు.. శవాల గుట్టలు పాలస్తీనియన్లను తీవ్రమైన భావోద్వేగానికి గురి చేస్తున్నది. ఈ ప్రాంతంలోని రాజకీయ అశాంతికి పసికూనలు కారణం కాదు, కానీ, వారు తమ జీవితాలనే మూల్యంగా చెల్లించుకుంటున్నారు. పోషకాహారం దాకా ఎందుకు... తినడానికి రొట్టెముక్క కూడా దొరక్క పస్తులుంటున్నారు. లక్షలాది మంది పాలస్తీనియన్లకు తిండి లేదు... సరైన గూడు లేదు.. మందులు లేవు.. వైద్య సేవలు లేవు.. ఆప్తులను కోల్పోయిన దైన్యం వారిది. మానవ హక్కులు లేని జీవితాలు వారివి. ఇజ్రాయెల్ దాడుల్లో మరణాల గణాంకాలు ఎలావున్నా, హత్యగు గురవుతున్న ప్రజల కలల మాటేమిటి? కుటుంబ సభ్యులను కోల్పోయి, వారు పడుతున్న ఆవేదనకు కొలమానం ఏమిటి? ధ్వంసమైన ఇళ్లనే కాదు.. జీవితాలను కూడా పునర్నిర్మించుకోవడానికి ఆపన్న హస్తం ఎక్కడ లభిస్తుంది? గాజాలో సంఘర్షణలు, యుద్ధం ఫలితంగా సంభవించే అమానవీయ ఘటనల దృశ్యాలు కళ్ల ముందు ఆవిష్కృతమవుతున్నప్పటికీ, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పెద్ద దేశాలు ఎందుకు స్పందించడం లేదన్నది ప్రశ్న. పాలస్తీనాకు జరుగుతున్న నష్టం కనిపిస్తునే ఉంది. అక్కడి ప్రజలు అనుభవిస్తున్న కష్టాలు అక్కడి వాస్తవ పరిస్థితులకు నిదర్శనాలు. అక్కడి దృశ్యాలను ఇంకా విస్మరించడం మానవత్వాన్ని ఖననం చేయడమే. ఒక ప్రాంతం మండుతుంటే... పౌరులు నేలరాలుతుంటే, వినోదం చూడడాన్ని మించిన విషాదం ఏముంటుంది? లక్షలాది మంది పాలస్తీనియన్లు సాయం కోసం ప్రపంచ దేశాలవైపు ఆశతో చూస్తున్నారు. దయ, కరుణ అనే పదాలకు అర్థం తెలియని రీతిలో బలమైన దేశాలు కూడా వారి ఆర్తనాదాలను పట్టించుకోవడం లేదు. ఈ అంతులేని ఉదాశీనత నుంచి మనిషి బయటపడాలి. కపట ప్రేమ ల ముగుసులను తొలగించుకొని, వాస్తవాలను చూడాలి. అంగీకరించాలి. అక్కడ అవసరంలో ఉన్న గాజా మనల్ని పిలిస్తున్నది. సాయం కోరుతున్నది. శారీరకంగా, మానసికంగా తగిలిన గాయాలకు మానవత్వపు పూతను అడుగుతున్నది. చూడాల్సిన బాధ్యత మనది. వినాల్సిన కర్తవ్యం మనది. నేడు పాలస్తీనా కావచ్చు.. ఈ జాత్యహంకార, సామ్రాజ్యవాద కార్చిచ్చు ఇంకా ఎన్ని దేశాలకైనా వ్యాపించవచ్చు. ఎంతటి విధ్వంసాన్నయినా సృష్టించవచ్చు. పక్కవారిని దహిస్తున్న విద్వేషపు అగ్నికీలలు ఏ క్షణంలోనైనా మనల్ని కూడా చుట్టముట్టడం ఖాయమన్న వాస్తవాన్ని ప్రపంచ దేశాలు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. లేకపోతే, ఇజ్రాయెల్ దమనకాండ నిరాటంకంగా కొనసాగుతుంది. అత్యవసర సాయాన్ని అందించే సహాయక కార్యకర్తల ప్రాణాలను కూడా బలిగొంటున్న కర్కశత్వం తారస్థాయికి చేరుతుంది. ఇప్పటికే చాలా దేశాల్లో ప్రజలే వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టడం సానుకూల పరిణామం. అందుకే, పాలస్తీనియన్లకు నిరాశ, చీకటి మధ్యలో ఎక్కడో ఆశా కిరణం మెరుస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తమవుతున్న సంఘీభావం పాలస్తీనియన్ల ఆశలకు ఊపిరి పోస్తున్నది. ఇజ్రాయెల్‌ను సంఘటితంగా ఎదుర్కోవడానికి ఊతమిస్తున్నది. గాజా.. పాలస్తీనియన్ల మాతృభూమిలో భాగమే. దానిని వదులుకోవడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. పోరాటం అనివార్యమైనప్పుడు, అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధపడక తప్పదుకదా! తాము నాటుకున్న ఆశల విత్తనాలను కన్నీటితో పెంచుతున్నారు. అవి మొక్కలై, ఫలాలిచ్చే రోజు ఎంతో దూరంలో లేదు. అమెరికా, బ్రిటన్ సహా ఎన్నో దేశాల్లో పాలస్తీనియన్లకు సంఘీభావంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికా సైతం ఇజ్రాయెల్‌పై అసంతృప్తిని వ్యక్తం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆరంభంలో కొన్ని దేశాలకే పరిమితమై, క్రమంగా వివిధ దేశాలకు వ్యాపిస్తున్న నిరసనల హోరు ఇజ్రాయెల్ గుండెల్లో గుబులు పుట్టించాలి. ప్రపంచ దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఒకేతాటిపై నిలిచి, ఇజ్రాయెల్‌ను కట్టడి చేయాలి. అవసరమైతే కఠినమైన ఆంక్షలు అమలు చేయాలి. మానవతా సాయం అందించడానికి అంతర్జాతీయ సమాజం నుంచి తక్షణ చర్యలు అవసరం. వైద్య సేవలను మెరుగుపరచేందుకు అవసరమైన మానవ వనరులను, ఔషధాలు,, ఇతర సామాగ్రిని పంపించాలి. ఈ సాయం పాలస్తీనియన్లకు అందడంలో ఆటంకం కలిగించవద్దని ఇజ్రాయెల్‌ను హెచ్చరించాలి. గాజా సంక్షోభాన్ని పరిష్కరించడానికి, అక్కడి ప్రజల బాధలను అంతం చేయడానికి అంతర్జాతీయ సమాజం అత్యవసర చర్య తీసుకోవాలి. ఈ సంఘర్షణలో కోల్పోయిన ప్రతి జీవితం ఒక విషాదం. ఆ నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు. కనీసం భవిష్యత్తులోనైనా అలాంటి దారుణాలు జరగవన్న నమ్మకం కల్పినప్పుడే, పాలస్తీనియన్లకు నిజమైన సాయం అందుతుంది. ప్రజలు మౌనంగా భరిస్తున్నంత కాలం ప్రభుత్వాలు అమాయకత్వాన్ని నటిస్తునే ఉంటాయి. ప్రకటనలు గుప్పిస్తునే ఉంటాయి. కానీ, బాధిత దేశాలకు న్యాయం జరగదు. ప్రజలకు భవిష్యత్తు ఉండదు.





బిఎల్

## వ్యాపార వాణిజ్య సముదాయాలకు ప్రదేశం, ప్రాంతం తెలిపే బోర్డులు పెట్టాలి

లేఖ

పట్టణీకరణ నగరీకరణ ముందు అన్ని రకముల సామానులు, వస్తువులు విక్రయించే దుకాణాలు, ప్రాంతాలు, ప్రదేశాలు గుడి మసీదు బడి దవఖానాల పోయే తొవ్వల ఇతర పేరొందిన ప్రాంతాల దగ్గర ఉంటాయని బండగుర్తుగా చెప్పేవారు. అందువలన ప్రజలకు దుకాణాలు ఎక్కడ ఉన్నవో తెలుసుకొనుటకు చాలా సౌకర్యవంతంగా ఉండేది కానీ ప్రపంచీకరణ మొదలైన తర్వాత ప్రతి పల్లె , గ్రామం, పట్టణం, నగరాలు, మహానగరాలలో విస్తృత స్థాయిలో అత్యంత ఆధునిక సాంకేతికతో కూడిన వ్యాపార, వాణిజ్య, సముదాయాలు విరివిగా వెలసిల్లుతూనే ఉన్నాయి. అత్యధిక దుకాణాలకు విక్రయించే సామాన్లు, వస్తువులు పేర్లతో కూడిన బోర్డులు ఉంటున్నాయి కానీ ప్రదేశం, ప్రాంతం సూచించే విధంగా బోర్డులు లేకపోవడం వలన అయోమయ పరిస్థితులు ఎదుర్కొనవలసి వస్తున్నది.

ప్రజలు తాము ఏ ప్రాంతంలో, ఏ ప్రదేశంలో ఉన్నామో కావలసిన వస్తువులు ఎక్కడ లభ్యమవుతాయో తెలియక నానా ఇబ్బందులు పడవలసి వస్తున్నది. ఈ సముదాయాలకు వివరణాత్మకంగా బోర్డులు ఏర్పాటు చేసిన యెడల ఆయా సంస్థలకు లాభమే చేకూరుతుంది. ఎందుకంటే ఒక వస్తువు అక్కడ కొన్నాము చాలా నాణ్యతతో కూడి ఉంటుంది సరసమైన ధరలకే లభిస్తుందని ప్రచారం కూడా జరుగుతుంది. దుకాణదారు యొక్క ప్రవర్తన గుణగణాలను కూడా చెప్పుకుంటా రు కొన్ని కొన్ని వస్తువులు ప్రత్యేకమైన ప్రాంతం ప్రదేశంలోనే లభిస్తాయి తద్వారా ఆ ప్రాంతానికి విపరీతమైన ఆదరణ ఉంటుంది ఇంతేకాక ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఇంకా మధ్య దళారులు, మోసగాళ్ల భారీ నుండి కూడా రక్షణగా ఉండగలవు. కావున వ్యాపార, వర్తక సంఘాలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలమైన నిర్ణయం తీసుకుని ప్రజలకు బహుళ విధంగా ఉపయోగపడే ఈ సూచనను పాటించాలని విజ్ఞప్తి.

దండంరాజు రాంచందర్ రావు

# కర్బన వ్యవసాయం.. ప్రస్తుత అవసరం

వ్యవసాయం

పర్యావరణ మార్పులు శరవేగంగా చోటు చేసుకుంటున్న నేటి తరంలో కర్బన వ్యవసాయం అత్యవసరంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రకృతి బీభత్సాలు సామాన్యమయ్యాయి. గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు తగ్గితే తప్ప కాలుష్య సమస్యకు కొంత వరకైనా సమాధానం లభించదు. కార్బన్ వ్యవసాయం లేదా సీక్వెస్ట్రేషన్ ఫార్మింగ్ లేదా రీజనరేటింగ్ అగ్రికల్చర్‌గా పిలిచే కార్బన్ వ్యవసాయ విధానం గ్రీన్‌హౌస్ ఉద్గారాలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. వాతావరణం నుంచి కార్బన్ డైయాక్సైడ్ లేదా బొగ్గుపులుసు వాయువును సంగ్రహించడానికి, మట్టి లేదా బయోమాస్‌లో నిలువ చేయడానికి రూపొందించిన వ్యవసాయ పద్ధతుల కూర్పును కర్బన వ్యవసాయంగా పిలుస్తారు. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రతను, తద్వారా వాతావరణ మార్పులను తగ్గించడమే దీని లక్ష్యం. దీర్ఘకాలం పెరుగుతున్న సీజన్లు, తగినంత వర్షపాతం, గణనీయమైన నీటిపారుదల ఉన్న ప్రాంతాలు కర్బన వ్యవసాయాన్ని అమలు చేయడానికి అనువుగా ఉంటాయి. ఎందుకంటే అవి వృక్ష పెరుగుదల ద్వారా కార్బన్‌ను సీక్వెస్టర్ చేయడానికి అవసరమైన పరిస్థితులను అందిస్తాయి. కర్బన వ్యవసాయంలో అనుసరించే విధానాల్లో మొదటిది కవర్ క్రాపింగ్. పప్పులు లేదా గడ్డి వంటి కవర్ పంటలను పల్లపు కాలంలో నాటడం వల్ల భూమిని రక్షించడానికి, సుసంపన్నం చేయడానికి, కార్బన్ నిల్వను ఈ విధానం పెంచుతుంది. సాగును నివారించడం లేదా తగ్గించడం నేల నిర్మాణానికి ఇది ఉత్తమ మార్గం. అదే విధంగా సేంద్రియ పదార్థాలను సంరక్షించడంలో ఇది ఉపయోగపడుతుంది. నేల నుండి కార్బన్ నష్టాన్ని నివారించవచ్చు. ఇక, ఆగ్రోఫారెస్ట్రీ ద్వారా చెట్లు, పొదలను వ్యవసాయంలో ఏకీకృతం చేయడం ద్వారా కార్బన్‌ను సీక్వెస్టర్ చేయడానికి వీలవుతుంది. వన్య ప్రాణుల కోసం నీడ, విండ్ బ్రేక్‌లు, ఆవాసాల వంటి అదనపు పర్యావరణ వ్యవస్థ సేవలను కూడా అందిస్తుంది. కర్బన వ్యవసాయంలో మరో విధానం బయోచార్. వ్యవసాయ వ్యర్థాల వంటి సేంద్రియ పదార్థాల నుండి ఉత్పత్తి చేసే ఒక రకమైన బొగ్గు. మట్టికి జోడించినప్పుడు, బయోచార్ సంతానోత్పత్తి. కార్బన్ సీక్వెస్ట్రేషన్‌ను ఈ విధానం పెంచుతుంది. బహువార్షిక పంటలుల విధానం కూడా ఇందులో ఒక భాగం. వార్షిక పంటలకు బదులుగా శాశ్వత పంటలను నాటడం వల్ల నేలలో ఇబ్బంది తగ్గుతుంది. అంతేగాక, కాలక్రమేణ కార్బన్ నిల్వ పెరుగుతుంది. సమీకృత పోషక నిర్వహణ పద్ధతులు నేల సంతానోత్పత్తిని ప్రోత్సహిస్తాయి. సేంద్రియ ఎరువులు, కంపోస్ట్‌ను ఉపయోగించడం ద్వారా ఉద్గారాలను తగ్గిస్తాయి. పశువులను మేతకు తీసుకెళ్లడం, మేతలో నాణ్యతను పెంచడం వంటి చర్యల ద్వారా పశుపోషణను లాభసాటి గా చేసుకోవచ్చు. అంతేగాక, జంతు వ్యర్థాల నిర్వహణ వ్యూహాలు మెరుగుపడతాయి. మీథేన్ ఉద్గారాలను తగ్గించడం సాధ్యమవుతుంది. పచ్చిక భూముల లో నిల్వ ఉన్న కార్బన్ మొత్తాన్ని పెంచుతాయి. వ్యవసాయ భూములలో కార్బన్ నిల్వను పెంచడం ద్వారా, కార్బన్ వ్యవసాయం వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రతను తగ్గించవచ్చు. దీని వల్ల వాతావరణ మార్పులు తగ్గుతాయి. నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది. కవర్ క్రాపింగ్, క్రాప్ రొటేషన్, నాన్‌టిల్ ఫార్మింగ్ వంటి అనేక కార్బన్ ఫార్మింగ్ పద్ధతులు నేల ఆరోగ్యం, సంతానోత్పత్తిని మెరుగుపరుస్తాయి. జీవ వైవిధ్య పరిరక్షణ కూడా సాధ్యమవుతుంది. కార్బన్ వ్యవసాయ పద్ధతులు తరచుగా వ్యవసాయ ప్రకృతి దృశ్యాలలో సహజ ఆవాసాల సంరక్షణ, పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తాయి కాబట్టి, జీవ వైవిధ్యాన్ని స్థిరపరచవచ్చు. ఈ పద్ధతులు స్థానిక జాతులకు కీలకమైన, స్థిరమైన ఆవాసాలను అందిస్తాయి, పరాగ సంపర్కానికి మద్దతు ఇస్తాయి. మొత్తం జీవవైవిధ్యాన్ని మెరుగుపరుస్తాయి, పర్యావరణ వ్యవస్థ స్థితిస్థాపకతకు దోహదం చేస్తా యి. వాతావరణ మార్పులకు స్థితిస్థాపకత కూడా కర్బన వ్యవసాయంలో సాధ్యమవుతుంది. ఆగ్రోఫారెస్ట్రీ, డైవర్సిఫైడ్ క్రాపింగ్ విధానం వంటి శీతోష్ణస్థితిని తట్టుకునే వ్యవసాయ పద్ధతులను అనుసరించడంతో, వాతావరణ మార్పుల ప్రభావాలకు అనుగుణంగా రైతులకు సహాయపడతాయి. గ్రాస్రూ ట్ కార్యక్రమాలు, భారతదేశంలో అగ్రగామి వ్యవసాయ పరిశోధనలు కార్బన్‌ను సీక్వెస్టర్ చేయడానికి సేంద్రియ వ్యవసాయం సాధ్యతను గుర్తించాయి. గంగాతీర మైదానాలు, దక్కన్ పీఠభూమిలో విస్తారమైన వ్యవసాయ భూ ము లు ఉన్నాయి. కర్బన వ్యవసాయాన్ని అవలంభించడానికి ఇవి చాలా ఉపయుక్తంగాఉంటాయి. హిమాలయ పర్వత ప్రాంతాల్లో వ్యవసాయ భూమి తక్కువ. ఇక తీర ప్రాంతాలు ఎక్కువగా లవణీకరణకు గురవుతాయి. ఫలితంగా అక్కడ కర్బన వ్యవసాయ విధానాలను సంపూర్ణ స్థాయిలో అమలు చేయడం కష్టం. అక్కడ ఎక్కువగా సంప్రదాయ వ్యవసాయ విధానాలనే అనుసరిస్తారు. ఏదిఏమైనా కర్బన వ్యవసాయం ఒకవైపు పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రిస్తునే, మరోవైపు ఫలసాయాన్ని పెంచి, రైతులకు లాభాలను ఆర్జించిపెడతాయి. వ్యవసాయ నేలలు 20 నుంచి 30 సంవత్సరాలలో ప్రతి సంవత్సరం 3 8 బిలియన్ టన్నుల కర్బనానికి సమానమైన శక్తిని గ్రహించగలవని అధ్యయనాలు చెప్తున్నాయి. ఈ సామర్థ్యం సాధ్యమయ్యే ఉద్గారాల తగ్గింపు, వాతావరణం స్థిరీకరణ మధ్య అంతరాన్ని కర్బన వ్యవసాయ విధానాలు తగ్గిస్తాయి. కాబట్టి, దేశంలో వాతావరణ పరిరక్షణ, ఆహార భద్రతకు ఈ విధానం ఎంతో అవసరం.



ఈ సందర్భంలో, కర్బన వ్యవసాయ పరిమితులను కూడా ఒకసారి ప్రస్తావించుకోవాలి. నీటి లభ్యత పరిమితంగా ఉన్న వేడి, పొడి ప్రాంతాల్లో దీని అమలు సవాలుగా మారుతుంది. అక్కడ తాగు, వాడుక నీటి అవసరాలకే ప్రాధాన్యం ఎక్కువ కాబట్టి, కర్బన వ్యవసాయాన్ని అనుసరించతగిన పరిస్థితులు ఉండవు. పరిమిత నీటి లభ్యత మొక్కల పెరుగుదలకు ఆటంకం కలిగిస్తుంది, తద్వారా కిరణజన్య సంయోగక్రియ ద్వారా సీక్వెస్ట్రేషన్ సంభావ్యతను తగ్గిస్తుంది. ఇక ఏ మొక్కలను పెంచాలో ఎంచుకోవడం కూడా కీలకమే. ఎందుకంటే, అనిన జాతులు కార్బన్‌ను ఒక పరిమాణంలో లేదదా సమానమైన ప్రభావంతో తీసుకొని, నిల్వ చేసుకోవు. ఈ సామర్థ్యం ఎక్కువగా ఉన్న మొక్కలను ఎంపిక చేయాల్సిన అవసరం ఉంది. ఇక, కర్బన వ్యవసాయ పద్ధతులను అవలంబించడానికి అవసరమైన ఖర్చులు రైతులు పెట్టలేక పోవచ్చు. ప్రభుత్వం, ఆర్థిక సంస్థల సహకారం లేకుండా ఈ విధానం సమర్థంగా అమలుకాదు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చిన్నస్థాయి రైతులకు స్థిరమైన భూ నిర్వహణ పద్ధతులనే అనుసరిస్తారు. సరికొత్త విధానాలను అమలు చేయడానికి, పర్యావరణ రంగంలో పెట్టుబడి పెట్టడానికి అవసరమైనంత ఆర్థిక స్తోమత వారికి ఉండదు. అలాంటప్పుడు, కర్బన వ్యవసా యం అనుకున్నంత సులభం కాదు. పైగా, దేశంలో ఎక్కువమంది రైతులు నిరక్షరాస్యులు. కొద్దోగొప్పో అక్షర జ్ఞానం ఉన్నవారికి కూడా ఆధునిక విధానాల పట్ల అవగాహన ఉండదు. వారికి శిక్షణనిచ్చే సదుపాయాలు చాలా తక్కువ. సాంకేతిక అడ్డంకులు కర్బన వ్యవసాయానికి అడ్డుగోడలా మారతాయి. ఇలాంటి సమస్యలను అధిగమించగలిగితే, కర్బన వ్యవసాయ విధానాలను అమలు చేయడం సాధ్యమవుతుంది. పర్యావరణ పరిరక్షణకు మార్గం ఏర్పడుతుంది.

ఎస్వీఆర్

# వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవడం ఎలా?

భారతదేశంలోని పాఠశాలలు, కళాశాలలు దాదాపు ఒకటిన్నర నుంచి రెండు మాసాల వరకు వేసవి సెలవులను ప్రకటించాయి. వాతావరణం వేడెక్కుతున్నది. వేసవితాపం, వడదెబ్బ ప్రజలను ఇంటికి మాత్రమే పరిమితం చేస్తున్నాయి. ప్రభుత్వ వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ హెచ్చరిక జారీ చేసే స్థాయికి చేరింది. వేసవి సెలవుల్లో పిల్లలు, యువత ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు. వేసవి సెలవుల్లో పిల్లల ఆసక్తులను గమనించాలి, ఏ రంగం పట్ల వారు ఆకర్షితులవుతున్నారో తెలుసుకోవలసిన కనీస బాధ్యత తల్లితండ్రులకు, పెద్దలకు, సంరక్షకులకు ఉన్నది. పిల్లల/యువత ఆసక్తిని గమనించి ఆయారంగాల్లో శిక్షణను అందించాలి లేదా ఏర్పాటు చేయాలి. సెలవు దినాల్లో పిల్లలు చేస్తున్న పనులు వారి భవిష్యత్తు నిర్మాణానికి, వ్యక్తిత్వ వికాసానికి, విజ్ఞానాన్ని పెంచుకోవడానికి, ప్రకృతి అద్భుతాలను వీక్షించడానికి, తమకు ఇష్టమైన కళల్లో శిక్షణ పొందడానికి, ఆసక్తి కలిగిన ఆటల్లో మెలకువలు పెంచుకోవడానికి, వినోద విజ్ఞాన యాత్రలతో దేశ విదేశీ ప్రజల జీవనశైలితో పాటు పర్యాటక ప్రదేశాల విశేషాలు అవగాహన చేసుకోవడానికి, తమ అభిరుచులను సాకారం చేసుకోవడానికి, తమకు ఇష్టమైన ఇతర పుస్తకాలు చదవుకోవడానికి, సృజనశీల ఆలోచనలు చేయడానికి, ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడానికి, నైపుణ్య శిక్షణల ప్రణాళికలు వేస్తున్నారు, వాటిని అమలుచేస్తూ విజ్ఞాన వినోదాలను పొందుతూ ముందుకు సాగుతున్నారు.

**పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి:** పిల్లల శారీరక, మానసిక, భావోద్వేగ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక వికాసం పెంచడానికి వేసవి సెలవులు మంచి అవకాశాలను కలిపిస్తాయి. వేసవి సెలవుల్లో పిల్లలు, యువత ఆరోగ్యంగా ఉండడానికి అవసరమైన సదుపాయాలను తల్లిదండ్రులు కల్పిస్తున్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా తమ ఆరోగ్యాలను కాపాడుకుంటూనే తమ విజ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవడానికి వినియోగించుకోవాలి. సెలవుల్లో పిల్లల దృష్టిని నూతన పుస్తకాల పఠనంవైపు మరల్చాలి. పుస్తక పఠనం ఒక మంచి అలవాటు అని అవగాహన కల్పించాలి. ప్రకృతిలో దాగిన రహస్యాల గుట్టు తెలుసుకోవడానికి ఆస్కారం ఇవ్వాలి. సైన్స్ మ్యూజియం, సర్కస్, జూ లాంటి వివిధ ప్రదర్శనలకు తీసుకువెళ్లడం మరువరాదు. మన భారతీయ లలిత కళలు, సంస్కృతి, వారసత్వ సంపదలను నేర్పించే ప్రయత్నాలు చేయాలి. ప్రతిరోజు ఏదో ఒక విషయం కేంద్రంగా వ్యాసాలు రాయడం, కవితలు రాయడం లాంటి ఆసక్తులను పెంచాలి. పెంపుడు జంతువుల పట్ల ఆప్యాయత, గ్రామీణ వాతావరణాలను పరిచయం చేయడం మంచిది.

**మానవ సంబంధాల విలువల బోధన:** మానవ సంబంధాల ప్రాధాన్యాన్ని వివరించాలి. మన సమీప బంధువులను పరిచయం చేయడానికి ఇండ్లకు/శుభకార్యాలకు పిల్లల్ని తీసుకువెళ్ళడం ఉత్తమంగా భావించాలి. డ్రాయింగ్, పెయింటింగ్ లాంటి కళలను, కొత్త ఆటలను పరిచయం చేయాలి. తప్పనిసరి గా సైక్లింగ్, స్విమ్మింగ్ నేర్పించాలి. చెస్, క్యారమ్స్ లాంటి ఇండోర్ గేమ్స్‌పట్ల ఆసక్తిని పెంచే ప్రయత్నాలు చేయాలి. మంచి సందేశాత్మక సినిమాలు, వీడియోలను చూపించాలి. ప్రముఖ వ్యక్తుల జీవిత చరిత్రలు చదివించాలి. జనరల్ నాలెడ్జ్ పెరిగే విధంగా దినపత్రికలు చదివించడం, టివీల్లో వార్తలు వినిపించడం, సమకాలీన సమస్యలను చర్చించాలి.



**డిజిటల్ యుగపు బోధనలు/శిక్షణలు:** వేసవి సెలవుల్లో నిర్వహించే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, వేసవి శిబిరాల శిక్షణల్లో పిల్లలను చేర్పించాలి. వాతావరణ కాలుష్యం పట్ల అవగాహన కల్పించే పుస్తకాలు, వీడియోలు చూపించాలి. వేసవిలో నిత్యం యోగా, ప్రాణాయామం, వ్యాయామం, పాటలు పాడడం, నృత్యం చేయడం, సంగీతం లాంటి కళలను పరిచయం చేయాలి. కరాటే వంటి ఆత్మ రక్షణ కళల్లో శిక్షణ కల్పించాలి. అమ్మతో సమయం గడపడం, నాన్నతో బయటకు వెళ్ళడం, డిజిటల్ యుగపు నైపుణ్యాలను నేర్చుకోవడానికి సాధన చేయా లి. బాలు రు బాలికలకు వంట చేయడం నేర్పించాలి. తాతలు, బామ్మలతో ముచ్చటిస్తూ వారి అనుభవాలను, జీవన విలువలను తెలుసుకునే విధంగా చూడాలి. మన వారసత్వ సంపదలైన రామాయణ మహాభారతాలను చదివించడం లేదా చెప్ప డం ఉత్తమమైనదిగా పరిగణించాలి. ఉద్యానవనాలు లేదా ఇతర ఉత్తేజకరమైన గమ్యస్థానాలకు తీసుకెళ్లాలి.

**సమ్మర్ హాలీడేస్ – ఫన్ డేస్:** 'సమ్మర్ హాలిడేస్'ను 'ఫన్ డేస్' గా మార్చడంతో పిల్లలు తమ వ్యక్తిత్వాలను, విజ్ఞాన వినోదాలను పెంపొందించుకుంటారు. ఆర్ట్ ఆఫ్ రీడింగ్, ఆర్ట్ ఆఫ్ రైటింగ్, ఆర్ట్ ఆఫ్ లిజనింగ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంశాలను పిల్లలకు పరిచయం చేయాలి. నైపుణ్య శిక్షణా శిబిరాలు, నూతన నైపుణ్యాలను నేర్పే శిక్షణలు(స్కిల్లింగ్), నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం(అప్‌స్కిల్లింగ్) లాంటి అవకాశాలను వదులుకోరాదు. తమ కెరీర్ ఎంపిక, కెరీర్ సాధనకు పునాదులు వేసుకోవడానికి వేసవి సెలవులు వరాలుగా పని చేస్తాయని తెలుసుకోవాలి. శారీరక దృఢత్వం పెంచుకోవడానికి అవుట్ డోర్ యాక్టివిటీల్లో చురుకుగా పాల్గొనాలి. రాత్రి వేళల్లో అంతరిక్ష రహస్యాల అద్భుతాలను చూపిస్తూ ఆసక్తిని, అవగాహనను పెంచాలి.

తోటల పెంపకం, మొక్కలకు నీరు పోయడం, పాదులు చేయడం, గార్డెనింగ్ పట్ల ఆసక్తిని పెంచ డం మంచిది. గృహంలో తన గదిని శుభ్రంగా ఉంచుకోవడాన్ని అలవాటు చేయాలి. జనరల్ నాలెడ్జ్ క్విజ్‌ల పట్ల ఇష్టాన్ని పెంచాలి. సమీప గ్రంధాలయాలను సందర్శించే అలవాటు చేసుకోవాలి. వేసవి సెలవులు రేపటి భవితకు పునాదులు పటిష్ట పరచాలి. నేటి పోటీ ప్రపంచంలో సెలవులను వృథా చేస్తే మన ఎదుగుద ల కుంటుపడుతుంది. సక్రమంగా వినియోగించుకున్న పిల్లల కు వరంగా, కాలాన్ని వృథా చేస్తున్న పిల్లలకు శాపంగా వేసవి సెలవులు మారతాయని తెలుసు కోవాలి. ఆనంద ఆరోగ్యాల తో పాటు పరిపూర్ణ జ్ఞానం పొందే విధంగా మనందరికీ వేసవి సెలవులు ఉపకరించాలి. నేటి సమయపాలన రేపటి భవితకు పునాది కావాలని పిల్లలు/కళాశాల యువత తెలుసుకొని క్రమశిక్షణతో మసలు కోవాలి.

డా: బిఎం రెడ్డి
9949700037



తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్‌గా నియమితులైన కె.శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి. దామోదర్ రెడ్డి, నల్గొండ జిల్లా నాయకులు

# గెలుపోటములన్నీ ఇవిఎంలలో నిక్షిప్తం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ పార్లమెంటు పరిధిలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. వివిధ పార్టీల అభ్యర్థుల గెలుపోటములన్నీ ఈవీఎంలలోనే నిక్షిప్తమయ్యాయి. గెలుపు ఎవరిది? ఓటమి ఎవరిదో? అనే బేరీజులతో జోరుగా చర్చ నడుస్తోంది. ఎన్నికల ప్రక్రియపై ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతితో పాటు పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి మానిటరింగ్ చేశారు. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ కొంత మందకొడిగా సాగింది. ఆ తర్వాత గంట గంటకూ పెరుగుతూ వచ్చింది. కాగా తాజాగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా సాయంత్రం 5 గంటలకు జరిగిన 5 రౌండ్ల పోలింగ్‌లో అప్పటి వరకు అందిన సమాచారం మేరకు 67.67శాతంగా నమోదయ్యింది.కరీంనగర్ నియోజకవర్గంలో 367353 మంది ఓటర్లుండగా 55.82శాతం ఓటింగ్ నమోదయ్యింది. చొప్పదండిలో 233546మందిఓటర్లుండగా 70.13 శాతం ఓటింగ్ నమోదయ్యింది. వేములవాడలో 226188 మంది ఓటర్లుండగా 71.26 ఓటింగ్ శాతం నమోదయ్యింది. రాజన్న సిరిసిల్లలో 246547మంది ఓటర్లుండగా69.58శాతం ఓటింగ్ నమోదయ్యింది. మానకొండూర్‌లో 225386 మంది ఓటర్లుండగా 71.11 శాతం ఓటింగ్ నమోదయ్యింది. హుజురాబాద్‌లో 250429 మంది ఓటర్లుండగా 68.67 శాతం ఓటింగ్ నమోదయ్యింది. హుస్నాబాద్‌లో 247701 మంది ఓటర్లుండగా 73.63శాతంఓటింగ్ నమోదయ్యింది. ఇంకా తుది నివేదిక అందేసరికి మరింత ఓటింగ్ శాతం పెరిగే అవకాశముంది. అయితే గతం 2019లో కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలో 69.52 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ప్రస్తుత 2024 ఎంపి ఎన్నికల్లో కరీంనగర్ జిల్లా యంత్రాంగం అనుకున్న 75 శాతం ఓటింగ్ లక్ష్యానికి దాదాపు చేరుకునే అవకాశముంది. అయితే హుస్నాబాద్ నియోజకవర్గంలోనే 73శాతం పైగా ఓటింగ్ నమోదవడం విశేషం.

## ఎన్నికల విధుల్లో.. గుండెపోటుతో ఉద్యోగి మృతి



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు వచ్చిన ఉద్యోగి గుండెపోటుతో మృతిచెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పేరాయిగూడెంలో జరిగింది. పేరాయిగూడెం నెహ్రూనగర్ 165వ పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీకృష్ణ అనే ఉద్యోగి పోలింగ్ జరుగుతున్న సమయంలో గుండెపోటుకు గురయ్యాడు. సహచర సిబ్బంది ఆయనను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఇదిలా ఉండగా అశ్వారావుపేట మండల పరిధిలోని వేదాంతపురంలో కాసిన వెంకటేశ్వరరావు అనే ఓటరు ఓటు వేసి ఇంటికి వెళ్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు.అతనిని ఆసుపత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయాడు.

## కౌంటింగ్ కేంద్రం పరిశీలన



ప్రజాపక్షం/నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచే అనిశెట్టి దుప్పలపల్లి గోదాంలో ఈవీఎంల రిసెప్షన్ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి చందన ఆదేశించారు. సోమవారం ఆమె అనిశెట్టి దుప్పలపల్లిలోని పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల ఆవరణ మొత్తం పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని, పోలీస్ సెక్యూరిటీకి అవసరమైన వసతి ,షామియానాలు ఏర్పాటు చేయాలని, వర్షం వచ్చిన ఇబ్బంది కాకుండా అవసరమైనన్ని టార్పాలిన్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈవిఎంలను స్వీకరించే సందర్భంలో సిబ్బందికి, సెక్టోరల్ అధికారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చెప్పారు. నల్లగొండ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి భద్రపరిచే ఈవీఎంల స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల పరిశీలకులు వసతి ని పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూమన్న తదితరులు ఉన్నారు.

# కరీంనగర్‌లో ఓటేసిన విఐపిలు





ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఓటు హక్కును ప్రముఖ నేతలు, ఆయా పార్టీ అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కుటుంబ సభ్యులు కలిసి కరీంనగర్‌లో తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. అదే విధంగా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులతో కలిసి కరీంనగర్ క్రిస్టియన్ కాలనీలోని శ్రీయ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ బిజెపి ఎంపి అభ్యర్థి బండి సంజయ్ ఉదయం 7 గంటలకే మహాశక్తి ఆలయంలో సతీసమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అక్కడి నుంచి నేరుగా ఇంటికి వచ్చిన బండి సంజయ్ హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం బండి సంజయ్ తన తల్లి వేలు పట్టుకుని కుటుంబ సమేతంగా జ్యోతినగర్‌లోని 174వ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ముకరంపురలోని ఉర్దూ మీడియం పాఠశాలలలో క్యూలైన్‌లో ఉండి తమ ఓటును వినియోగించుకున్నారు. వీరందరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ప్రజలంతా ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. కరీంనగర్‌జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి దంపతులు తమ ఓటు హక్కును కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో వినియోగించుకున్నారు.





## పోలింగ్ ప్రక్రియ పరిశీలన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ పరిశీలించారు. సోమవారం ఖమ్మం నగరంలోని నయాబజార్, ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల, ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ విపి గౌతమ్ పరిశీలించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.

**కంట్రోల్ రూము నుండి పోలింగ్ సరళి పర్యవేక్షణ**



నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నుండి పోలింగ్ సరళిని ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, పోలీస్ పరిశీలకులు చరణ్‌జిత్‌సింగ్, వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణ సామి, శంకర నంద్ మిశ్ర లు పర్యవేక్షించారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని నియోజక వర్గాలకు సంబంధించి పోలింగ్ సరళిని కంట్రోల్ రూములో ఏర్పాటు చేసిన మానిటర్ ద్వారా వారు పరిశీలించారు. పోలింగ్ సరళిని పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు.

## ఓటు వేసిన మండల ప్రముఖులు



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో సోమవారం మండల ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి, రైబస మాజీ అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, గాజీ నగర్ ఎంపిటిసి నేనావత్ లక్కిదాస్‌నాయక్, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్ తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్, నల్గొండ బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిలు సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రామ్మూర్తి నిబంధనల ప్రకారం 144 సెక్షన్ అమలు చేసి కేంద్ర పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎంఎల్‌సి బరిలో 52మంది అభ్యర్థులు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసనమండలి నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నల్లగొండ కలెక్టరేట్ లోని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల ఉపసంహరణ పత్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ములుగు జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి కి సమర్పించారు. 11మంది తమ నామినేషన్ లను ఉపసంహరించుకున్నారు.

## సత్తాచాటిన వివేకానంద విద్యార్థులు



V. REENA ROSELINE 579/600 (96.5%)
O. JAHNAVI DEVI 570/600 (95%)
SHREYANSH DWIVI 568/600 (94.6%)

ప్రజాపక్షం/కరీంనగర్: 2023/24 సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో సిబియస్ఇ నిర్వహించిన పది, పన్నెండు తరగతుల పరీక్షా ఫలితాలను సోమవారంబోర్డువిడుదలచేసింది. కరీంనగర్‌లోని స్థానిక జగిత్యాల రోడ్‌లో గల వివేకానంద రెసిడెన్షియల్ (సిబియస్ఇ) పాఠశాల 10వ తరగతి, 12వ తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక బలివాడ తెలిపారు. 12వ తరగతిలో 16 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని, 10వ తరగతిలో 600 మార్కులకు గాను వి.రేనా రోజ్‌లిన్ 579 మార్కులు, ఓ.జాహ్నవి దేవి 570, శ్రేయాన్స్ ద్వివేది 568, పి.రవి కుమార్, పి.అక్షయలు 567 మార్కులు సాధించి పాఠశాలకీర్తిని ఇనుమడింపజేశారని పాఠశాల చైర్మన్ డాక్టర్.సుధాకర్‌రావు పొల్సాని, అకాడమిక్ డైరెక్టర్ టి.లలిత కుమారిలు ఉత్తమ ఫలితాలను సాధించినవిద్యార్థులకుశుభాభినందనలు తెలిపారు.

## ఇవిఎంకి కొబ్బరికాయ సెంటిమెంట్

ప్రజాపక్షం/చందంపేట: నల్గొండ జిల్లా చందంపేట మండలం రేకులగడ్డలోని ఈవిఎం సోమవారం మొరాయించింది. అధికారులు అక్కడకు చేరుకొని సరిజేశారు. మరో గంటకు మళ్ళీ ఈవిఎం మొరాయించడంతో గ్రామస్థులు పాతకాలం నాటి పద్ధతిలో గ్రామంలో ఏ పని చేసిన అక్కడ ఉన్న గ్రామ దేవతలకు కొబ్బరి కాయలు కొట్టాలి. అలా కొడితేనేఈవిఎం పనిచేసిందని గ్రామస్థులుతెలిపారు. మండలవ్యాప్తంగా70శాతం నమోదైందన్నారు.

## అనుకున్నట్లే జరిగింది..తగ్గిన పోలింగ్



### అసెంబ్లీతో పోల్చుకుంటే 20 శాతానికి పైగా తగ్గుదల

ప్రజాపక్షం/ ఖమ్మం : మొదట ఊహించినట్లుగానే జరిగింది. ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం గణనీయంగా తగ్గింది. ఎండలకు తోడు జోరుగా ప్రచారం నిర్వహించకపోవడం, నగదు పంపిణీ తదితర విషయాలు పోలింగ్ తగ్గేందుకు కారణమయ్యాయి. ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గంలో గత ఎన్నికల్లో 75.2 శాతం ఓటింగ్ కాగా ఈసారి మూడు నుంచి నాలుగు శాతం ఓటింగ్ తగ్గే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో శాసనసభ ఎన్నికల కంటే తగ్గినా గత పార్లమెంటు ఎన్నికల కంటే ఓటింగ్ పెరిగింది. ఇక్కడ మొత్తం 1,27,908 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80.36 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం ఎక్కువగా జరగడం విశేషం. ఖమ్మం పార్లమెంటు లోని ఏడు శాసన సభ నియోజక వర్గాలు ఉండగా అత్యధికంగా అశ్వారావుపేటలో ఆ తర్వాత స్థానంలో పాలేరు నియోజక వర్గంలో ఓటింగ్ శాతం నమోదైంది. గత శాసన సభ ఎన్నికల్లో పోటీలో నిలిచిన అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయడం ఇప్పుడు ఏ నియోజక వర్గంలోను రూ. 500లకు మించి నగదు పంపిణీ జరగకపోవడం ఓటింగ్ శాతం తగ్గేందుకు కారణమైందని భావిస్తున్నారు. తగ్గిన పోలింగ్ శాతం ఎవరికి నష్టం చేకూరుస్తుంది అన్న దానిపైచర్చోపచర్చలు సాగుతున్నాయి.

# మానేరు విద్యార్థుల విజయకేతనం

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్: సిబియస్ఇ పదవ తరగతి ఫలితాల్లో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్ (సిబియస్ఇ)కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులను కైవసం చేసుకుని జయకేతనం ఎగురవేశారని మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన 76 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 99శాతం ఉత్తీర్ణత నుసాధించినట్లు పేర్కొన్నారు. మొత్తం 500 మార్కులకు గాను వై.హర్షవర్ధన్ 480 మార్కులు సాధించి 96 శాతం మార్కులతో సత్తాచాటినట్లు పేర్కొన్నారు. అదే విధంగా వి.శ్రీజయ 461, కాజల్ కున్వార్ 454, జి.హర్షిని 438, కె. శ్రీఅక్షర 428 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు. ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాల్లో అద్వితీయ జిపిఏలతో పాటు ఆల్ ఇం డియా సేమ్స్ ఒల ంపియాడ్‌లో జాతీయ స్థాయిలో ర్యాంకులను కైవసం చేసుకుని దేశవ్యాప్తంగా మానేరు విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సిబియస్ఇ, స్టేట్ బోర్డు పరీక్షలలో విద్యార్థులు ఉన్నతస్థానంలోనిలుస్తుండడం అభినందనీయం.అత్యుత్తమ మార్కులు సాధించడం పట్లమానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కడారి కృష్ణారెడ్డి, కడారి శ్వేతారెడ్డితో పాటు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు.



K SRI AKSHARA 428/500



G HARSHINI 438/500



V SRI JAYA 461/500



KAJAL KUNWAR 454/500



Y HARSHAVARDHAN 480/500

# పోలీసు అధికారులకు అభినందన





ప్రజాపక్షం / అయిజ : నాగర్ కర్నూల్ ఎంపి ఎన్నికల్లో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజక వర్గంలో ఎన్నికలు పోలీస్ పర్యవేక్షణలోప్రశాంతంగా జరిగాయి ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులు ఎంతో ఉత్సహంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు వృద్ధులు మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో ఓట్లు వేశారు. ఆర్.ఎస్ . ప్రవీణ్‌కుమార్ తన సొంతూరు అలంపూర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకోగా ఏఐసిసి కార్యదర్శి ఎస్.ఏ. సంతప్‌కుమార్ కుటుంబంతో తనం సొంతూరు అయిజ మండలం చిన్న తాండ్రపాడులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం అయ్యేసరికి గద్వాల నియోజక వర్గంలో 72.71 శాతం నమోదు కాగా అలంపూర్ నియోజకవర్గంలో 71.23 శాతం నమోదు అయింది. ప్రతి ఒక్కరు ఓట్లను అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరగడంతో పోలీసు అధికారులను ప్రజలు అభినందించారు.

# ‘అందరి సమన్వయంతో ప్రశాంతంగా పోలింగ్’





ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి : రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి ఐపిఎస్ సోమవారం జరుగుతున్న లోక్ సభ ఎన్నికల నిర్వహణ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహేశ్వరం జోన్, ఎల్బీనగర్ జోన్, మల్కాజిగిరి జోన్, భువనగిరి జోన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి ఎన్నికల సరళిని పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా జరుగుతున్నట్టు తెలిపారు. రాచకొండకు సంబంధించిన ఆరువేల మంది పోలీసు సిబ్బందితో పాటు 2500 మంది అదనపు కేంద్ర బలగాలు సంయుక్తంగా బందోబస్తు విధులను నిర్వర్తిస్తున్నట్టుగా పేర్కొన్నారు. ముందస్తుగా తీసుకున్న భద్రత చర్యల వల్ల పకడ్బందీ ఏర్పాట్ల మూలంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగడం లేదని పేర్కొన్నారు. రాచకొండ ఐటీ సెల్ ద్వారా సోషల్ మీడియా అకౌంట్లను నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నట్లయితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగాతరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియను నిష్పాక్షికంగా ఎటువంటి అవాంతరాలు లేకుండా నిర్వహించడానికి ఎన్నికల అధికారులతో కలిసి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కమీషనర్ వెంట ఆయా జోన్‌ల డీసీపీలు యాదాద్రి భువనగిరి డిసిపి రాజేష్ చంద్ర ఐపిఎస్, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, మల్కాజిగిరి డీసీపీ పద్మజ ఐపీఎస్, మహేశ్వరం డీసీపీ సునీత, ఏసీపీలు, ఇతర అధికారులు ఉన్నారు.

**వలిగొండ :** రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి ఐపిఎస్ లోక్ సభ ఎన్నికల నిర్వహణ బందోబస్తు ఏర్పాట్లను వలిగొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పోలింగ్ బూత్ 250, 252, 255, 256, ఎంపీపీఎస్ పోలింగ్ బూత్ 213, 214లను సందర్శించి సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియ ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా జరుగుతున్నట్టుతెలిపారు.రాచకొండకు సంబంధించిన ఆరువేల మంది పోలీసు సిబ్బందితోపాటు 2500మంది అదనపు కేంద్ర బలగాలు సంయుక్తంగా బందోబస్తు విధులనునిర్వర్తిస్తున్నట్టుగా పేర్కొన్నారు. ముందస్తుగా తీసుకున్న భద్రత చర్యల వల్ల పకడ్బందీ ఏర్పాట్ల మూలంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి డిసిపి రాజేష్ చంద్ర ఐపిఎస్, చౌటుప్పల్ ఏసిపి పటోళ్ల మధుసూదన్ రెడ్డి, వలిగొండ ఎస్సై డి మహేందర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భువనగిరిలోనూ సాంకేతిక లోపం

### మొరాయించిన 2 ఈవీఎంలు

ప్రజాపక్షం/భువనగిరిరూరల్: భువనగిరి మండలంలోని నందనం గ్రామంలో మధ్యాహ్నం సమయంలో పోలింగ్ కేంద్రంలో ఈవీఎం సాంకేతిక లోపం వచ్చి మొరాయించింది. ఈ గమనించిన అధికారులు వెంటనే ఆ ఈవీఎంకు మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆ పోలింగ్ కేంద్రంలో అర గంట పాటు పోలింగ్ ఆలస్యంగా జరిగింది. అలాగే నాగిరెడ్డిపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రంలో ఈవెన్ మోరాయించడంతో ఒక గంటపాటు పోలింగ్ ఆలస్యంగా జరిగింది. అధికారులు వెంటనే మొరాయించిన ఈవీఎంకు మరమ్మతులుచేపట్టడంతో సమస్య పరిష్కారం అయింది.



## సూర్యాపేటజిల్లాలో 74.61% పోలింగ్



ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ తెలిపిన వివరాల ప్రకా రం జిల్లాలో మొత్తం నాలుగు అసెం బ్లీ నియోకవర్గాలు ఉండగా నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు, భువనగిరి పార్లమెట్ పరిధిలో ఒక నియోజకవర్గంతో కలిపి మొత్తం 10,000,12 మంది ఓటర్లు ఉండగా 74.61శాతం ఓట్లు నమోదయ్యాయి. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో 73శాతం, హుజూర్ నగర్ 76.30, కోదాడ 75.15, భువనగిరి పార్లమెంట్ పరిధిలోనితుంగతుర్తినియోజకవర్గంలో 74శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలోఅవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలు దాటిన తరువాతా కూడా కొనసాగింది. ఆయా నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల ఈవీఎంలకు సంబంధించిన ఏఆర్‌ఓలు సెక్టార్ అధికారుల సమక్షంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య రూట్ వాహనాల ద్వారా నల్లగొండ, భువనగిరిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచేందుకు తరలించారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించిన ఓటర్లు, విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అభినందనలు తెలిపారు.



# ఓటర్ల చైతన్యం వల్లే ప్రశాంతంగా పోలింగ్

### పోలింగ్ సరళిపై సూర్యాపేటజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్



ప్రజాపక్షం/సూర్యాపేట: ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జిల్లాలో కొనసాగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కృష్ణనగర్ 66 పోలింగ్ బూత్‌లో అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంకతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. తాము ఓటర్లను చైతన్యం చేసేందుకు నిర్వహించిన కార్యక్రమాలతో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారని చెప్పారు. అనంతరం సిడబ్ల్యూటి ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించి ఓటింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూంను జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డేతో కలిసి 13నల్లగొండ, 14 భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. దీనికి ముందు ఎన్నికల సాధారణ పరిశీలకులు మాణిక్యరావు మనోజ్ కుమార్, సూర్యవంశీలతో కలిసి నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూంను పరిశీలించారు.సిఈఓ అప్పారావు, డిఆర్‌డివో మధుసూదన్ రాజు, డిపిఓ సురేష్ కుమార్, ఆర్‌డిఓ వేణు మాధవ్, తహసీల్దార్ శ్యాం సుందర్ రెడ్డి, ఏఓ సుదర్శన్ రెడ్డి, ఎన్నికల విభాగం పరిశీలకులు శ్రీనివాస రాజు పాల్గొన్నారు.


## ‘హామీలు నెరవేరుస్తాం’



ప్రజాపక్షం/చిగురుమామిడి: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం హుస్నాబాద్ నుంచి బస్సులో చిగురుమామిడివరకు తెలంగాణ బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రయాణించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ తప్పకుండా అమలుపరుస్తామని చెప్పారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, రాష్ట్ర హౌస్ ఫెడ్ మాజీ చైర్మన్, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జడ్పిటిసి గీకురు రవీంద్, డిసిసి ప్రజల కార్యదర్శి చిట్టుమల రవీందర్, డిసిసిఅధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్‌నేత, కాంగ్రెస్ మహిళా మండలి అధ్యక్షురాలు పోలు స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, పోటు మల్లారెడ్డి, తదితరులున్నారు.

# ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటే కీలకం

### ఓటు వేసిన ఎమ్మెల్యేలు కడియం, నాగరాజు, నాయిని, ఎంపి అభ్యర్థి కావ్య



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హన్మకొండ టీచర్స్ కాలనీ ఫేజ్.1లోని కమ్యూనిటీ హాల్లో కడియం కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరితోపాటు వరంగల్ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యతో పాటు కుటుంబ సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సింగపురం ఇందిర తన ఓటు వేశారు. వీరితో పాటు చిల్పూరు గుట్ట దేవస్థాన మాజీ ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఫాతిమా నగర్‌లోని బిషా బెరట స్కూల్‌లోని పోలింగ్ బూత్ నంబరు 175లో వరంగల్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి ఆరూరి రమేశ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, కాంగ్రెస్ నాయకులు ఈవి శ్రీనివాసరావు ఓటు హక్కును వినియోగంచుకున్నారు. వరంగల్ 65వ డివిజన్ లోని దేవన్నపేటలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సూరం వాసుదేవరెడ్డి, దేవన్నపేట మాజీ సర్పంచ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి పుట్ట శంకర్‌లు ప్రభుత్వ పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కడియం శ్రీహరి కుటుంబ సభ్యులు





వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తదితరులు

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హన్మకొండ పశ్చిమ నియోజకవర్గంలోని బూత్ నెంబర్ 223లో తనఓటు హక్కువినియోగించుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం మన బాధ్యత అని పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రజలకు ఏవిధమైన అవసరాలు ఏర్పడినా తక్షణమే ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు కీలకమన్నారు. యన సిపిఐ నాయకులతో కలిసి హన్మకొండ, వరంగల్‌లోని పలుపోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు.

## ఓటుహక్కు వినియోగించుకున్న అధికారులు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే దంపతులు, జిల్లా కేంద్రం లోని సింగరేణి ఏరియా హాస్పిటల్ సమీపం లోని కుందయ్యపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఓటర్లు అందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం పోలింగ్ డే సందర్భంగా మెదక్ జిల్లా హవేలీ ఘన్ పూర్ మండలం బొరంగాబాద్ ప్రాథమిక పాఠశాల 211 పోలింగ్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టర్ వెంట తాసిల్దార్ నారాయణ సంబంధిత పోలింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** జనగామ జిల్లాలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ తన భార్యతో కలిసి ప్రిస్టన్ కళాశాలలో ఓటు వేశారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ జనగామలోని ప్రిస్టన్ కళాశాలలోనే ఓటు వేశారు. డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తన స్వ గ్రామమైన నర్మాయపల్లిలో ఓటు వేశారు. మాజీ ఎంఎల్సీ నాగపురి రాజలింగం చేర్యాలలో ఓటు హక్కు వినియోగించుకోగా జనగామ ఎంఎల్ఏ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ పట్టణంలోని బాలిక పాఠశాల 232 పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. మాజీఎంఎల్యేముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఎల్లంల గ్రామంలో వేశారు.



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** లోకసభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం వరంగల్ పశ్చిమ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని హంటర్‌రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికలో మనమంతా భాగస్వామ్యం కావాలని, ప్రతి ఒక్క ఓటరు ఓటువేసి ప్రజాస్వామ్యాన్నిసంరక్షించాలనికలెక్టర్ పిలుపునిచ్చారు.



**ప్రజాపక్షం/గజ్వేల్:** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం గజ్వేల్ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల, 127 పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు విరాహత్ అలీ, ఆయన కుమారుడు డాక్టర్ విరాయత్ అలీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.




**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త పట్టణంలోని సెంట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే జిల్లా ఆర్యవైశ్య అసోసియేషన్ అధ్యక్షులు, ఆల్ ఇండియా వైశ్య ఫడరేషన్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నేతి సంతోష్ గుప్త కూడా అదే పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జఫర్‌గడ్ మండల కేంద్రంలో పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహిస్తున్న జిల్లా ప్రజాపరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలపై పోలీస్ కమిషనర్ ఆరా తీయడం జరిగింది.

## ఓటు వేసిన పలువురు ప్రముఖులు



**ప్రజాపక్షం/టేకుమట్ల :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని వెలిశాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఓటర్లతో కలిసి క్యూ లైన్‌లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు దేశ తలరాతను మార్చే ఎన్నికలు కాబట్టి ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు.



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆయన సతీమణి గణపురం జెడ్పిటి గండ్ర పద్మతో కలిసి వారి స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో (బూత్ నంబర్ 216)లో ఉదయం ఓటు హక్కును వినియోగించుకున్నారు ఈ కార్యక్రమంలో వారి వెంట గణపురం,మండల పరిషత్‌వైస్ ఎంపిపి విడిదినేని అశోక్ తదితరులు ఉన్నారు.



**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం కనిపించిందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. వర్గల్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో తనకు టుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అత్యధిక పార్లమెంటు స్థానాలు గెలుచుకోనున్నట్లు వివరించారు.

## తొలిసారి ఓటు వేసిన అనన్య ఇరుగు





**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల్లో అల్ ఇండియా యూనివర్సిటీ, నేషనల్ అర్చరీ క్రీడాకారిణి అనన్య ఇరుగు తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ పోలింగ్ డే సందర్భంగా సోమవారం మెదక్ పట్టణంలోని పెద్ద బజార్ 160 పోలింగ్ కేంద్రంలో రిటైర్డ్ ఫీజికల్ డైరెక్టర్ పిడి ఆనందం మనుమరాలు అల్ ఇండియా యూనివర్సిటీ,నేషనల్ అర్చరీ క్రీడాకారిణి అనన్య ఇరుగు తొలిసారి ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య భారత దేశంలో మొదటిసారిగా ఓటు వేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశ ప్రజలకు ఉత్తమ పరిపాలన అందించే నాయకులకు ఓటు వేయాలన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని చాలా విలువైనదన్నారు. ముఖ్యంగా యువత చేతిలో దేశ భవిష్యత్తు ఉందని తెలిపారు.

## గీసుకొండలో ప్రశాంతంగా ఎన్నికలు

### ఓటు వేసిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/గీసుకొండ:** మండలంలోని పలు గ్రామాల్లో పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఓటు వేసేందుకు ఓటర్లు ఉత్సాహం చూపారు. ప్రజలు ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున పోలింగ్‌కు ఒక రోజు ముందు భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం తరువాత ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ఓటర్లు ఎండ వేడిమికి ఇబ్బంది పడ్డారు. పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు కూలిపోయి, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు కొన్ని కేంద్రాల్లో నీరు నిలిచిపోవడం అధికారులు మొరం పోయించి బురద లేకుండా చేశారు. ఈ ఎన్నికల్లో వృద్ధులు ఓటు వేయడానికి ఉత్సాహం చూపారు. గీసుకొండ సీఐ పవన్‌కుమార్, ఎస్సైలు జానీ పాషా, వెంకన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం ఏర్పాటుచేసిన మాక్ పోలింగ్‌లో ఒక ఈవీఎంలో సమస్య తలెత్తగా వెంటనే ఆ ఈవీఎంను మార్చి వేరే ఈవీఎం ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దారు రియాజుద్దీన్ తెలపారు. గ్రామాల్లో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధులను పోలింగ్ కేంద్రంలోకి తరలించడానికి విద్యా శాఖ వాలంటీర్లు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు వీల్‌ఛైర్లను అందుబాటులో ఉంచి ఓటు వేయించారు. ఈ కార్యక్రమంలో గీసుకొండ, కోనాయిమాకుల పంచాయతీ కార్యదర్శులు వేణుప్రసాద్, హేమలత ఉన్నారు. మండలంలోని వంచనగిరి గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గీసుకొండ మండలంలోని ఎలుకుర్తి హవేలి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, నోడల్ ఆఫీసర్ పవన్‌కుమార్ పోలింగ్ సరళిని పరిశీలించారు. కేంద్రంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. గీసుకొండ ఎంపీడీఓ కృష్ణవేణి, సెక్టోరల్ ఆఫీసర్ హరిప్రసాద్‌బాబు, పంచాయతీ కార్యదర్శి కల్యాణి ఉన్నారు.



**అమెరికా టూ కొమ్మాల:** మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విరాటి విష్ణువర్ధన్‌రెడ్డి అమెరికాలోని ఫ్లోరిడా నగరం నుంచి రూ. 2లక్షలుఖర్చు పెట్టుకొని తన స్వగ్రామం కొమ్మాలలోని 175వ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నపుడే సరైన నాయకత్వం ఏర్పడుతుందన్నారు.

## ఓటే వజ్రాయుధం

### ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/శివంపేట:** ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఓటి వజ్రాయుధమని నర్సాపూర్ ఎమ్మెల్యే సు నీతా లక్ష్మారెడ్డి అన్నా రు. ఈ పార్లమెంట్ ఎ న్నికలలో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి భారీ మెజారిటీతో గెలవబోతున్నాడని, ప్రజల నుంచి వచ్చిన స్పందన ద్వారా మాకు అర్థమవుతుందని తె లిపారు. సో మవారం మండల పరిధిలోని గోమారం గ్రామంలో తన సొంత గ్రామంలో ఓటు హక్కును తన కుటుంబ సభ్యులకు కలిసి వినియోగించుకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వం లో టిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి ముమ్మ ర ప్రచారం చేయడం, 100 కోట్ల ట్రస్టు ఏర్పాటు చేసేసేవ చేస్తానని చెప్పడంతో ప్రజలం తా వెంకటరామిరెడ్డికి మద్దతుగా నిలిచినట్టు ప్రజల స్పందన అర్థం అయిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, సీనియర్ నాయకులు సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో అంతా ప్రశాంతం





**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:** జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో (ఈవీఎం) నిక్షిప్తమైంది. సోమవారం ఏడు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా సుమారుగా71.9 శాతం పోలింగ్ నమోదైందని జిల్లా యంత్రాంగం తెలిపింది. ఇది మ రింత పెరగవచ్చునని తెలిపింది. పోలింగ్ ముగిసే సమయానికల్లా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూ లైన్లలో ఉన్న ఓటర్లందరికి ఓటేసే అవకాశం కల్పించారు. కొన్ని చోట్ల రాత్రి వరకు పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలోనే పోలింగ్ శాతాలపై మంగళవారం ఉదయమే స్పష్టత వచ్చే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి.

**పలు చోట్ల ఆలస్యంగా :** కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ మొదలు కావాలి. అయితే పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఎన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించాయన్న అంశంపై అధికారులు సమాచారం ఇవ్వడం లేదు. కంది మండలంలోని జడ్పీ హైస్కూలో ఈవీఎం మిషన్ మొరాయించింది. దీంతో రెండు గంటలుగా ఇక్కడ పోలింగ్ ప్రక్రియ ఆగిపోయింది. వెంటనే అక్కడున్న సిబ్బంది సదరు విషయాన్ని పై అధికారులకు తెలియజేయడంతో మిషన్ నే సరిచేసేందుకు టెక్నికల్ టీంను పంపించారు. మొరాయించిన మిషన్‌ని సిబ్బంది సరిచేసారు.యధావిధిగా పోలింగ్ జరిగింది.

### ఉదయమే భారులు తీరిన ఓటర్లు ...

జిల్లా వ్యాప్తంగా చాల చోట్ల ఓటర్లు ఉదయమే పోలింగ్ కేంద్రాల వద్ద భారులు తీరారు. దీంతో వడి వడిగా ఓటింగ్ సాగింది. మద్యాహ్నం కొంత మందగించినా తరువాత పుంజుకుంది. ఉదయం 11 గంటల వరకు 31.83 శాతం మద్యాహ్నం ఒంటి గంటకు 50.71 శాతం, మూడు గంటలకు 63.96 శాతం ,ఐదు గంటలకు 71.91 శాతం పోలింగ్ నమోదైయింది . ఇది పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

### ఓట్ల గల్లంతు పిర్యాదులు తగ్గాయి

గత శాసన సభ ఎన్నికల సందర్బంగా భారీ సంఖ్యలో ఓట్లు గల్లంతైనట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ సారి ఎన్నికల్లో ఓట్ల గల్లంతుపై పిర్యాదులు నామ మాత్రంగా వచ్చాయని అధికారులు తెలిపారు.

### బందోబస్తుతో ప్రశాంతం ....

జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ పటిష్ట బందోభస్తు ఏర్పాటు చేసి అనుక్షణం పర్యవేక్షించడంతో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో పలు చోట్ల చిదురు ముదురు సంఘటనలు జరిగి ఉద్రిక్తత నెలకొన్నా అక్కడి పోలీసు సిబ్బంది. హుటా హుటిన స్పందించి పరిస్థితిని చక్క దిద్దారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆధ్వర్యంలో పర్యవేక్షించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించారు.

## చేతికి అందే దశలో చేజారిన పంట

### వాగు వెంట నీట మునిగిన పంట పొలాలు
### ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు



**ప్రజాపక్షం/గణపురం:** చేతికందే దశలో వరి పంట చేజారింది. ధర మంగళవారం కురిసిన వర్షంతో వరి కోతలు మరో 10 రోజులు ఆలస్యం కావడం తిరిగి మళ్లీ భారీ వర్షం ఆదివారం కురవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. మరో 15 రోజులైతే మండలంలో వరి కోతలు పూర్తయ్యేవి ఈ సమయం లోనే భారీ వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. ఆదివారం కురిసిన భారీ వర్షాలకు వరి పంటలు పూర్తిగా నేలవాలయి. గత మంగళవారం కురిసిన వర్షాలతో వరి పంటలకు నష్టం వాటిలినప్పటికీ ఆదివారం రాత్రి గంటకు పైగా కురిసిన భారీ వర్షంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. గణపురం మండల కేంద్రానికి చెందిన గోరంట్ల శేషగిరిరావు ప్రశాంత్ రావులకు చెందిన సుమారు 400 బస్తాల ధాన్యం ఆరబోయగా ఆదివారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం పూర్తిగా కొట్టుకుపోయి నీటిలో తేలియాడింది. భారీ వర్షం లో చేసేదేమీ లేక చేతులెత్తేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా మూరంచ వాగు వెంట వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. నగరంపల్లికి చెందిన గొర్రె ఎల్లేశ్వర్ యాదవ్ కు చెందిన సుమారు 5 ఎకరాల వరి పంట పూర్తిగా నీటిలో మునిగి మొలకలు వచ్చాయి. కోతలు పూర్తిచేసి ఆర పోసిన ధాన్యానికి గణపురం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో భారీ నష్టం వాటిల్లింది ఇప్పటికే మండలంలో వరి కోతలు ప్రారంభమైనప్పటికీ మరో వారం రోజుల్లో ఊపందుకొనున్నాయి. ప్రస్తుతం వరి పంటలు రైతులకు చేతికందే దశలో ఉండగా భారీ వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. దీంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికందే దశలో వరి పంట చేజారి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## సాధ్యంకాని హామీలు : మాజీ మంత్రి పొన్నాల విమర్శ

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే పూర్తిగా తెలంగాణ ప్రజల విశ్వాసం కోల్పోయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మ య్య ఆరోపించారు. సోమవారం మండలంలోని పొన్నాల స్వగ్రామమైన ఖిలాషాపూర్లో ఆయన సతీమణితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పొన్నాల మాట్లాడుతూ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి వై కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు దొంగ మహిపాల్ రెడ్డి, జిట్టె వీరస్వామి, కొడిదేటి శంకర్, కావటి యాదగిరి, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## 20 రోజులు ఉత్కంఠ..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలింగ్ అయితే ముగిసింది.. ఫలితాలు మాత్రం ఇవిఎం రూపంలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రమయ్యాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు, ఓటర్ల చూపంతా ఓట్ల లెక్కింపు రోజైన జూన్ 4పైనే ఉంది. సుమారు 20 రోజుల పాటు అభ్యర్థులు తమ ఫలితాల కోసం ఎదరు చూడాల్సిందే. అంతవరకు వారిలో ఉత్కంఠ నెలకొని ఉంది. ఇదిలావుండగా గెలుపోటములపై అభ్యర్థులు ఎవరి అంచనాలు వారు లెక్కలు వేసుకుంటున్నారు. వారి వారి లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా నమోదైన ఓటింగ్ శాతాన్ని అభ్యర్థులు నిశితంగా గమనిస్తున్నారు. పెరిగిన ఓటింగ్ శాతం, తగ్గిన ఓటింగ్ శాతం తమకు అనుకూలంగా ఉండవచ్చని పలువురు అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తుండగా మరికొందరు అభ్యర్థుల్లో ఆందోళనలో మొదలైంది. కార్యకర్తలు, మండలస్థాయి నేతలతో అభ్యర్థులు ఓటర్ల మనోగతంపై ఆరా తీస్తున్నారు. నమోదైన ఓటర్లలో మహిళలు, పురుషుల సంఖ్యపై కూడా ఆరా తీస్తున్నారు. దీంతో పాటు కులాలు, మతాల వారిగా కూడా నమోదైన ఓట్లపైకూడా దృష్టి సారించి తర్జనబర్జన పడుతున్నారు.ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. ఈ 20 రోజుల ఉత్కంఠను ఎదుర్కొనేందుకు కొందరు అభ్యర్థులు విహార యాత్రకు, తీర్థయాత్రలకు వెళ్లేందుకు సిద్దమవుతున్నారు.

### అందరి చూపు జూన్ 4పైనే..బెట్టింగ్‌ల జోరు

ఓట్ల లెక్కింపు జరిగే జూన్4వ తేదీపైనే అందరి చూపు నెలకొని ఉంది. అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు అందరు కూడా జూన్ 4వ తేదీ కోసం ఎదరు చూస్తున్నారు. ప్రస్తుతం అభ్యర్థుల భవిత్యం ఇవిఎంలలో నిక్షిప్తమై ఉన్నాయి. అభ్యర్థుల గెలుపోటముల పై నాయకులు, కార్యకర్తలు జోరుగా బెట్టింగ్‌లు పెడుతున్నారు. పలానా నియోజక వర్గంలో పలానా పార్టీ అభ్యర్థి గెలుస్తాడని నిర్వాహకులు జోరుగా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు.

## సిద్దిపేటలో 77శాతం పోలింగ్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిం ది. జిల్లాలో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నియోజక వర్గాలకు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. హుస్నాబాద్ నియోజక వర్గం ఓటర్లు కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజక వర్గం ఓటర్లు మెదక్ పార్లమెంట్‌కు ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాలకు చెందిన ఓటర్లు భువనగిరి పార్లమెంట్ స్థానానికి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బెజ్జంకి మండలానికి చెందిన ఓటర్లు కరీంనగర్ నియోజక వర్గానికి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజక వర్గానికి చెందిన ఓటర్లు మెదక్ పార్లమెంట్ స్థానానికి ఓటు వేసేందుకు ఉదయం నుండి బారులు తీరారు. పట్టణ ప్రాంతాల్లో మందకొడిగా ఓటింగ్ ప్రారంభమైంది. మధ్యాహ్న వేళల్లో మళ్లీ కొంత పోలింగ్ నెమ్మదించగా సాయంత్రం పోలింగ్ మళ్లీ ఊపందుకుంది. సోమవారం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 9 గంటలకు సిద్దిపేటలో 11.10శాతం, దుబ్బాకలో 13.06శాతం, గజ్వేల్‌లో 11.12 శాతం, హుస్నాబాద్‌లో 11.48శాతంనమోదైంది. 11 గం:కు సిద్దిపేటలో 26.53శా తం, దుబ్బాకలో30.45శాతం, గజ్వేల్‌లో29.65 శాతం, హుస్నాబాద్‌లో 30.35 శాతం ఓటింగ్ నమోదైంది. మధ్యా హ్నం సిద్దిపేటలో 44.36 శాతం, దుబ్బాకలో 50.38 శా తం, గజ్వేల్‌లో 49.57 శాతం, హుస్నాబాద్ 48.83 నమోదైంది. మధ్యాహ్నం సిద్దిపేటలో 58.63 శాతం, దుబ్బాకలో 67.17 శాతం, గజ్వేల్‌లో 65.13 శాతం,హుస్నాబాద్‌లో 63.98 పోలింగ్ శాతం నమోదైంది. సా: 5గంటల వరకు సిద్దిపేటలో 69.25శాతం, దుబ్బాక 78.69శాతం, గజ్వేల్‌లో 76.41 శాతం, హుస్నాబాద్ 73.63 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6గంటలకు సిద్దిపేట 73.15 శాతం, దుబ్బాక 81.75 శాతం, గజ్వేల్‌కు 79.70 శాతం, హుస్నాబాద్ నియోజక వర్గంలో 76.93 శాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 77.80 నమోదైంది.

## న్యాయవాదుల సంక్షేమానికి రూ. 100 కోట్లు

**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** రాష్ట్రంలోని న్యాయవాదుల సంక్షేమానికి రూ. 100 కోట్లు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. న్యాయవాదుల ఆరోగ్య బీమా నిమిత్తం త్వరలోనే నిధులు విడుదల చేస్తామన్నారు. తమకు ఆరోగ్య బీమా పథకానికి అవసరమైన నిధులు కేటాయించాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. గతంతో పోలిస్తే న్యాయవాదుల సంఖ్య పెరిగిందని, అందుకు తగినట్లుగా ఆర్థికసాయం అందించాలని విన్నవించారు. ఆ వినతిని పరిశీలించిన సిఎం న్యాయవాద వృత్తి పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని, న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే వారి సంక్షేమ సంఘానికి రూ. 100కోట్లు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

## మోడల్ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన కలెక్టర్




**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం 109 ములుగు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 136మోడల్‌పోలింగ్ స్టేషన్, 135న్ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటిడిఏ పిఓ చిత్రమిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజలు సందర్శించి ఓటు లిస్టు వివరాలు, మౌలిక వసతులు ఏర్పాటు గురించి బిఎల్‌ఓలు, ఆశావర్కర్లనుఅడిగితెలుసుకోవడంజరిగింది.

## అకాలవర్షాలతో రైతన్నలు ఆగం



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** రోజు కురుస్తున్న అకాల వర్షాల వలన రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా కోసిన ధాన్యం కోయాల్సిన ధాన్యం చేతికి రాకుండా వడగండ్ల వాన వలన రైతులకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ఆదివారం ఈదురుగాలులతో గోవిందరావుపేట మండలంలో వాన కురవడం వలన రైతులకు అపార నష్టం వాటిల్లిందనే భయంతో కంటి మీద కునుకు లేకుండా అవుతుందని కోయాల్సిన పంట కోయకుండా, కోసిన పంట ఆరబెట్టకుండా, ఆరబెట్టిన పంట అమ్ముకోకుండా ఈ వర్షాలు చేస్తున్నాయని రైతులు లబో అంటున్నారు. చేతికి రావాల్సిన పంట నీటి పాలు అవుతుందని కోసి ఆరబెట్టిన ధాన్యం నీళ్లలో తడిసి ముద్దయిందని తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు కొంటారో కొనరో అని భయంతో రైతులు బాధపడుతున్నారు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని తడిసిన ధాన్యాన్ని సైతం తరుగు పోకుండా అమ్మేలా చూడాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

## ఎన్నికల ప్రక్రియపై కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : పార్లమెంటు పరిధిలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోంది. ఎన్నికల ప్రక్రియపై జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ ఆఫీసర్ పమేలా సత్పతి ప్రత్యేకంగా మానిటరింగ్ చేశారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరీంనగర్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని, ఓటర్లు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. దీంతో పాటు ఎప్పటికప్పుడు తన చాంబర్ నుంచే ఎన్నికల ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా మానిటరింగ్ చేస్తున్నారు. తన దృష్టికి వచ్చే అంశాలపై అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. 9 గంటల వరకు 10.01 శాతం పోలింగ్ నమోదయ్యింది. 11 గంటలకు 26.14 శాతం, మద్యాహ్నం ఒంటి గంటలకు 45.11 శాతం, మూడు గంటలకు 58.24 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఓటు వేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. గంట గంటకు పోలింగ్ శాతం పెరుగుతూ వస్తోంది. పార్లమెంటు నియోజకవర్గం మొత్తంగా పోలింగ్ ప్రక్రియ సాఫీగా సాగుతోంది.

## ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి

### జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : ప్రజాస్వామ్య పండుగ రోజు అర్హతగల ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ హైస్కూల్ 198 పోలింగ్ స్టేషన్‌లో కలెక్టర్ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ దేశమంతా నిర్వహించుకుంటున్న ఓటు పర్వదినాన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తుని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవ్వరూ ఓటుని నిర్లక్ష్యం చేయొద్దని, ఒక్క ఓటు కూడా దేశ భవిష్యత్తుని నిర్ణయిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుని వినియోగించుకోవాలన్నారు. ఓటు అనేది సామాన్య ప్రజల స్వరమని, పాలకులని ప్రశ్నించేందుకు తప్పకుండా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులకు సూచనలు, సలహాలు చేశారు. ఓటర్లకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ సరళిపై పోలింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## మోడల్ పోలింగ్ స్టేషన్ సందర్శన



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం 023 రామగుండము అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని మోడల్ పోలింగ్ స్టేషన్ (టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్, జనగాంమోడల్ మేనేజ్డ్ పోలీస్ స్టేషన్) ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ సందర్శించి, ఓటరు లిస్ట్ వివరాలు, మౌళిక వసతులు ఏర్పాటు గురించి సంబంధిత బి.ఎల్. ఓ లు, ఆశా వర్కర్లను అడిగి తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో రామగుండం సిడిపిఓ తదితరులు హాజరైనారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సిపి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా కరీంనగర్ త్రీటౌన్ పరిధిలోని సుభాష్ నగర్‌లోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కరీంనగర్ వన్ టౌన్ పరిధిలో గల కోతిరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కరీంనగర్ టూటౌన్ పరిధిలో సప్తగిరి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు పలు ఇతర పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తపల్లి హవేలీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, రేకుర్తిలోని లయోల పాఠశాల, తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని జిలా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి హుజురాబాద్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు పలు ఇతర కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బందిని ఎన్నిక ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సమస్యలు ఉన్నట్లయితే దృష్టికి తీసుకురావాలన్నారు. ఏమైదాన శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే అందుబాటులో ఉండే సమీప అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు.


## స్కూటీని ఢీకొట్టిన ఆర్‌టిసి గరుడ బస్సు

### ముగ్గురి మృతి... మరో ఇద్దరికి గాయాలు



ప్రజాపక్షం/రఘునాథపల్లి: ఆర్‌టిసి గడుడ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగ్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన తెలకలపల్లి రవీందర్ (35), తన భార్య జ్యోతి(32), కుమారుడు భవేష్ (10)తో హైధరాబాద్ నుండి తన టీఎస్ 30బీ 2801 స్కూటీపై పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి కుటుంబంతో కలిసి వస్తున్న క్రమంలో మండలంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపక్కనే ఉన్న మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద ఆగి టిఫిన్ చేస్తుండగా అదే సమయంలో హైదరాబాద్ నుండి హన్మకొండకు వెళ్తున్న వరంగల్ వన్ డిపోకు చెందిన టిఎస్ 09 జెడ్ 8051 నెంబర్ గల గరుడ బస్సు అతివేగంగా వస్తూ ఆర్టీసి డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బస్సు అదుపుతప్పి టిఫిన్ చేస్తున్న వారిపైకి దూసుకెళ్లడంతోపాటు మొబైల్ టిఫిన్ సెంటర్ వాహనాన్ని సైతం ఢీ కొట్టింది. దీంతో జ్యోతి అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందగా ఆమె భర్త రవీందర్, కుమారుడు భవేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా వారిని జనగామ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ఎంజీఎంకు తరలించాలని వైద్యులు సూచించగా వారు వరంగల్‌కు తీసుకెళ్తున్న క్రమంలో తండ్రి, కుమారుడు ఇద్దరు మృతిచెందారు. ఇదే విధంగా ప్రమాదంలో మండలంలో సోమయ్య కుంట తండాకు చెందిన మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వాహకులు నునావత్ సంతోష్‌కుమార్, శ్రీకాంత్‌లకు గాయాలు కాగా వారిని మరో వాహనంలో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. జ్యోతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్నట్లు ఎస్ఐ దూదిమిట్ల నరేష్‌యాదవ్ తెలిపారు. జాతీయ రహదారిని ఆదునుకుని మండల కేంద్రంలో రోడ్డు పక్కనే మొబైల్ టిఫిన్ సెంటర్లు పెట్టడంతో జనాలు గుమికూడి వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇలాంటి ప్రమాదాలు తరచు జరుగుతున్నాయని ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి మరోసారి ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు.

# పోలింగ్ కేంద్రాలకు బారులు తీరిన ఓటర్లు



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఓటు వేసేందుకు ఉదయం నుంచే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. జిల్లాలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరిగింది. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. పోలింగ్ ముగింపు సమయానికి పోలింగ్ కేంద్రం లోపల క్యూలైన్లో ఉన్నవారందరికీ కూడా ఓటు వేసే అవకాశం కల్పించారు. జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలలో మొత్తం 4,56,309 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 2,27,310 మంది, మహిళలు 2,28,971 మంది, ఇతరులు 28 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 676 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ లోకసభ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలలో భారీ పోలీస్ బందోబస్తూ ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 3 గంటల వరకు ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 65.50 శాతంతో 1,48,821 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా, సిర్పూర్ నియోజకవర్గంలో 61.16 శాతంతో 1,40,119 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా జిల్లాలో 63.33 శాతం ఓటింగ్ నమోదైంది.

## బోథ్‌లో 74.80 శాతం పోలింగ్



ప్రజాపక్షం/బోథ్ : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు నూతనంగా ఓటు హక్కు పొందిన ఓటర్లు సోమవారం ఉత్సాహంగా ఓటు వేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. బోథ్ మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ఉదయం పూట పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా మరి కొందరు సాయంత్రం సమయంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక మండలంలోని కౌఠ(బి) గ్రామంలో 230 పోలింగ్ బూత్‌లో ఇవిఎం మొరాయించడంతో మరో ఇవిఎంను ఏర్పాటు చేశారు. ఇక జీడిపల్లె గ్రామస్థులు ఓటు వేసేందుకు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న కరత్వాడ గ్రామానికి వెళ్లి ఓట్లు వేశారు. జీడిపల్లె గ్రామంలో ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. మొత్తానికి బోథ్ నియోజకవర్గలో ఓటింగ్ ప్రశాంత జరిగింది. ఈ నియోజకవర్గంలో 74.80 శాతం ఓటింగ్ నమోదైంది.

## జిల్లాలో 63.86 శాతం ఓటింగ్



ప్రజాపక్షం /మంచిర్యాల ప్రతినిధి : లోక్ సభ ఎన్నికల సమయం ముగిసే సరికి జిల్లాలో 63.86 శాతం ఓటింగ్ నమోదైంది. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో సాయంత్రం గం. 5:00ల వరకు మంచిర్యాలలో 59.78 శాతం, బెల్లంపల్లిలో 70.73 శాతం, చెన్నూరులో 68శాతం నమోదు కాగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని రామగుండంలో 55.18 శాతం, మంథనిలో 61.55 శాతం, పెద్దపల్లిలో 64.8శాతం, ధర్మపురిలో 69.83 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిర్పూర్ 68.14 శాతం, ఆసిఫాబాద్‌లో 67.31 శాతం ఓటింగ్ నమోదైంది.

## ఓటింగ్ సరళిని పరిశీలించిన ప్రభుత్వ విప్ అడ్లూరి

ప్రజాపక్షం/పెగడపల్లి : జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండలంలో నిర్వహిస్తున్న ఓటింగ్ సరళిని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్ సతీమణి కాంత కుమారి, టిపిసిసి ప్రచార కమిటీ జాయింట్ సెక్రటరీ గజ్జల స్వామి సోమవారం పరిశీలించారు. పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా పెగడపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో గజ్జల స్వామి పరిశీలించారు. మండలంలోని ల్యాగలమర్రి, దీకొండ, నంచర్ల, వెంకటాయిపేట, పెగడపల్లి, నందగిరి, నామాపూర్ ,మ్యాకవెంకయ్యపల్లి, నరసింహుని పేట, కీచులాటపల్లి గ్రామాలను సందర్శించగా ప్రభుత్వ విప్ సతీమణి కాంతాకుమారి వెంకటాయిపేట తో పాటు కొన్ని గ్రామాలను సందర్శించారు. మండలంలోని 23 గ్రామాలను టిపిసిసి ప్రచార కమిటీ జాయింట్ సెక్రటరీ గజ్జల స్వామి సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.



# రెండుచోట్ల మొరాయించిన వివి ప్యాట్స్

ప్రజాపక్షం/అసిఫాబాద్ ప్రతినిధి : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లా ఎస్‌పి సురేష్ కుమార్ పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. ఉదయం 7 గంటల నుండి ఓటర్లు క్యూలో నిల్చొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏడు గంటల నుండి 9 గంటల వరకు ఓటర్ శాతం మందకోడిగా ఉన్నా 9 గంటల నుండి ఓటర్లు అధిక సంఖ్యలో వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆసిఫాబాద్ పోలింగ్ కేంద్రంలో ఎంఎల్‌ఎ కోవ లక్ష్మి, బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి ఆత్రం సక్కు, కాంగ్రెస్ అభ్యర్థి సుగుణక్క, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ ఇంచార్జి అజ్మీరా శ్యాం నాయక్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెబ్బెన మండల కేంద్రంలోని 20075 పోలింగ్ కేంద్రంలో వివి ప్యాట్ అదేవిధంగా కాలేజ్ గారులోని బాల భారతి పోలింగ్ కేంద్రంలో వివి ప్యాట్ మోరయించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అనంతరం అధికారులు వివి ప్లాట్ లను సమకూర్చగా ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకున్నారు. వాంకిడి, సిర్పూర్ యు, సిర్పూర్ టి, రెబ్బెన తదితర మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది జిల్లా ఎస్‌పి సురేష్ కుమార్ పోలింగ్ కేంద్రాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా సమీక్షించారు.



కాంగ్రెస్ అభ్యర్థి సుగుణక్క, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ ఇంచార్జి అజ్మీరా శ్యాం నాయక్

# ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్

### రామగుండం సిపి శ్రీనివాస్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని మంథనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామగుండం నియోజకవర్గం గోదావరిఖనిలోని సింగరేణి ట్రైనింగ్ సెంటర్, పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోని పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని, మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధి పంగిడి సోమారం లోని స్కూల్, చెన్నూర్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ స్కూల్, బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి పట్టణంలోని బజారు ఏరియాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, రామన్ పల్లి వద్ద ఉన్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్‌ను పోలీస్ అధికారులతో కలిసి సందర్శించి, విధి నిర్వహణలో ఉన్న అక్కడి పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ తరువాత పోలింగ్ పరికరాలను కౌంటింగ్ కేంద్రాలకు తరలింపు గురించి పలు ఆదేశాలు సూచనలు చేశారు. ఈసందర్భంగా సిపి మాట్లాడుతూ....రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయి. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ఎలాంటి అవాంఛనియా సంఘటనలు, గోడవలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది. ప్రజలు అందరు వచ్చి తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలి పోలీస్ సిబ్బంది వారికి భద్రత కల్పిస్తూ, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది అని సిపి తెలిపారు. సిపి వెంట స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు గోదావరిఖని ఎసిపి రమేష్ , జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఎసిపి రవి కుమార్, మంచిర్యాల ఎసిపి ప్రకాష్, టాస్క్ ఫోర్స్ ఎసిపి మల్లారెడ్డి, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేన్, మంథని సీఐ వెంకటేశ్వర్లు, పెద్దపల్లి సీఐ కృష్ణ, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, చెన్నూర్ టౌన్ సీఐ రవీందర్, బెల్లంపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ దేవయ్య, రూరల్ సీఐ అఫ్జాలొద్దీన్ ,ఎస్ఐ లు పాల్గొన్నారు.

# బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

### కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో 67.67 పోలింగ్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. సిరిసిల్ల ,వేములవాడ నియోజకవర్గ పరిదిలో అధికారులు 547 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి మండలం కట్టలింగంపేటలో 11 గంటల ప్రాంతంలో ఇవిఎంలు మొరాయించాయి. అధికారులు స్పందించడంతో తిరిగి పోలింగ్ ప్రారంభమైంది. ఈ సంఘటన మినహా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని చెప్పవచ్చు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ ముగిసేసరికి ఓటింగ్ శాతం 67. 67 శాతంగా నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గాల వారీగా చూసుకుంటే సిరిసిల్ల 69. 58. వేములవాడ 71.26, మానకొండూర్ 71.11, కరీంనగర్ 58. 82, హుజురాబాద్ 68.67, హుస్నాబాద్ 73. 63, చొప్పదండి 70. 13 శాతంగా ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్స్ లో భద్రంగా ఉంది. సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలో అప్పుడే పార్టీల అభ్యర్థులు గెలుపు ఓటమిలపై ప్రజలు లెక్కలు వేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అదృష్టం ఎవరిని వరిస్తుందో ఫలితాల విలువడే వరకు వేచి చూడాల్సిందే. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత నిర్వహించారు. కరీంనగర్ పట్టణ ఓటర్లు ఆసక్తి చూపకపోవడం త్రిముఖ పోటీలో అభ్యర్థుల గెలుపు ఓటములపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న చర్చ నడుస్తుంది.

## జగిత్యాలజిల్లాలో '69.87'%

ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి : జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 69.87 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు ప్రకటించారు. జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని పోలీస్ అధికారులు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 2,45,249 ఓట్లకు గాను 70.07 శాతం పోలింగ్ నమోదు అయ్యిందని అధికారులు తెలిపారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో 2,36,675 ఓట్లకు గాను 68.55 శాతం పోలింగ్ నమోదు అయింది. అలాగే పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,30,786 ఓట్లకు గాను 69.05 శాతం పోలింగ్ నమోదైనట్లు ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఈసారి ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను ఎస్పీ, అదనపు ఎస్పీ, డిఎస్పీలు పోలింగ్ కేంద్రాలు పరిశీలించి ఓటింగ్ సరళిని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఎన్నికల సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు.




# ఓటుహక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు



ప్రజాపక్షం/ మంచిర్యాల : మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలని కోరారు.

### ఓటు తోనే ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ : ఎంఎల్‌ఎ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కార్మెల్ హైస్కూల్‌లో ఎంఎల్‌ఎ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, డిసిసి అధ్యక్షురాలు సురేఖ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం ఓటు అని, ఓటు హక్కు వినియోగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ ఉంటుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

### రాజ్యాంగం కల్పించిన వజ్రాయుదం ఓటు : మాజీ ఎంఎల్‌ఎ నడిపెల్లి దివాకర్ రావు



మంచిర్యాల మాజీ ఎంఎల్‌ఎ నడిపెల్లి దివాకర్ రావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌బిహెచ్‌వి హైస్కూల్ లోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం ఓటు అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.



జగిత్యాల జిల్లా ప్రతినిధి : జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ఎస్‌కేఎన్ఆర్ బాలికల కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే జగిత్యాల మండలం అంతర్గాం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ రాధిక దంపతులతో పాటు, మాజీ మంత్రి రాజేశం గౌడ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగిత్యాల పట్టణంలోని 177వ పోలింగ్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఓటు వేశారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ జగిత్యాలలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జగిత్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్‌రెడ్డి బుగ్గారంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి బొట్ల చంద్రయ్య జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని బుగ్గారం మండలం యశ్వంతరావుపేట గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.







రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని గీతనగర్ లోని జిల్లా ఉన్నత పాఠశాలలో 116 పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎస్ పి.అఖిల్ మహజన్ దంపతులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. అలాగే జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా కేందర్రంలోని శాంతినగర్‌లో గల 159 పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారు.

పెద్దపల్లి ప్రతినిధి : లోక్ సభ పోలింగ్ సందర్భంగా పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ సామాన్యుడిలా క్యూ లైన్ లో నిలబడి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ లో రంగంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం సంఖ్య 79 లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.





నిర్మల్ టౌన్ : సోమవారం ఉదయం నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాజులపేట ప్రాంతంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో బిజెపి నేత, నిర్మల్ ఎంఎల్‌ఎ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



నిర్మల్ టౌన్ : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు అనేది ప్రజలందరి బాధ్యత,రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం అని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. నిర్మల్ పట్టణంలోని జెడ్పీ కార్యాలయంలోని 237వ నంబర్ పోలింగ్ కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కలెక్టర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఓటర్లంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలన్నారు.ఓటింగ్ శాతం పెరిగిందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.పోలింగ్ కేంద్రంలో గల ఏర్పాట్లను పరిశీలించారు.

## సమస్యలు పరిష్కరించాలని పలుచోట్ల పోలింగ్ బహిష్కరణ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** మండలంలోని కనుముకుల గ్రామంలో రైస్ మిల్లర్ల వైఖరిని నిరసిస్తూ సోమవారం రైతులు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని గంటసేపు పోలింగ్‌ను బరనణ గఆదివారం కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం బస్తాలు అడ్డుగా వేసి పోలింగ్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. పోలిం గ్ ప్రారంభం కాకముందే రైతులు ధర్నాకు దిగడంతో గంటసేపు పోలింగ్ నిలిచిపోయి ఉత్కంఠ కొనసాగింది. గ్రామస్తులు రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ జై జవాన్ జై కిసాన్ ప్రభుత్వ వైఖరి నశించాలి అంటూ ఆందోళన చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అధికారులు ఎంత సర్ది చెప్పినా హామీ ఇవ్వాలని కోరుతూ పట్టుబట్టి బైఠాయించారు. మొండిగా భీష్మించి కూర్చోవడంతో అధికారులు ప్రజాప్రతినిధులు రైస్ మిల్లుల యజమానులు ధాన్యం కొనుగోలు చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో ధర్నా విరమిచ్చారు దీంతో పోలింగ్ అధికారులు ఊపిరి పిలుచుకొని పోలింగ్ ప్రక్రియను కొసాగించారు.

### నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలో



**కడెం :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం లోని కడెం మండలంలో గల అల్లంపల్లి,బాబానాయక్ తాండ గ్రామస్తులు పార్లమెంట్ ఎన్నికలను సోమవారం బహిష్కరించారు. గ్రామాలకు సరైన రోడ్ల సౌకర్యం లేదని పలుమార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు.గ్రామాలకు పక్కా తారు రోడ్డు ఏర్పాటు చేస్తామని ఉన్నత అధికారులు సరైన భరోసా ఇస్తేనే ఓట్లు వేస్తామని మొండికేస్తూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.అల్లంపల్లి,బాబానాయక్ తాండలలో గల పోలింగ్ స్టేషన్‌లలో ఉదయం 10గంటల వరకు ఒకటే ఓటు నమోదయింది. సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన ఆగ్రామాలకు తరలి వెళ్లారు.

### వంతెన నిర్మించాలని



**ఏన్కూరు :** పంట పొలాలకు వెళ్లేందుకు ఉన్న ఎన్ఎస్‌పి కాల్వపై దెబ్బతిన్న వంతెనను నిర్మించాలని మండల పరిధిలోని రాయమాదారం గ్రామస్థులు పోలింగ్‌ను బహిష్కరించారు. ఎన్ఎస్‌పి కాల్వపై వంతెన నిర్మాణ పనులు చేపట్టడం లేదని బ్రిడ్జి ఎన్నో ఏళ్ళ నుండి సమస్య పరిష్కారం కాక పోవడంతో గ్రామస్థులు రహదారిపై ఆందోళనకు దిగారు. ఏడుగురు ఎమ్మెల్యేలు మారినా కాని ఇంతవరకు కాల్వపై బ్రిడ్జి నిర్మాణ పనులు జరగలేదంటూ గ్రామస్థులు పోలింగ్ బహిష్కరించారు. ఈ సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ శేషగిరిరావు, ఎండివో రమేష్, ఎస్సై బాదావత్ రవి సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. మీ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని తహశీల్దార్ శేషగిరిరావు చెప్పడంతో గ్రామస్థులంతా ఆందోళన విరమించి పోలింగ్‌లో పాల్గొన్నారు.

## ఓటు వేయాలంటే గుట్టలు దాటాల్సిందే

### 16 కిలోమీటర్ల కాలినడకన వచ్చి ఓటువేసిన గిరిజనులు



**ప్రజాపక్షం/వాజేడు :** మూడు గుట్టలు దాటి 16 కిలోమీటర్ల మేర కాలినడకన వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్న గిరిజనులు, తెలంగాణ, ఛత్తీస్‌గడ్ సరిహద్దు అడవుల్లో ఉన్న పెనుగోలు గిరిజనులు రాష్ట్రంలోనే అత్యంత మారుమూల ప్రాంతం అక్కడ నుండి 16 కిలోమీటర్లు మేరా నడుచుకుంటు వచ్చి వాజేడు మండల కేంద్రంలో జంగాలపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణాల్లో ఉంటూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు నిరాకరిస్తున్న ప్రజలకు పెనుగోలు గిరిజనులు ఆదర్శవంతంగా నిలుస్తున్నారు. ఆ గిరిజనులు నిరక్షరాస్యులు అయినప్పటికి ఎన్నికల పట్ల పూర్తి అవగాహనను గిరిజనులు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎంతని కష్టమైన వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటారు. ప్రతి ఎన్నికలకు 32 కిలోమీటర్ల రాను పోను కాలినడకన మూడు గుట్టలు దాటుకుంటు కిందకి వచ్చి ఓటు హక్కు వినియోగించి తిరిగి ప్రయాణమవుతారు. ప్రస్తుతం 22 మంది ఓటర్లు మాత్రమే అక్కడ ఉన్నారు. 11 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.



# రాష్ట్రవ్యాప్తంగా ఓటేసిన ప్రముఖులు

### కొడంగల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి ఓటు



వికారాబాద్ జిల్లా మర్పల్లిలో ఓటువేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్



మధిరలో సతీమణి నందినితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఉపముఖ్య-మంత్రి మల్లు భట్టివిక్రమార్క







ఖమ్మం గొల్లగూడెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కల్లూరు మండలం నారాయణపురంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హన్మకొండ జిల్లా వంచనగిరిలో ఓటు వేసిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో రాజకీయ ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజలందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మధిరలో సతీమణి నందినితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి మండల కేంద్రంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మం గొల్లగూడెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కల్లూరు మండలం నారాయణపురంలో మంత్రి పొంగులేటి, ములుగు జిల్లా జగ్గన్నపేటలో మంత్రి సీతక్క, సంగారెడ్డి జోగిపేటలో మంత్రి దామోదర రాజనర్సింహ, వంచనగిరిలో మంత్రి కొండా సురేఖ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 151బూత్‌లో మంత్రి శ్రీధర్‌బాబు ఓటు వేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసమేతంగా వెళ్లి ఓటు వేశారు. ఓటు వేసేందుకు



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్



సూర్యాపేట జిల్లా కోదాడలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆయన సతీమణి, ఎంఎల్ఎ పద్మావతిరెడ్డి



ములుగు జిల్లా జగ్గన్నపేటలో మంత్రి సీతక్క



సంగారెడ్డి జోగిపేటలో మంత్రి దామోదర రాజనర్సింహ

ఆయన ఆర్‌టిసి బస్సులో వెళ్లారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని 182వ పోలింగ్ బూత్‌లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆయన సతీమణి, కోదాడ ఎంఎల్ఎ పద్మావతిరెడ్డితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. నల్లగొండ పట్టణంలో ఎమ్‌విఆర్ హైస్కూల్‌లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్‌లో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ దంపతులు ఓటువేశారు. బంజారాహిల్స్‌లోని నందీనగర్‌లో ఉన్న జిహెచ్‌ఎంసి కమ్యూనిటీ హాల్లో కుమారుడు హిమాన్షు, సతీమణి శైలిమతో కలిసి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఓటువేశారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. హైదరాబాద్‌లోని రాంనగర్ జెవిఐ స్కూల్ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు వేశారు. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి హైదరాబాద్‌లో తన సతీమణితో కలిసి ఓటు వేశారు.

### ఓటు హక్కు వినియోగించుకున్న సినీ ప్రముఖులు

హైదరాబాద్‌లో పలువురు సినీప్రముఖులు తమ కుటుంబ సమేతంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్‌లో సీనియర్ నటుడు చిరంజీవి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతో పాటు సతీమణి సురేఖ, కుమార్తె సుస్మిత కూడా ఓటేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఓటు అనేది హక్కు మాత్రమే కాదని అది మన బాధ్యత అని, ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చి ఓటు వేయాలని కోరారు. జూబ్లీ హిల్స్‌లోని ఓబుల్‌రెడ్డి పాఠశాలలో హీరో జూనియర్ ఎన్‌టిఆర్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అల్లు అర్జున్ ఫిల్మ్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. సికింద్రాబాద్ పద్మారావునగర్ వాకర్ టౌన్‌హాల్‌లో ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల తన కుటుంబ సమేతంగా వచ్చి ఓటు వేశారు. నానక్‌రామ్‌గూడలో హీరో నరేష్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో సిని దర్శకుడు రాఘవేంద్రరావు, సినీ హీరో మనోజ్, యాంకర్ ఝాన్సీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్‌లో మహేశ్ బాబు దంపతులు ఓటువేశారు. జూబ్లీహిల్స్ క్లబ్ పోలిం గ్ కేంద్రంలో రామ్‌చరణ్, ఉపాసనలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పరుచూరి గోపాలకృష్ణ, నటుడు నాగచైతన్య, మంచు లక్ష్మి , శేఖర్ కమ్ముల, శివబాలజీ దంపతులు, నటుడు నాని, సుమంత్, ఆనంద్ దేవరకొండ హైదరాబాద్‌లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచు ఫ్యామిలీ హీరోలు మోహన్‌బాబు, విష్ణు, మనోజ్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నటుడు నాగచైతన్య, ప్రముఖ దర్శకులు ఎస్ఎస్‌రాజమౌళి దంపతులు, దర్శకుడు తేజ ఓటుహక్కు వినియోగించుకున్నారు.



నల్లగొండ పట్టణంలో కుటుంబ సమేతంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండలో కుటుంబ సభ్యులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలో మంత్రి శ్రీధర్‌బాబు

### ఓటేసిన అధికారులు

లోక్‌సభ ఎన్నికల్లో ఉన్నతాధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఎస్ఆర్ నగర్‌లోని పోలింగ్ బూత్‌లో తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. ప్రశాసన్ నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జూబ్లీహిల్స్ సెంట్రల్ నర్సరీలో డిజిపి రవిగుప్తా కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు విశాంత్ర ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మాదాపూర్‌లో జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రాస్, కొండాపూర్‌లోని చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆర్‌టిసి ఎండి సజ్జనార్ దంపతులు, ఏసిబి డిజిపి సివి ఆనంద్ దంపతులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. డిఆర్‌డిఓ ఛైర్మన్ సతీష్ రెడ్డి దంపతులు బంజారాహిల్స్‌లోని సెయింట్ ఆగస్టీన్ స్కూల్‌లో ఓటేశారు. బంజారాహిల్స్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి సి.పార్థసారథి కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపి అభ్యర్థులు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. బర్కత్‌పురాలోని పోలింగ్ కేంద్రంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి దంపతులు ఓటు వేశారు. నిజామాబాద్‌లో బిజెపి అభ్యర్థి ధర్మపురి అరవింద్ దంపతులు తమ ఓటు వేశారు. మేడ్చల్ జిల్లా పూడూరులో మల్కాజిగిరి బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్, హనుమకొండ టీచర్స్ కాలనీలో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, వరంగల్ బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్ తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మహబూబ్‌నగర్ టీచర్స్ కాలనీలో మహబూబ్ నగర్ బిజెపి అభ్యర్థి డికె అరుణ, చేవెళ్ల గొల్లపల్లిలో చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ గుండూరులో నాగర్‌కర్నూల్ బిజెపి అభ్యర్థి భరత్ ప్రసాద్, అలంపూర్‌లో నాగర్ కర్నూల్ బిఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్ కుమార్, సిద్దిపేట దుబ్బాక బొప్పాపూర్‌లో మెదక్ బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు, రంగారెడ్డి పసుమాములలో భువనగిరి బిజెపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్, మహబూబాబాద్ అభ్యర్థి మాలోతు కవిత ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగూడెం ములకలపల్లిలో ఖమ్మం బిజెపిఅభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, మాదాపురంలో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి, ఖమ్మంలో బిఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కుటుంబసభ్యులతో కలిసి ఓటువేశారు. సూర్యాపేట గుండ్లపల్లిలో నల్లగొండ బిజెపి అభ్యర్థి సైదిరెడ్డి, ఉట్నూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మోండా మార్కెట్‌లో సికింద్రాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్, పటాన్ చెరు మండలం చీట్కుల్లో మెదక్ కాంగ్రెస్‌అభ్యర్థి నీలం మధు, జగిత్యాలలో నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్ రెడ్డి, మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ జ్యోతినగర్‌లో బిజెపి ఎంపి అభ్యర్థి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో పోలింగ్ బూత్ లో తన ఓటుహక్కును కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి వినియోగించుకున్నారు. హైదరాబాద్ బిజెపి అభ్యర్థి మాధవిలత మహేంద్ర హిల్స్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. హబ్సిగూడా శ్రీసాయిపబ్లిక్ స్కూల్‌లో మల్కాజిగిరి బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గౌలిగూడా వాల్మీకి సమాజ్‌లోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### ఓటేసిన సిపిఐ నేతలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెంలోని విద్యానగర్ కాలనీ జికె విద్యాలయం బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు కుటుంబంతో కలిసి ఖమ్మం ఇందిరానగర్ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తమ ఓటుహక్కు ఖమ్మంలో వినియోగించుకోగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కెసాబీర్‌పాషా కొత్తగూడెంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడమటిపల్లిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని తాటికోల్ గ్రామంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని రేగొండ గ్రామంలో సిపిఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి దంపతులు తమ ఓటును వినియోగించుకున్నారు.



కొత్తగూడెంలోని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




కరీంనగర్ జిల్లా రేగొండ గ్రామంలో చాడ వెంకటరెడ్డి






ఖమ్మంలో బాగం హేమంతరావు, కొత్తగూడెంలో ఎస్‌కె సాబీర్‌పాషా



ఖమ్మంలో కుటుంబసభ్యులతో పువ్వాడ నాగేశ్వర్‌రావు



నల్లగొండ జిల్లా పడమటిపల్లి గ్రామంలో పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ నాయకులు

## తమ ఓటు తామే వేసుకోని అభ్యర్థులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన పలువురు అభ్యర్థులు తమకు తాము ఓటే వేసుకోలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో వారు ఓటరు కాకపోవడమే ఇందుకు కారణం. దీంతో వారంతా ఇతర అభ్యర్థులకు ఓటేయాల్సి వచ్చింది. హైదరాబాద్ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, బిజెపి అభ్యర్థి మాధవీలత ఇద్దరు తమకు తాము ఓటు కోలేకపోయారు. అసదుద్దీన్ ఓటు రాజేంద్రనగర్ అసెంబ్లీ సెంగ్మెట్ పరిధిలో ఉండగా, ఈ నియోజవర్గం చేవెళ్ల లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. దీంతో ఇక్కడ ఎంఐఎం అభ్యర్థి లేకపోవడంతో ఆయన ఇతర పార్టీ అభ్యర్థికి ఓటు వేయాల్సి వచ్చింది. అదేవిధంగా బిజెపి అభ్యర్థి మాధవిలత సైతం తనకు తాను ఓటు వేసుకోలేకపోయారు. ఆమె ఈస్ట్ మారేడ్‌పల్లిలోని మహేంద్ర హిల్స్‌లో నివాసం ఉంటారు. ఆప్రాంతం కంటోన్మెంట్ నియోజకవర్గం మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి రావడంతో ఆమె సైతం తన ఓటు తనకు అక్కడ ఉపయోగించుకున్నారు. మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ఇదే పరిస్థితి. ఆమె ఓటు తాండూరు నియోజకవర్గంలో ఉండడం, ఈ నియోజకవర్గం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి రావడంతో సునీతా మహేందర్ రెడ్డి సైతం తన ఓటు తనకు వేసుకోలేకపోయారు.

## బిఆర్‌ఎస్‌కు గొప్పఫలితాలు : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు గొప్ప ఫలితాలు వస్తాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ శ్రేణులు ఎన్నికల్లో అద్భుతమైన పోరాటపటిమ ప్రదర్శించారన్నారు. ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నప్పటికీ సవాళ్లను ఎదుర్కొని తిరిగి నిలబడి పోరాటం చేశామన్నదే ముఖ్యమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో పనిచేసిన పార్టీ కార్యకర్తలను, సోషల్ మీడియా వారియర్లను కెటిఆర్ అభినంధించారు.

## పోలింగ్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

పెద్దపల్లి, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని సమస్యాత్మకమైన 13 అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగించారు. మిగిలిన 106 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సాయంత్రం 6 గంటల తరువాత కూడా పోలింగ్ కొనసాగింది. ఇవిఎం మిషన్లను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య ఆయా జిల్లాలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు

ఓటరు బురఖా తొలగింపు....

హైదరాబాద్ లోక్‌సభ బిజెపి అభ్యర్థి కె.మాధవిలతపై మలక్‌పేట్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మాధవిలత పోలింగ్ స్టేషన్‌లను పర్యవేక్షించే క్రమంలో సోమవారం ఉదయం మలక్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆస్మాన్‌ఘాట్ హోలిమదర్ హై స్కూల్‌లో ఉన్న 64వ పోలింగ్ స్టేషన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో తన ఓటు హక్కు వినియోగించుకోడానికి బురఖా ధరించి వచ్చిన మహిళను మాధవిలత అడ్డుకుంది. ఆమె ఓటర్ ఐడితో పాటు ఆధార్‌కార్డును పరిశీలించింది. ఈ విషయంపై ఎంఐఎం నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. 'పోలింగ్ స్టేషన్‌లో బూత్ లెవల్ అధికారి ఎం.అరుణ అనుమతి లేకుడా మహిళా ఓటరు బురఖా తొలగించడం ఎన్నికల విధులను ఉల్లంగించివారవుతారు. మాధవిలతకు ఓటరుపై ఏమైన అనుమానాలు ఉంటే అక్కడే విధుల్లో ఉన్న బూత్‌లెవల్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. ఆమె సదరు ఓటరును పరిశీలించే అవకాశాలు ఉంటాయి. అయితే ఎలాంటి అనుమతి లేకుండా ఎంపి అభ్యర్థిగా పోటీలో ఉన్న అభ్యర్థి మాధవిలత నేరుగా ఓటరును అడ్డుకుని బురఖా తొలగించడం నేరం. అరుణ ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు మాధవిలతపై నమోదు చేశారు. జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సురేశ్ షెట్కార్ సోదరుడు నగేష్ షెట్కార్.. ఓ ఓటరును కాలితో తన్నడు. ఈ ఘటన నారాయణఖేడ్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద చోటుచేసుకుంది. గోషామహల్ బిజెపి ఎంఎల్‌ఏ రాజాసింగ్ మంగళ్‌హాట్ పరిధిలోని ఎస్ఎస్‌కె జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వెళ్లాడు. అక్కడ పోలింగ్ అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేశారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో జయరాజ్ అనే ఓటరు ఓటు వేస్తూ సెల్ఫీ తీసుకున్న ఘటనపై పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు.

## పట్టణాల్లో తక్కువ

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. భువనగిరి జిల్లాలో అత్యధికంగా 72 శాతం, హైదరాబాద్‌లో అత్యల్పంగా 39 పోలింగ్ శాతం నమోదైంది. సమస్యాత్మాక ప్రాంతాలైన 13 అసెంబ్లీ సిగ్మెంట్లలో సాయంత్రం నాలుగు గంటలకు, మిగితా 106 అసెంబ్లీ సిగ్మెంట్లలో సాయంత్రం 6 గంటలకు పోలింగ్‌ను ముగించారు. అయితే సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాల లోపల క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరినీ ఓటు వేసేందుకు అనుమతించారు. చాలా నియోజకవర్గాల్లో ఓటర్లు ఉదయం నుంచే బారులు తీరి ఓటు వేశారు. పట్టణ ప్రాంతాల్లో తక్కువగా, గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున పోలింగ్ జరిగింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. మహబూబాబాద్, పెద్దపల్లి, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని సమస్యాత్మకమైన 13అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 4 గంటలకే అధికారులు పోలింగ్ ముగించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం, ఆశ్వారావుపేట అసెంబ్లీ సెంగ్మెట్లలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, సాయంత్రం 4 గంటలకు ముగిసింది. హైదరాబాద్‌లో ఓటర్ల చైతన్యం కనిపించలేదు. మల్కాజ్‌గిరి, చెవేళ్ల నియోజకవర్గాల్లో పోలింగ్ కొంత నయమే అయినప్పటికీ ఆ రెండు నియోజకవర్గాల్లో కూడా 50శాతం పోలింగ్ దాటలేదు. వాతావరణం చల్లగా ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బయటకు వచ్చి ఓట్లు వేశారు. అయితే వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో పట్టణవాసులు ఊరు బాట పట్టడం, టూర్లకు వెళ్ళడం, హైదరాబాద్‌లో సెటిలైన ప్రజలు ఎపిలో ఓటు వేసేందుకు వెళ్లడం వల్ల హైదరాబాద్‌లో పోలింగ్ శాతం తగ్గినట్లు అంచనా వేస్తున్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఓ వర్గం ఓట్లను తొలగించారని ఓటర్లు ఆందోళన చేశారు. పోలింగ్ అనంతరం భారీ భద్రత మధ్య ఇవిఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు.

**పోలింగ్ బహిష్కరణ...** రాష్ట్రంలోని పలు గ్రామాల ప్రజలు పోలింగ్‌ను బహిష్కరించారు. తమ సమస్యలను పరిష్కరించడం లేదని గ్రామస్తులు తమ నిరసన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూలు మండలంలోని బల్మూర్‌లో మైనింగ్‌కు ప్రభుత్వం ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలింగ్‌ను బహిష్కరించినట్లు వారు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు మండలం రాయమాదారంలో గ్రామస్తులు కూడా పోలింగ్‌ను బహిష్కరించారు. ఎన్ఎస్‌పి కాలువపై వంతెన నిర్మించలేదని నిరసిస్తూ పోలింగ్‌ను బహిష్కరించినట్లు వారు తెలిపారు. యాద్రాద్రి జిల్లా పోచంపల్లి మండలంలోని కనుముక్కల గ్రామస్తులు కూడా ఎన్నికలను బహిష్కరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా ధాన్యం తడిసిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని హామీనిస్తే.. ఓటు వేసేందుకు తామంతా సిద్ధమని కనుముక్కల గ్రామస్తులు ఈ సందర్భంగా తెలిపారు. అలాగే నిర్మల్ జిల్లాలోని కడెం మండలంలోని అల్లంపల్లి గ్రామస్తులు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. తమ గ్రామంలో రహదారి సమస్యను ప్రభుత్వం పరిష్కరించడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గెలుపుపై ఎవరి లెక్కలు వారివే...**

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ముగియడంతో ఓటర్ల మనోగతం, పోలింగ్ సరళి, గెలుపుపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. పోలింగ్ జరిగిన తీరును ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు సమీక్షించుకునే పనిలో మునిగిపోయారు. ఇందుకు సంబంధించి పోలింగ్ బూత్‌లు, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలైన ఓట్ల శాతాన్ని తమ పార్టీ ఏజెంట్లు, ముఖ్య కార్యకర్తల నుంచి సమాచారాన్ని తెప్పించుకుని అవి తమ గెలుపునకు ఎలా కలిసివస్తుందో చర్చోపచర్చలు చేస్తున్నారు.

**నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం**

| | |
|---|---|
| ఆదిలాబాద్ | 69.81 |
| నిజామాబాద్ | 67.96 |
| పెద్దపల్లి | 63.86 |
| కరీంనగర్ | 67.67 |
| వరంగల్ | 64.08 |
| మహబూబాబాద్ | 68.60 |
| ఖమ్మం | 70.76 |
| నల్లగొండ | 70.36 |
| భువనగిరి | 72.34 |
| మహబూబ్‌నగర్ | 68.40 |
| నాగర్‌కర్నూల్ | 66.53 |
| మెదక్ | 71.33 |
| జహీరాబాద్ | 71.91 |
| చేవెళ్ల | 53.15 |
| మల్కాజ్‌గిరి | 46.27 |
| సికింద్రాబాద్ | 42.48 |
| హైదరాబాద్ | 39.17 |

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## శేరిలింగంపల్లిలో 41.63 శాతం ఓటింగ్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లిలో నియోజకవర్గంలోని నల్లగండ్లలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ , హాఫిజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 41.70 శాతం పోలింగ్ నమోదు జరిగినదని అధికారులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించిన్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా కొనసాగిన్నట్లు వారు పేర్కొన్నారు.

## షాబాద్ మండలంలో 69 శాతం ఓటింగ్ నమోదు



**ప్రజాపక్షం/షాబాద్ :** షాబాద్ మండలంలో 69 శాతం ఓటింగ్ నమోదు అయిన్నట్లు తహసీల్దార్ ఎండి అన్వర్ తెలిపారు. షాబాద్ మండలంలో పోతుగల్ పాఠశాలలో దివ్యాంగులతో పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారులు, పోలిసులు ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలోని 53 పోలింగ్ కేంద్రాలలో సాయంత్రం 6 గంటల వరకు 69 శాతం నమోదు జరిగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించిన్నట్లు తహసీల్దార్ ఎండి అన్వర్ వివరించారు. మండలంలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా కొనసాగిన్నట్లు చెప్పారు.

## ఒకే మార్గంలో వచ్చిన బిజెపి, ఎంఐఎం అభ్యర్థులు

### స్వల్ప ఉద్రిక్తత.. చెదరగొట్టిన పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని బిబి బజార్ ప్రాంతంలో ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ, బిజెపి అభ్యర్థి మాధవీలత ఒకేమార్గంలో రావడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇద్దరు అభ్యర్థులు తమ అనుచరులు, సెక్యూరిటీతో ఒకే మార్గంలో కార్లల్లో వచ్చారు. బిబి బజార్ చౌరస్తా వద్ద ఎంఐఎం కార్యకర్తలు మాధవీలతను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంత జరుగుతుంటే ఏం చేస్తున్నారంటూ పోలీసులను మాధవీలత ప్రశ్నించారు. దీంతో ఎంఐఎం కేడర్‌ను పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు.

### ఎంఐఎం రిగ్గింగ్‌కు పాల్పడిందని మాధవీలత ఆరోపణ

హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడుతోందని మాధవీలత ఆరోపించారు. సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రియాసత్ నగర్‌లోని జమాల్ కాలనీలోని ఓ పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్ జరుగుతోందని, అందుకే వారు తలుపులు తెరవడం లేదంటూ ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎంఐఎం కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది.

## రాష్ట్రంలో ప్రజలు బిజెపిని ఆదరించారు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో దాదాపు అన్ని నియోజకవర్గాల్లో బిజెపికి ప్రజలనుంచి సానుకూల స్పందన వచ్చిందని, యువకులు, మహిళలు తమ పార్టీని ఆదరించారని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. గామీణప్రాంతాల్లో ప్రజలు పార్టీలకు అతీతంగా ప్రధాని మోదీకి అండగా నిలిచారని, పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం కాస్త తగ్గినా పోలైన ఓట్లు బిజెపికి అనుకూలంగా ఉన్నాయని సమాచారం ఉందన్నారు. వేర్వేరు రాజకీయ పార్టీల ప్రజలు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు కాదని, కాంగ్రెస్ పార్టీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కుటిలయత్నాలను ప్రజలు ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు.షేక్ పేట్ డివిజన్ పరిధిలో ఓ వర్గానికి చెందిన 3వేల మంది ఓటర్లను కొంత మంది అధికారులు కావాలనే పథకం ప్రకారం తొలగించారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై సికింద్రాబాద్ నియోజకవర్గం రిట్నరింగ్ అధికారికి ఫిర్యాదు చేశానని, ఈ ఘటనపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి సైతం ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

## పోలింగ్ సరళి పరిశీలించిన పద్మారావుగౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ పోలింగ్ సరళిని పరిశీలించారు. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో వివిధ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ముషీరాబాద్ ఎంఎల్‌ఎ ముఠాగోపాల్, బిఆర్ఎస్ నేత ముఠా జయసింహలతో కలిసి పోలింగ్ సరళిని ఆడిగి తెలుసుకున్నారు. వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన క్రమంలో పద్మారావును బిఆర్ఎస్ నేతలు సయ్యద్ అస్లాం, శ్రీనివాస్ నేత, బొట్టు శ్రీనివాస్, ఎండి ఖదీర్, లక్ష్మ ణ్‌గౌడ్ తదితరులు కలిశారు.

## ఓటుహక్కు వినియోగించుకున్న టిడిపి నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల్లో టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాల్ రాజ్‌గౌడ్‌లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## కొడిచర్ల తండాలో పోలింగ్ బహిష్కరణ

### అధికారుల చొరవతో ఓట్లు వేసిన గిరిజనులు



**ప్రజాపక్షం/కొత్తూరు:** కొత్తూరు మండలం కొడిచర్ల తండా పంచాయితీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో తండావాసులు ఓటు వేసేందుకు నిరాకరించి రోడ్డుపై ధర్నాకు పూనుకున్నారు. కొడిచర్ల తండాను 5 ఏండ్ల క్రితం ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేసింది. గ్రామపంచాయితీగా ఏర్పాటైన తండాలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు కొడిచర్లలోనే నిర్వహిస్తుండడంతో తండావాసులు 4 కిలోమీటర్లు ప్రయాణించి ఓటు వేయాల్సి వస్తుంది. తమ తండాలోనే పోలింగ్‌బూత్‌ను ఏర్పాటు చేస్తే తప్పా మరో చోట తాము ఓటు వేయమని గిరిజనులు రోడ్డుపై బైటాయించారు. దీంతో ఎన్నికల అధికారులు వచ్చి రాబోవు ఎన్నికల లోపు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో గిరిజనులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

## సహకరించిన బిఆర్ఎస్ శ్రేణులకు ధన్యవాదములు : సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** చేవెళ్ల పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయాన్ని కాంక్షిస్తూ కష్టపడ్డ పార్టీ కుటుంబ సభ్యులకు, ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ అభిమానులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధంగా భావించి ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని ఓట్లు వేసిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు,ఓటర్లందరికి సబితా ఇంద్రారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



### కాసాని జ్ఞానేశ్వర్ కృతజ్ఞతలు

తనవిజయం కోసం నెలరోజులుగా కష్టపడ్డ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, పార్టీ ప్రజా ప్రతినిధులకు చేవెళ్ల పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హైదరాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లా పరిధిలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ చిన్నచిన్న సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్ణీత సమయానికి అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అక్కడక్కడ కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ సమయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. వాటిని సంబంధిత ఇంజనీర్లతో సరిచేశారు. ఉదయం నుంచి మందకొండిగా ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రానికి కొంత మేరకు ఉపందుకుంది. హైదరాబాద్ నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటల వరకు అందిన సమాచారం మేరకు 39.17 శాతం, సికింద్రాబాద్ లోక్‌సభలో 42.48 శాతం, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం 47.88 పోలింగ్‌శాతం నమోదయ్యాయి. పూర్తి సమాచారం మంగళవారం వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నగరంతో పాటు







సొంత ఊర్లలో ఓటు ఉండటంతో పెద్ద సంఖ్యలో సొంత ప్రాంతాలకు ఓటర్లు తరలివెళ్లడంతో పోలింగ్ శాతం తగ్గినట్లుగా అధికారుల అంచనగా ఉంది. అంతేకాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒకేరోజు పోలింగ్ ఉండటంతో ఆంధ్రసెటిలర్లు భారీ సంఖ్యలో స్వరాష్ట్రానికి వెళ్లారు. అలాగే తెలంగాణలో వివిధ జిల్లాలకు చెందిన వారు సైతం స్వగ్రామాలకు వెళ్లారు. అంతేకాకుండా డుప్లికేట్ ఓట్లతో కూడా పోలింగ్ శాతం తగ్గినట్లుగా భావిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ మొఘల్‌పుర హరి బౌలి రైఫాయం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు.

మాదాపూర్‌లోని వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కాలేజీలోని పోలింగ్ కేంద్రంలో రోనాల్ రోస్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుండి ఎన్నికల ప్రక్రియను వెబ్



కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు.

### పరిశీలించిన రోనాల్డ్ రోస్

ఓటరు హెల్ప్‌లైన్ ఫిర్యాదు కేంద్రాన్ని, ఎంసిసి కేంద్రంలో సిబ్బంది పనితీరును జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరిగిందని చెప్పారు. జిల్లాలో సికింద్రాబాద్, హైదరాబాద్, పార్లమెంట్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల జరిగాయి. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవిఎంలతో పాటు పోలింగ్ సిబ్బంది నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ వద్ద కు పూర్తి బందోబస్తుతో సెక్టర్ ఆఫీసర్‌లతో కలిసిచేరుకున్నారు. అక్కడ పోలైన ఓట్ల పూర్తి సమాచారంతో సెక్టార్‌ల వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద తీసుకొని ఎన్నికల నియమావళి ప్రకారం నివేదిక అందించారు. పోలింగ్ అధికారులకు డిఆర్‌సి కేంద్రాల వద్ద భోజన వసతి కల్పించారు.



## ఎన్నికల సరళి పరిశీలించిన కాంగ్రెస్ అభ్యర్థి సునీత

**ప్రజాపక్షం/వనస్థలిపురం:** తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు ఎన్నికల కమిషన్ నిర్వహించడంతో ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో ఎన్నికల సరళిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌తో కలిసి బూత్‌లను ఆమె పరిశీలించారు. ఈ మేరకు మాజీ ఎంపీ, ప్రచర కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ తన ఓటు హక్కును హయత్ నగర్ ఓల్డ్ విలేజ్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ దేశంలోని సామాన్యుల నుంచి కోటీశ్వరుల వరకు ప్రజలందరికీ సమానంగా ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చారని, దాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడం మన బాధ్యత అని ఆయన గుర్తు చేశారు.



### ఓటు హక్కు మన బాధ్యత

ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తన ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని మారుతి నగర్ నందు ఎస్ఎస్ఎస్ విద్యానికేతన్ స్కూల్ నందు ఓటు హక్కును వినయోగించుకున్నారు. పార్టీ అభ్యర్థి వారితో పాటు పార్టీ నాయకులతో కలిసి ఓటు వినియోగించుకున్న వారితో కలిసి పోటో దిగారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవిందర్‌రెడ్డి, పోగుల రాంబాబు, సుమన్‌గౌడ్, మనోజ్ తదితరులు ఉన్నారు.



### పోలింగ్ కేంద్రాలను సందర్శంచిన సునీత

ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని హయత్ నగర్, బిఎన్‌రెడ్డి, వనస్థలిపురం, లింగోజిగూడ, చౌతన్యపురి, నాగోల్, ఉప్పల్ డివిజన్‌ల్లో పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌తో కలిసి సందర్శించారు. పలు బూత్ కేంద్రాల్లో ఓటర్లతో ఆప్యాయంగా పలకరించారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ఓటు శాతాని పెచ్చడం ప్రతి ఓటరుకు బాధ్యత ఉందన్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ఓటరు సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ ఎలక్షన్ చీఫ్ ఏజెంట్ హరి వర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఓటు హక్కు వినియోగించుకున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ఓటు హక్కును బిఎన్‌రెడ్డి నగర్‌లోని దిల్‌సుఖ్ నగర్ పబ్లిక్ స్కూల్‌లో బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



## ఓటేసిన ఎంపి అభ్యర్థులు



### కుటుంసభ్యులతో ఓటుహక్కు వినియోగించుకున్న విశ్వేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** బిజెపి చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన కుటుంబంతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం ఆయన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని గొల్లపల్లి ధర్మసాగర్ మండల పరిషత్ పాఠశాలలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ స్వచ్ఛందంగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే అత్యంత కీలకమని, తాము తమ పిల్లల భవిష్యత్తుతో పాటు దేశ భవిష్యత్తు కోసం ప్రజలంతా ఓటుహక్కును వినియోగించుకోవడం మన బాధ్యత అన్నారు. పోలింగ్ ప్రక్రియలో విజయవంతంగా పనిచేసిన పోలీసులు, పోలింగ్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డితో పాటు ఆయన భార్య సంగీతరెడ్డి, పెద్ద కుమారుడు అనందిత్‌రెడ్డి, పెద్దకోడలు శ్రీయారెడ్డి, చిన్న కోడలు రిషికారెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### మొయినాబాద్‌లో గడ్డం రంజిత్ రెడ్డి

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం మొయినాబాద్ మండలం ఎనికేపల్లి గ్రామంలో 142,143 బూత్‌లో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి ఆయన సతీమణి గడ్డం సీతారెడ్డి, కుమార్తె పూజా ఆకాంక్ష రెడ్డి, కుమారుడు రాజ్ ఆర్యన్ రెడ్డి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



# రంగారెడ్డిలో బారులుతీరిన ఓటర్లు.. పెరిగిన ఓటింగ్

**ప్రజాపక్షం/ రంగారెడ్డి ప్రతినిధి :** లోక్ సభ ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియ చేవెళ్ళ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక పర్యవేక్షణలో పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని మహేశ్వరం, రాజేంద్రనగర్,చేవెళ్ల, శేరిలింగంపల్లి,పరిగి, వికారాబాద్,తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.ఏడు శాసనసభ నియోజక వర్గాల పరిధిలో 2,877 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ జరిపిన అనంతరం అన్ని చోట్ల ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

### గణణీయంగా పెరిగిన ఓటింగ్ శాతం

మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి ఎన్నికల్లో మొదటి రెండు గంటలకే సగటున 10.28 శాతం ఓటింగ్ నమోదయ్యింది. అనంతరం కూడా అంతకంతకూ ఊపందుకుంది.ఉదయం 11 గంటల సమయానికి 20.35 శాతం జరిగిన ఓటింగ్,మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 34.56 శాతానికి, మధ్యాహ్నం 3.00 గంటల సమయానికి 45.35 శాతానికి, సాయంత్రం 5.00 గంటల సమయానికి 53.15 శాతానికి చేరుకుంది. పోలింగ్ ప్రారంభ సమయానికే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ లలో నిలబడి తమ చైతన్యాన్ని చాటుకు





న్నారు.ఓటింగ్ శాతాన్ని పెంచాలనే కృతనిశ్చయంతో జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి.ఓటరు అవగాహన కార్యక్రమాలతో పాటు, ఇంటింటికి ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేయడం,అర్బన్ ప్రాంతాలలో గత ఎన్నికలలో పోలింగ్ తక్కువగా నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఆదర్శ పోలింగ్ స్టేషన్లను, మహిళలు, దివ్యంగులు,యువత కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఓటర్ల దృష్టిని ఆకర్షించింది. సాయంత్రం 6 గంటల వరకు మహేశ్వరం 51.70 శాతం,రాజేంద్రనగర్ 53.13 శాతం, శేర్లింగంపల్లి 43.11 శాతం, చేవెళ్ల 70.84శాతం,పరిగి 65.98 శాతం, వికారాబాద్ 64.44 శాతం,తాండూర్ 66.34 ఓటింగ్ శాతం అధికంగా నమోదైంది.పోలింగ్ సమయాన్ని ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు సమయాన్ని పెంచడం,ఓటర్లు 5 లక్షలకు పైగా నమోదు చేసుకోవడం వల్ల కూడా ఓటింగ్ శాతం పెరగడానికి దోహదపడింది. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగిసినప్పటికీ, పలు పోలింగ్ స్టేషన్ల వద్దకు చేరుకున్న ఓటర్లకు ఓటింగ్ అవకాశం కల్పించారు.

### అతివలు మెచ్చేలా.. అందరూ వచ్చేలా

చేవెళ్ళ పార్లమెంట్ నియోజిక వర్గ ప్రాంతంగా ఓటింగ్ శాతం పెంచేందుకు ఎంపిక చేసిన పలు పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాలుగా వీటిని తీర్చిదిద్ది.. ఓటు ఆవశ్యకతను అందరికీ తెలిసేలా చేశారు.పలు ప్రాంతాల్లో అధికారులు అట్టహాసంగా మోడల్ పోలింగ్ స్టేషన్‌లను ప్రారంభించారు.రాజేంద్ర నగర్,మహేశ్వరం, చేవెళ్ళ, బడంగ్ పేట్, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలను సుందరంగా అలంకరించారు. ప్రాంతాల్లో మహిళల కోసం ఆదర్శ మహిళ పోలింగ్ కేంద్రాలలో ఓటరు లోపలికి వచ్చే క్రమంలో ఆహ్వాన తోరణాలు.. పూల వర్షంతో స్వాగతాలు పలికి, ఆహ్లాదకర వాతావరణం పోలింగ్ జరిగింది.

### వయోవృద్ధులకు ఉచిత రవాణా సౌకర్యం

వయోవృద్ధుల కోసం ఉచిత రవాణా సౌకర్యం వారి యొక్క ఇంటి దగ్గర నుండి పోలింగ్ స్టేషన్ కి మరియు పోలింగ్ స్టేషన్ నుండి ఇంటి వద్దకు కల్పించడం జరిగింది. వాటితో పాటుగా దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేయడం జరిగింది. అంధుల కోసం బ్యాలెట్ పేపర్, ఓటర్ స్లిప్స్ మరియు కరపత్రాలు బ్రెయిలీ లిపిలో తయారుచేసి వారికి అందించడం జరిగింది. నియోజకవర్గాల వారీగా మహిళలు,యువత, దివ్యంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్లు ప్రజలను ఆకర్షిస్తూ,ఓటింగ్ ప్రాధాన్యత గురించి అందరినీ ఆలోచింపజేసాయని కలెక్టర్ అన్నారు.గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ జరిగిన నియోజకవర్గాలపై, అర్బన్ సెగ్మెంట్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ స్వీప్ కార్యకలాపాలలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద సాయుధ బలగాలను మోహరించడం జరిగిందన్నారు.

### కట్టుదిటంగా వెబ్‌కాస్టింగ్ కంట్రోలింగ్

నారమ్ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శశాంక క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ ముగిసేంత వరకు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆయాపోలింగ్ స్టేషన్లలో కొనసాగిన పోలింగ్ తీరుతెన్నులను, ఓటింగ్ సరళిని అదనపు కలెక్టర్ ప్రతీమాసింగ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఎన్నికలను సజావుగా శాంతియుతంగా నిర్వహించుటలో జిల్లా యం త్రాంగానికి సహకరించిన పోలీస్ అధికారుల కు, ఎఆర్‌ఓలకు, ఎఇఆర్‌ఓలకు, నోడల్ అధికారులకు, బిఎల్‌ఓలకు,బిఎల్‌ఓ సూపర్ వైజర్లకు, వివిధ శాఖలకు సంబంధించిన ఎన్నికల సిబ్బందికి ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

### రాత్రి 7గంటల వరకు పోలింగ్‌శాతం

| | |
|---|---|
| మహేశ్వరం | 51.70 |
| రాజేంద్రనగర్ | 53.13 |
| శేరిలింగంపల్లి | 43.11 |
| చేవేళ్ల | 70.84 |
| పరిగి | 65.98 |
| వికారాబాద్ | 69. 44 |
| తాండూరు | 66.34 |

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



ప్రజాపక్షం/మల్దకల్‌: గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల పరిధి లోని బిజ్వారం, ఉలిగేపల్లి, పెద్దపల్లి, మల్దకల్ గ్రామాల పంచాయితీలోని బూత్ బూత్ తిరుగుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి మల్లురవి పోలింగ్ సరళి పరిశీలిస్తూ స్థానిక పోలింగ్ ఏర్పాట్లను బూత్ లెవెల్ ఆఫీ సర్స్ బిఎల్ఓ ఆశ వర్కర్స్, స్థానిక పోలీస్ సిబ్బందిని అడిగి తెల్సుకుం టున్న మన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సరిత తిరుపతయ్య. దేశ అభివృద్ధికి, మీ ప్రాంత అభివృద్ధి, మీ పిల్లల భవిష్యత్తు ఆలోచించి ఓటు వేయాలి అని కోరారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వై.శ్రీనివాస్ రెడ్డి, డి.సత్యరెడ్డి, తెలుగు కృష్ణమూర్తి, కొంకల గోకరన్న, శుద్ధ వెంకటేశ్వర్ రెడ్డి, రాగి మాన్ వెంకటేశ్వర్ రెడ్డి, కర్రె సత్యరెడ్డి, రాజు, డబ్బారాజు, మల్లీ, వడ్డే గోపాల్, మెకానిక్ గోవిందు, ఆర్గనైజర్ కృష్ణ, నారాయణ, ఉప్పరి శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఓటేసిన రైతుబిడ్డ



ప్రజాపక్షం / మల్దకల్ : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని అమరవాయి గ్రామంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రైతు బిడ్డ పరశురాముడు నాగలి భుజాన మూసుకోని జెడ్పీ హైస్కూల్ వరకు వెళ్లి అక్కడ దింపి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అక్కడున్న అధికారులు ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా రైతు పరశురాముడు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎలక్షన్లు వస్తాయి, పోతాయి రైతులను ఆదుకోండి. ప్రభు ఓటు వేయించుకుంటారు కానీ రైతులను పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. రైతు లేకుంటే దేశమే లేదని, రైతులు కష్టపడి పండించిన పంట సరైన గిట్టుబాటు లేక ఆత్మహత్య చేసుకోవాల్సి పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రైతులు ఉంటేనే దేశం బాగుంటదనిఆవేదన వ్యక్తం చేశారు.

## పోలింగ్ సరళి పరిశీలన





ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌క ర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ కేంద్రాలలో వివిధపార్టీల అభ్యర్థులు తమతమ ఓటుహక్కును వినియోగించుకు న్నారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డాక్టర్‌మల్లురవి ఆయన సతీమణితోకలిసి హైదరాబాద్‌నగ రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. బిజెపి అభ్యర్థి పోతుగంటిభరత్‌ప్రసాద్ తనత ల్లితోకలిసి హైదరాబాద్‌నగరంలో ఓటుహ క్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా టిఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి గద్వాల జిల్లా అలంపూ ర్‌లో తన ఓటుహక్కును వినియోగించుకు న్నారు. తమతమ ఓటుహక్కును వినియోగిం చుకొని పార్లమెంట్ నియోజకవర్గపరిధిలోగల ఆయా అసెంబ్లీవర్గాలలో పోలింగ్‌సరళిని పరిశీలించారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



ప్రజాపక్షం/వెల్దండ : సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశా యి. ఉదయం 6గంట లనుండి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైన అక్కడక్కడ ఇవిఎంలు మొరాయించిన సమస్యలను ఎన్నికల అధికారులు పరిష్కరిస్తూ ప్రశాంతంగా ముగిశాయి. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా రాష్ట్రపుడ్ కమీషన్‌చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి మండల పరిధిలోని పోలింగ్‌బూత్‌లో ఓటువేశారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా జడ్పివైస్‌చైర్మన్ ఠాగూర్‌బాలాజిసింగ్ మండలకేంద్రంలోని జడ్పిహై స్కూల్లో ఓటు వేశారు.పోలింగ్‌కేంద్రాలను కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్‌మల్లురవి,కల్వకుర్తిఎంఎల్ఏ కసిరెడ్డినారాయణరెడ్డి సందర్శించారు.

## ఓటర్లపై తేనెటీగల దాడి

ప్రజాపక్షం/అచ్చంపేట: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లోని వటువర్లపల్లి గ్రామంలో పోలింగ్‌బూత్‌వద్ద ఓటర్లపై తేనేటీగలుదాడి చేశాయి. దీంతో 25మందికిపైగా గాయపడ్డారు.గ్రామంలో పోలింగ్‌బూ త్‌కు వందమీటర్ల దూరంలో ఉన్న ఓటర్లపై తేనేటీగలుదాడిచేయడంతో ఒక్కసారిగా ఓటర్లందరూ పరుగులుతీశారు. గాయపడినవారిలో ఐదుగు రికి తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే 108ద్వారా చికిత్సకోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## కల్వకుర్తిలో 72.51% పోలింగ్

ప్రజాపక్షం/కల్వకుర్తి : పార్లమెంట్ ఎన్నికలలోభాగంగా కల్వకుర్తి నియో జకవర్గంలో కల్వకుర్తి, వెల్దండ,ఆమన్‌గల్, తలకొండపల్లి, కడ్తాల్, చార గొండ మండలాలలో సోమవారం నిర్వహించిన పోలింగ్ 72.51శాతం ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. కల్వకుర్తి నియోజకవర్గ ఓటర్లు మొత్తం 2,42,153 ఓటర్లకుగాను 1,77,224 ఓటర్లు ఓటుహ క్కును వినియోగించుకోగా అందులో పురుషులు 91004, మహిళలు 86219, ట్రాన్స్‌జెండర్ 01లు తమగ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో ఓటుహక్కును వినియోగించుకున్నారని ఆర్‌డిఓ శ్రీనివాసులు తెలిపారు.

## ఓటు వజ్రాయుధం

ప్రజాపక్షం / పెబ్బేరు : పార్లమెంట్ ఎలక్షన్ల సందర్భంగా పెబ్బేరు మండ లంలో జరుగుతున్న పోలింగ్‌ను ప్రధాన పోటీ దారులైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి భారత రాష్ట్ర సమితి అభ్యర్థి ప్రవీణ్ కుమార్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ జరుగుతున్న సర ళిని పరిశీలించారు. వీరి వెంట ఆయా పార్టీల నాయకులు అక్కి శ్రీనివాస్ గౌడ్ , కరుణ శ్రీ సాయినాథ్ తదితరులు ఉన్నారు.

## సజావుగా సాగిన పోలింగ్



ప్రజాపక్షం / వీపనగండ్ల : మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీ పార్ల మెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగి సాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీ సులు గట్టి చర్యలు తీసుకున్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో ఎన్నికలు సజావుగా సాగాయి. మండల కేంద్రమైన వీపనగం డ్లలో 162వ పోలింగ్ బూత్‌ను మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసి మామిడి తోరణాలు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఓటర్లను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సారి చాలా గ్రామాలలో వలస వెళ్లిన వారు ఓటు వేయటానికి రాకపోవడంతో అసెంబ్లీ ఎన్నికలలో పోలైన ఓట్ల కంటే తక్కువగా ఓట్లు పోలైతాయని అంచనాలు వేస్తున్నారు.

# బ్యాలెట్ బాక్స్‌ల్లో అభ్యర్థుల భవిత

పాలమూరులో ప్రశాంతం

కొడంగల్‌లో ఓటేసిన సిఎం రేవంత్

ఓటింగును బహిష్కరించిన ఎదిర గ్రామస్తులు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: మహ బూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో సోమవారం జరి గిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉద యం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు భారీగానే పోలింగ్ నమోదయింది. మహ బూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ద్విముఖపోరే ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. అభ్య ర్థుల భవిత బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఉంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టే వరకు ఉన్నత స్థాయి పర్యవేక్షణలో భద్రపరచనున్నారు. పార్ల మెంటు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావించిన కాంగ్రెస్ పార్టీ హోరాహోరీగా ప్రచారం నిర్వహిం చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గ మహబూబ్‌నగర్‌లో ఎలాగైనా కాం గ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని లక్ష్యంగా వ్యూహా త్మకంగా అడుగులు వేశారు. కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి మెంబర్ చల్ల వంశీచంద్ రెడ్డి



మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. బిజెపి నుండి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పోటీ చేశారు. టిఆర్ఎస్ పార్టీ నుండి ప్రస్తుత ఎంపీ పార్టీ శ్రీనివాస్‌రెడ్డి పోటీలో ఉన్నారు. అన్ని ప్రధా న పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావించి ప్రచారం నిర్వహించినప్పటికీ కాంగ్రెస్, బిజెపిల మధ్య నేపోరు ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధి లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేలా సాగింది. మొదటి నుండి జడ్చర్ల, దేవరకద్ర, షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం అధికంగా నమోదయింది. మిగతా నియో జకవర్గాలైన కొడంగల్, నారాయణపేట, మక్తల్, మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కొంత నెమ్మదిగా సాగింది. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు 45.84 శాతం మధ్యాహ్నం 3 గంటలకు 58.92 శాతం సాయంత్రం ఐదు గంటలకు 68.40 శాతం ఓటింగ్ నమోదు అయింది. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జర గకుండా జిల్లా అధి కారులు పకడ్బందీ చర్యలు తీసుకు న్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగి యడంతో అధికారు లంతా ఊపిరి పీ ల్చుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎను ముల రేవంత్ రెడ్డి తన నియోజకవర్గ కొడంగల్ లో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహబూబ్‌న గర్‌లో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును విని యోగించుకున్నారు. అలాగే మా జీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి మహబూబ్‌నగర్‌లో ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. చల్లా వంశీచంద్‌రెడ్డి తన ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి మహబూబ్ నగర్‌లో వినియోగించుకున్నారు. అలాగే బిజెపి అభ్యర్థి డీకే అరుణ మహబూబ్‌నగర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.



## కాంగ్రెస్ వెన్నంటే ఓటర్లున్నారు..గ్యారంటీలకే మద్దతు

ఎంఎల్ఏ కసిరెడ్డి నారాయణరెడ్డి



ప్రజాపక్షం/కల్వకుర్తి : పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌వెన్నంటే ఓటర్లు ఉన్నారని , అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చి అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలకే ప్రజల మద్దతుగా ఉన్నారని ఎంఎల్ఏ కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోగల జీవిఆర్ కార్యాలయంలో పోలిం గ్ అనంతరం జిల్లా జడ్పివైస్‌చైర్మన్ బాలాజిసింగ్ తోకలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ గెలుపు కోసం గత 20రోజులనుండి కృషిచేసిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలి పారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుర్తి ప్రాంతవాసికావడం అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రె స్‌పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు కేంద్రం లో కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడగానే ఐదు గ్యారం టీలతో అభివృద్ధిదిశగా పేదలకు అండగా నిలు స్తామని ఇంటింటి ప్రచారంచేయడంతో ప్రజలు కాంగ్రెస్‌పార్టీనివిశ్వసించి కాంగ్రెస్‌పార్టీ వెన్నంటే ఉన్నారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌స్థానం అత్య ధికమెజార్టీతో గెలుస్తున్నామని ధీమా వ్యక్తంచే శారు. జడ్పివైస్‌చైర్మన్ బాలాజిసింగ్ మాట్లా డుతూ కాంగ్రెస్‌పార్టీతోనే సామాన్యప్రజల అభ్యు న్నతి సాధ్యమవుతుందని ఇచ్చిన హామీలను అమ లుచేస్తారని ప్రజలవిశ్వాసంతోనే కాంగ్రెస్‌తో ప్రజలు ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఇందిరాశోభన్ మాట్లాడుతూ పథ కాలను వివరిస్తూ ఓట్లు వేయించేందుకు కృషిచే సిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలపడంతోపాటు ప్రతి ఒక్క కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. కల్వకుర్తి మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ బిజెపి టిఆర్ఎస్‌పార్టీల చీకటి ఒప్పందాల కుటిల బుద్ధి బయటపడిందని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ బాలునాయక్,కాంగ్రెస్ పార్టీనాయకులు శ్రీకాంత్, సంతుయాదవ్ తదితరులు ఉన్నారు.

## నల్లమలలో ప్రశాంతంగా పోలింగ్



ప్రజాపక్షం/అచ్చంపేట : అచ్చంపేట నియోజకవ ర్గంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ప్రశా ంతంగా ముగిసింది. ఈ ఎన్నికలలో అసెంబ్లీ ని యోజకవర్గపరి ధిలో 65 నుంచి70శాతంవ రకు ఓటుహక్కు ప్రజలు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో చెం చుపెంటలోసైతం ఎన్నిక లకేంద్రాలు పెంచడంవలన ఎన్నికలశాతం పెరిగినట్లు తెలుస్తోంది. అప్పా పూర్, కుడిచింతలబైలు, సార్లపల్లిలాంటి అడవిప్రాంతంలో ఎన్నికల కేంద్రాలు ఏర్పాటుచేయడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. చార కొండలో63శాతం, వంగూరు, ఉప్పునుంతల, అచ్చంపేట 65శాతం, అమ్రాబాద్ , బల్మూర్ , లింగాల 72శాతం పోలింగ్ జరిగినట్లుతెలిపారు. స్థానిక ఎంఎల్ డాక్టర్ వంశీకృష్ణ, సిబిఎం మెమోరియల్ ట్రస్టుచైర్మన్ డాక్టర్ అనురాధ వారి కుటుంబసభ్యులు అమ్రాబాద్ మం దలం వెలమ పల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇప్పటివరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు అచ్చంపేట డిఎస్‌పి తెలిపారు.

## ఓటేసిన కలెక్టర్ దంపతులు



ప్రజాపక్షం/ నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవ ర్గంపరిధిలో ఎన్నికల రిటర్నింగ్ అధి కారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ సతీమణి మహేశ్వరితోకలిసి తన ఓటుహక్కును జిల్లాకేంద్రంలోని సంఘమిత్ర పాఠశాల లోని 115పోలింగ్‌కేంద్రానికి చేరుకొని ఓటువేశారు. ఈసందర్భంగా పోలిం గ్‌కేంద్రం వద్ద ఏర్పాట్లను, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలుచేశారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్ణీత సమయానికి అన్ని పోలింగ్‌బూత్ లలో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌పరిధిలో ఉదయం 11గంటలవరకు 27.74శాతం ఓటింగ్‌సరళి నమోదు అయింద న్నారు. స్థానిక జిల్లా కలెక్టర్‌కార్యాలయం సమావేశహాల్‌నుండి వెబ్‌క్యాస్టింగ్ కెమెరాల కంట్రోల్‌రూమ్ ద్వారా పోలింగ్‌సరళిని పరిశీలిస్తున్నారు. సాయంత్రం 6గంటలవరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని 6గంటలవ రకు పోలింగ్‌కేంద్రం లోపల ఉన్నవారికి టోకెన్లు అందించడం జరుగుతుం దని వారు తెలిపారు. అందరూ సహకరించాలన్నారు.

## కవితపై ఇడి చార్జిషీటు.. నేడు కోర్టు పరిశీలన

న్యూఢిల్లీ : ఢిల్లీ మంత్రివర్గానికి ముడుపులు సమ ర్పించారన్న కేసులో తెలంగాణ ఎంఎల్‌సి, బిఆర్ ఎస్‌పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవితపై ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా నమోదు చేసిన చార్జిషీటును ఢిల్లీ కోర్టు మంగళవారంనాడు పరిశీ లిస్తుంది. అక్రంగా ధనాన్ని లెక్కల్లో చూపించ కుండా చేతులు మార్చారన్న ఆరోపణలపై కవిత తోపాటు మరో నలుగురు నిందితులపై హవాలా చట్టం కింద (పిఎంఎల్ఏ) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్ట రేట్ ఛార్జిషీటు దాఖలు చేసింది. మొత్తం ఐదుగు రిపైనా ఇడి అధికకారులలు మొత్తం 200 పేజీ లతో చార్జిషీటు కోర్టుకు సమర్పించారు. మంగళ వారంనాడు కోర్టు దీనిని పరిశీలించి ఒక నిర్ణయం తీసుకుటుంది. ఇడి–సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఈ చార్జిషీటును నిర్ణీత ప్రకారం సోమవారంనాడే పరిశీలించవ లసిఉంది.కానీ ఈ విషయాన్ని 14వ తేదీకి వా యిదా వేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గడ చిన శుక్రవారంనాడు 200 పేజీలతో ఛార్జిషీటు కోర్టుకు సమర్పించింది. కవితతోపాటు ఆమ్ ఆద్మీపార్టీ గోవా ఎన్నికల ప్రచార కార్యక్రమాల నిర్వహణకు విధులు నిర్వహించిన కంపెనీ ఛారి యట్ ప్రొడక్షన్స్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినఉద్యోగులుదామోదర్‌శర్మ,ప్రిన్స్ కుమార్, ఛన్‌ప్రీత్ సింగ్ అనే ముగ్గురు కూడా ఈ ఛార్జిషీ టులో ఉన్నారు. అదువిజదగా ఇండియా ఎహెడ్ న్యూస్ ఛానల్ మాజీ ఉద్యోగి అరవింద్ సింగ్ కూడా ఈ ఛార్జిషీటులో నిందితుడుగా ఉన్నారని అధికార వర్గాలు తెలియజేశాయి. తెలంగాణ ఉద్యమ నాయకుడు, తెలంగాణ మాజీ ముఖ్య మంత్రికల్వకుంట్లచంద్రశేఖరరావుకుమార్తె కవిత (46)ను మార్చి 15 సాయంత్రం హైదరాబాద్ జూబిలీహిల్స్‌లోని ఆమె నివాసం నుండి ఎన్‌ఫో ర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్టు చేసి ఢిల్లీకి తరలించారు. ఛన్‌ప్రీత్‌ను ఏప్రిల్ 15న అరెస్టు చేశారు. గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా 2022లో ఆమ్ ఆద్మీపార్టీ తరపున ఛన్‌ప్రీత్ సింగ్ ఈ అక్రమ నిధులను వివిధ అవస రాలకు ఉపయోగించాడు. ఛారియట్ ప్రొడక్షన్స్ ఎంప్లాయీస్‌ముగ్గురూకూడాసౌత్ గ్రూపు నుండి కవిత ద్వారా ముట్టిన ముడుపులను ఖర్చులు చేయడంలో ప్రధానపాత్ర నిర్వహించారని ఇడి అధికారులు తమ ఛార్జిషీటులో ఆరోపించారు. గోవాలో ఆప్ పార్టీ ఎన్నికల ప్రయోజనాలు నెరవే ర్చడంకోసం ఆ నిధులను నేరుగా కాకుండా అంగడియాస్, హవాలా మార్గంలో ఈ నిధులు తరలించారు. ఇండియా ఎహెడ్ న్యూస్‌లో అర వింద్ సింగ్ కమర్షియల్ హెడ్‌గా, ప్రొడక్షన్ కంట్రోలర్‌గా పనిచేశారు. ఆయనను సిబిఐ గత ఏడాది మే నెలలో అరెస్టు చేసింది. అతగాడికి గడ చిన శుక్రవారంనాడు సుప్రీంకోర్టు తాత్కాలిక, మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. సౌత్ గ్రూపులో కవిత కీలక సభ్యురాలని ఇడి అధికా రులుతమ ఛార్జిషీటులో ఆరోపించారు. రూ.100 కోట్లు ముడుపులు ఆప్ పార్టీకి ఢిల్లీ నగరంలో లిక్కర్ లైసెన్సులు పొందడానికి గాను సమర్పిం చారు. 202–22ఆర్థికసంవత్సరంలో ఢిల్లీ ప్రభు త్వం రూపొందించిన ఎక్సైజు విధానం ద్వారా ఈ మద్యం వ్యాపారులకు ఈ ప్రయోజనం చేకూ ర్చింది. ఐతే తర్వాత ఈ విధానం వివాదాస్పదం కావడంతో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ దీనిని రద్దు చేశారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా ఈ అక్రమాలపై సిబిఐ దర్యాప్తు జరపాలని సిఫార్సు చేశారు. దాంతో సిబిఐ తర్వాత ఇడి అధికారులు కూడా ఈ కేసులో రంగ ప్రవేశం చేశారు. 2022 ఆగస్టు 17న సిబిఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి కూడా దర్యాప్తు ప్రారంభిం చింది. ఇప్పుడు నాలుగు రోజుల క్రితం ఛార్జిషీటు దాఖలు చేసింది.

## కేజ్రీవాల్‌కు ఇచ్చారుగా...మరి నాకు..

బెయిలుకోసం మళ్ళీ సుప్రీంకోర్టుకి సోరెన్

న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమం త్ సోరెన్ బెయిలు కోసం మరోసారి సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఆమ్ ఆద్మీపార్టీ జాతీయ కన్వీ నర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు 50 రోజుల తర్వాత సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేశాక అదేవిషయాన్ని ప్రస్తావిస్తూ సోరెన్, తనకు కూడా బెయిలు మంజూరు చేయా లని మరోసారి సోమవారంనాడు సుప్రీంకోర్టును కోరారు. కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా రాజీనామా చేయకుండా అదే పదవిలో కొనసాగుతూ తీహార్ జైలులో ఇడి, సిబిఐ విచారణ ఎదుర్కొన్నారు. కానీ ఇదేవిధమైన కేసులో సోరెన్‌ను అరెస్టు చేయ డానికి ఒకరోజు ముందుగానే ఆయన ముఖ్య మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ ఏడాది జనవరి 31న సోరెన్‌ను భూముల అవినీతికి సంబంధించిన హవాలా కేసులో ఇడి అధికా రులు అరెస్టు చేశారు. ''కేజ్రీవాల్ ఉత్తర్వులే నాకూ వర్తిస్తాయి, ఎన్నికల్లో ప్రచారం చేయడం కోసం నాకు కూడా మధ్యంతర బెయిలు కావాలి'' అని సోరెన్ సుప్రీంకోర్టుకు దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మా సనం సోరెన్ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను విచా రణకు తీసుకోవడానికి సుముఖత వ్యక్తం చేసింది. ఈ విషయంలో మే 17 లోపు ఇడి అధి కారులు తమ సమాధానం చెప్పాలని ధర్మాసనం వారిని ఆదేశించింది. ఈనెల 20న ఈ విషయం విచారణ జరపాలని కోర్టు తొలుత భావించింది. ఐతే ఎన్నికల ప్రచారం ఇక పది రోజులో పూర్త యిపోతుందని ఆయన తరపు న్యాయవాదులు కపిల్ సిబల్, ఆర్నాబ్ చౌధురి ధర్మాసనాన్ని కోర డంతో ఈనెల 17నే ఈ కేసు విచారణ చేసేం దుకు కోర్టు అంగీకరించింది. అక్రమంగా సేకరిం చారని చెబుతున్న 8.86 ఎకరాల స్థలం సోరెన్ వద్దనే ఉందా? అని ధర్మాసనం తొలుత కపిల్ సిబల్‌ను ప్రశ్నించింది. ఇడి అధికారులు తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ జార్ఖండ్ హైకో ర్టులో సోరెన్ పిటిషన్ దాఖలు చేశారు. ఐతే హైకోర్టు మే 3వ తేదీన ఆ పిటిషన్‌ను కొట్టివే సింది. దీంతో ఆయన హైకోర్టు చర్యను సుప్రీం కోర్టులో సవాలు చేశారు. అదేవిధంగా తనకు బెయిలు కూడా ఇవ్వాలని కోరారు. తన పిటిష న్‌ను కొట్టివేయడం ద్వారా హైకోర్టు తప్పు చేసిం దని తన తరపు న్యాయవాది ప్రగ్యా బాఘెల్ ద్వారా సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సోరెన్ రాంచీలోని బిర్సాముండా సెంట్రల్ జైలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

## పోలింగ్ కేంద్రం తనిఖీ



ప్రజాపక్షం/బాలానగర్: పార్ల మెంటు ఎన్నికల నేపథ్యంలో బాలానగర్ మండలంలో ఎన్ని కల ఓటింగు ప్రక్రియ ప్రశాం తంగా కొనసాగింది. సోమ వారం జిల్లా అడిషనల్ కలెక్టర్ మోహన్ రావు బాలానగర్, పెద్ద రేవల్లి, గౌతపూర్, మొదంపల్లి, గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. బాలానగర్ మండల కేంద్రం లోని 81వ బూతులు వివి ప్యాట్లు కొద్దిసేపు మొరాయించడంతో ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇంత గ్రామాలలో ఎక్కడ కూడా ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు చోటు చేసుకలేదని బాలానగర్ ఎస్ఐ తిరుపాజీ వెల్లడిం చారు. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి కనబరిచారు. అధికారులు అందించిన సమాచారం ప్రకారం బాలాన గరం మండలంలో ఇప్పటివరకు 75 శాతానికి పైగా ఓటింగ్ నమోదు అయిం దని వెల్లడించారు. మండలంలో అన్ని గ్రామాలలో ఓటింగు ప్రక్రియ ప్రశాం తంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఓటేసిన మండల ప్రజాప్రతినిధులు



ప్రజాపక్షం/మల్దకల్: మండల కేంద్రంలోని సిపిఎస్ స్కూల్లో సోమవారం పార్లమెంటు ఎన్నికలసందర్భంగాఓటు హక్కు వినియోగించుకున్న సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి దంపతులు, బిజ్వారం జడ్పీహైస్కూల్లో బూతు నెండర్ 180 లో మాజీ ఎంపీపీ వై.సత్యారెడ్డి సతీమణి మాణిక్యమ్మ, తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అడవిరావుల చెరువు గ్రామంలో మాజీ సర్పంచు పద్మ కర్రెన్న, ప్రాథమిక పాఠశాలలో తమ ఓటు వేశారు. ఉలిగేపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 176 బూతు నెంబర్ లో మాజీ సర్పంచు చిన్నరాముడు, మాజీ సర్పంచు ప్రతాప్, తమ ఓటు వేశారు. అమరవాయి గ్రామంలో జడ్పీ హై స్కూల్ ఎంపిటిసి పెద్ద గోపాల్ రెడ్డి సోమవారం పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు శేషంపల్లి నరసింహులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్దపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్వాల రాజశేఖర్ రెడ్డి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## ఓటేసినప్రముఖులు







ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి/ కల్వకుర్తి/అచ్చంపేట : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లోభాగంగా జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్,







కల్వకుర్తి ఎంఎల్ఏ కసిరెడ్డినారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంఎల్ఏ రాజేష్ రెడ్డి, ఉమ్మడిజిల్లా ఎంఎల్‌సి దామోదర్‌రెడ్డి, అచ్చంపేట ఎంఎల్ఏ వంశీకృష్ణ, జడ్పివైస్‌చైర్మన్ బాలాజిసింగ్, మాజీమంత్రిచిత్తరంజన్‌దాస్, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యేలు మర్రిజనార్దన్‌రెడ్డి, నాగంజనార్దన్‌రెడ్డి, మిషన్ భగీరథవైస్ మాజీ చైర్మన్ ఉప్పలవెంకటేష్, బిజెపి నాయకురాలు బంగారుశృతిలు తమ ఓటుహక్కును కుటుంబసభ్యులతో కలిసి వినియోగించుకున్నారు.

## నాగర్‌కర్నూలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గాల్లో ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ సజావుగా ముగిసింది. ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటలవరకు పోలింగ్ నిర్వహణ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం ఇవిఎంలను పట్టణంలోని నెల్లికొండ వ్యవసాయమార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన రిసెప్షన్‌సెంటర్‌కు తరలించి అక్కడ ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌లు భద్రపర్చనున్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో ఏర్పాటుచేసిన కమాండ్‌కంట్రోల్‌రూం నుంచి వెబ్‌క్యాస్టింగ్‌ద్వారా పోలింగ్‌సరళిని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్‌ప్రక్రియ సక్రమంగా సజావుగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన ఓటర్లకు భాగస్వాములైన అధికారయంత్రాంగాన్ని ఆయన అభినందించారు. ఎన్నికల సమాచారం ఎప్పటికప్పుడు ప్రచార మాధ్యమాలద్వారా ప్రజలకు చేరవేసిన మీడియాప్రతినిధులను అభినందించారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన ఓటరన్న



ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ ప్రతినిధి : మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలోని టిటి గుట్ట శ్రీశ్రీశ్రీ స్వయంభూ తిరుమల నాథ స్వామి దేవాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీచర్స్ కాలనీలో బూత్ నం. 113 బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్‌లో సతీసమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలలోపోలింగ్ సరళిని ద్వి చక్ర వాహనంపై వెళ్లి పరిశీలిం చారు.ఆయన మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలందరూ ఏకైమ ప్రజాస్వామ్య విలువలను కాపా డే విధంగా ప్రతి ఓటరు పండుగలా భావిం చిఓటు హక్కును స్వేచ్ఛగా వినియో గించు కోవాలని ఆయన కోరారు. ప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో కొనసాగే విధంగా రాజ్యాంగ పునాదులు మరింత పటిష్టత కోసం సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందిస్తున్న రాష్ట్ర సుపరిపాలనను ఆశీర్వదించేలా పాలమూరు ప్రజల ప్రగతి కోసం భాద్యతతో భవిష్యత్ తరాల అభ్యున్నతి కోసం ఆకాంక్షించి పోలింగ్ కేంద్రాలకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.



## ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి : వనపర్తి జిల్లా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలు వనపర్తి జిల్లాలో శాంతియుతంగా పార దర్శకంగా నిర్వహించడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ ధన్యవాదాలు తెలిపారు. వన పర్తి జిల్లాలో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 6 గంటలకు సమాప్తం అయినట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలో సాయం త్రం 6 గంటల వరకు దాదాపు 66.56 శాతం ఓట్లు పోల్ అయ్యాయన్నారు.



## ఓటు హక్కు వినియోగించుకున్న, స్పీకర్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్న తెలంగాణ శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు కల్గిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును దుర్వినియోగం చేయకుండా వినియోగించుకోవాలని అన్నారు. ఈ ఎన్నికలు దేశనికి సంబంధించిన



ఎన్నికలు కబట్టి ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకోవాలని తెలిపారు.

## ఓటు వేసిన కలెక్టర్, ఎస్‌పి, అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంఘం లక్ష్మి బాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం138లో కుటుంబసభ్యులతోకలసి ఓటు హక్కును వినియోగించున్నా కలెక్టర్ నారాయణరెడ్డి , ఎస్‌పి కోటిరెడ్డి ,జిల్లా అదనపు కలెక్టర్ తమ ఓటు హ క్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత వి లువైనది అని అన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు







ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## ప్రశాంతంగా పార్లమెంటు ఎన్నికలు





**ప్రజాపక్ష్యం/కోట్‌పల్లి:** మండలంలోని అన్ని గ్రామాల్లో పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగినాయని నోడల్ అధికారి ఆశాజ్యోతి తెలిపారు. సోమవారం నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా కోట్‌పల్లి మండలంలోని మొత్తం 26పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు ఉదయం నుండి బారులు తీరారు. మండలంలోని 26 పోలింగ్ స్టేషన్‌లలో మొత్తం 15298 ఓట్లు పోల్ కాగా అందులో 7566 పురుషులు , 7566 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. రూటుఅధికారులు ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లనుపరిశీలించారు. ప్రశాతంగాముగిసినట్లు అధికారులు తెలిపారు.



**బంట్వారం :** సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికలు బంట్వారం మండల కేంద్రంతో పాటు అయా గ్రామాలలో ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని24 పోలింగ్ బూత్‌లలో అన్నీ సజావుగా జరుగగా మండల కేంద్రంలోని 256లో ఉదయం ఓ గంటపాటు ఈవీయం మొరాయించడంతో . దీంతో ఓటర్లు ఓ గంటపాటు వేచి చూడాల్సి వచ్చింది. తదనంతరం అధికారులు ఈవీయంను సరిచేసి పోలింగ్‌ను కొనసాగించారు. మండల పరిధిలోని బొపునారం, బంట్వారం, రొంపల్లి గ్రామాల్లో బూత్‌లలో ఓటరు జాబితాల్లో పేర్లు పొరపాటుగా రావడంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. కాగా బొపునారంలో 244 బూత్‌లో తొలగించబడిన ఓట్లను సైతం అధికారులు అనుమతించినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాగా మండలంలో మొత్తం ఓటర్లు 17158 ఉండగా 12385 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72.17 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగిందని మండల ఎన్నికల అధికారి ప్రవీన్ కూమార్ తెలిపారు.



**వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతగా ముగిశాయి. వికారాబాద్ జిల్లాలో ఎక్కడా అవంచానీయ సంఘనలు జరుగలేవు పోలిస్ బందుబస్తు , సీసీపుటేజీ ,వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ పోలింగ్ సరళిని పరిశీలించిన వ్యయ పరిశీలకులు రాజీవ్‌చావ్‌రా పరిశీలించారు.వికారాబాద్ జిల్లాలో 63, వికారాబాద్ 67, తాండూర్ 63 , కొడంగల్ 65.56 నమోదు అయినట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లా పోలింగ్ ముగిసిన వేంటనే ఇవిఎంలను రంగారెడ్డి జిల్లా చేవేళ్లలోని బండరీశ్రీనివాస్ కాళాశాలకు తరలించడం జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలినపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినందుకు జిల్లాలో పని చేసిన జిల్లా అధికారులకు,రెవెన్యూ, మున్సిపల్ , పంచాయతీకార్యదర్శిలు,కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి ,పోలిస్ వారికి దన్యవదలు తెలిపారు.






**మేడ్చల్ ప్రతినిధి:** పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మల్కాజిగిరి పార్లమెంటరీ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.సాయంత్రం ఐదు గంటల వరకు పార్లమెంటు పరిధిలో 46.27 శాతం పోలింగ్ జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వాహకులు పోలీసు విభాగం సమన్వయంతో కొనసాగించిన పటిష్టమైన భద్రతా కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. కాగా ఉప్పల్ ప్రాంతంలో 65 సంవత్సరాల భరత్‌నగర్ ప్రాంత నివాసి గట్టు విజయలక్ష్మి ఓటు వేసేందుకు అదే ప్రాంతంలోని 349 నంబరు బూతుకు వచ్చిన సందర్భంలో అకస్మాత్తుగా గుండె పోటుకు గురై స్పృహ కోల్పోవటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటన చోటు చేసుకొంది. ఉదయం ఏడు గంటలకే పోలింగ ప్రారంభమైనప్పటికి దాదాపు అన్ని బూత్ లలో మంద కొడిగానే ఓటర్లు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. మధ్యాహ్న సమయంలో ఎండ వేడి కారణంగా పలు చోట్ల ఓటర్ల సంఖ్య గణనీయంగా పలుచబడింది. అంతాయిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం, తాండూరు లోని యాలాల మండలం దౌలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సునీతారెడ్డి ఓటు హక్కు వినియోగించుకొన్నారు. బిజెపి ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్ కుటుంబ సమేతంగా పూడూరు గ్రామంలో తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు.

## ఓటేసిన అస్ట్ ఆనంద్‌భాగ్ కార్పొరేటర్




**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌లోని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ సునీత తన భర్త రాము యాద్‌వ్‌తో కల్సి పివిఎన్ కాలనీలోని సిద్దార్థ స్కూల్‌లోని బూత్ నంబర్ 69లో తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ప్రజా స్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందేనన్నారు.

## అందరూ ఓటు వేయాలి

## ప్రజాస్వామ్యంలో భాగం కావాలి




**ప్రజాపక్షం/ఫేట్ బషీరాబాద్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపల్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జోత్న్న శివారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని దానిని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని ప్రజాస్వామ్యంలో భాగం కావాలని కోరారు. కొంపల్లి మునిసిపల్ పరిధిలో వివిధ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో భారీ సంఖ్యలో మహిళలు మరియు పురుషులు, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ఉమ్మడి శామీర్‌పేటలో ఎన్నికలు ప్రశాంతం







**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉమ్మడి శామీర్‌పేట మండలంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచే ఓటర్లు తమ గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట, తూంకుంట మున్సిపాలిటి, మూడు చింతలపల్లి మండలాల్లోని గ్రామాల్లో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకున్నారు. వృద్దులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీల్‌చైర్‌లు ఏర్పాటు చేసి పోలింగ్‌బూత్‌లకు సిబ్బంది తరలించారు. వికలాంగులకు ప్రత్యేకంగా వీల్‌చైర్‌లు ఏర్పాట్లు చేసి ఓటును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. శామీర్‌పేటలో బిజెపి ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్ పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఉమ్మడి శామీర్‌పేటలో మాజి ఎంఎల్‌ఏ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, నక్క ప్రబాకర్‌గౌడ్‌లు పలు కేంద్రాలను సందర్శించారు. తూంకుంట మున్సిపాలిటిలో 59.58 శాతం, శామీర్‌పేటలో 68.54 శాతం, మూడుచింతలపల్లిలో 80.87 శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌బూత్‌ల్లో ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల అనంతరం అధికారులు ఈవీఎంలను బోగారంలోని హోలీమేరి కళాశాలకు బస్సుల్లో తరలించారు.

### పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ప్రియాంకశుక్లా

కాగా లోక్‌సభ ఎన్నికల సందర్బంగా ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట, తుర్కపల్లి, మజీద్‌పూర్, మురహరిపల్లి, లాల్‌గడిమలక్‌పేటలో ఎన్నికల పరిశీలన అధికారి ప్రియాంకాశుక్లా సోమవారం పోలింగ్‌బూత్‌లను సందర్శించారు. పోలింగ్ తీరును ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### సిఐ శ్రీనాథ్ పర్యవేక్షణలో గట్టి పోలీస్ బందోబస్తు

కాగా ఉమ్మడి శామీర్‌పేటలోని పలుపోలింగ్ కేంద్రాల వద్ద శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ తమ సిబ్బందితో గట్టి పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. మేడ్చల్ డిసిపి నికితాపంత్ మూడుచింతలపల్లిలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఓటర్లు క్యూలైన్‌లో నిలబడి ప్రశాంతంగా ఓటు వేసేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పోలింగ్ బూత్‌లకు మొబైల్స్‌ను తీసుకెళ్లకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

## ప్రశాంతంగా పోలింగ్

### రాచకొండ కమిషనర్ తరుణ్ ఝుజోషి




**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రణాళికతో కొనసాగించిన భద్రతా చర్యల కారణంగా రాచకొండ క మిషనరేట్ పరిధిలో పార్లమెంటు ఎన్నికలు ప్ర శాంత వాతావరణంలో జరిగాయని పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఆయన సోమవారం కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం, ఎల్బీనగర్, మల్కాజిగిరి, భువనగిరి జోన్ ప్రాంతాల్లో పలు పోలింగ్ కేంద్రాలు పరిశీలించి ఎన్నికల సరళిని పరిశీలించారు. కమిషనరేట్ ప్రాంతానికి చెందిన ఆరు వేల మంది పోలీసు సిబ్బందితో పాటు మరో 2500 మంది అదనపు కేంద్ర బలగాలతో ఎన్నికల బందోబస్తు నిర్వహించారన్నారు.

## ప్రజలకు అన్ని ఉచితంగా ఇస్తామనడం అవసరమా...?

**ప్రజాపక్షం / కొడంగల్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కటి ఫ్రీ ఇస్తామనడం ఇది ప్రజలకు అవసరమా రేవంత్‌రెడ్డి అంటు పాలమూర్ బిజేపీ ఎంపీ అభ్యర్థి డికె అరుణ ఫైర్ అయ్యారు. సోమవారం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోని కొడంగల్ నియోజకవర్గంలో ఎన్నికల సరళిని పరిశీలించారు.కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాటలపై మీడియాతో చిట్‌చాట్ చేశారు. కొడంగల్‌లో మాకు అవకాశం ఇవ్వలేదు కాబట్టి అభివృద్ధిపై దృష్టి సారించలేకపోయామని ప్రస్తుతం ఆ అదృష్టం వచ్చిందని ఇక కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని జోష్యం చెప్పారు. పరిపాలన అధికారం కోసం ప్రజలకు ఉచిత హామీలు ఇచ్చి మోసం చేయడం తగదని హెచ్చరించారు. కొడంగల్ ప్రజలను ఓటుకు డబ్బు అని అలవాటు చేయడం మానుకోవాలని సూచించారు. మెడికల్ కాలేజీ కావాలంటే సెంట్రల్ గవర్నమెంట్ నామ్స్ గైడ్స్ లేకుండాఎలా ఇస్తారు అని ప్రశ్నించారు. ఇక ప్రస్తుత మీడియా కూడా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందంటు డికె అరుణ సెటైర్లు వేశారు. వీరితో పాటు ఆ పార్టీ నాయకులున్నారు.

# కుత్బుల్లాపూర్‌లో మందకొడిగా కొనసాగిన పోలింగ్

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మందకోడిగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగింది. సోమవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఆరు గంటల వరకు జరిగింది. ప్రతి రెండు గంటలకు ఒకసారి అధికారులు ఓటింగ్ శాతాన్ని విడుదల చేశారు. ఉదయం తొమ్మిది గంటల వరకు 7.30 శాతం పోలింగ్ కాగా పదకొండు గంటల వరకు 17.21 శాతం, ఒంటి గంటకు 28.36 శాతం, మూడు గంటల వరకు 35.10 శాతం, సాయంత్రం ఐదు గంటల వరకు 48.20 శాతం, ఆరు గంటల వరకు పోలింగ్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు మందకోడిగా ప్రశాంతంగా పోలింగ్ కొనసాగింది.

### ఓటు హక్కును వినియోగించుకున్న పలువురు రాజకీయ నేతలు...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికల్లో పలువురు రాజకీయ నేతలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుత్బుల్లాపూర్ లోని సత్ జ్ఞాన్ స్కూల్‌లో స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద ఓటు వేయగా గాజులరామారం






లోని తత్వ గ్లోబల్ స్కూల్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ క్యూలైన్‌లో నిలబడి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి దంపతులు నిజాంపేట్ లోని విజ్ఞాన్ స్కూల్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. నేతలు మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమని, మంచి నాయకులను ఎన్నుకోవడంతోనే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతుందని చెప్పారు.

# పోలింగ్ బూత్‌లలో పోలీసులు ప్రత్యేక నిఘా





**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఆరు గంటల వరకు జరిగింది. సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్టలోని పలు పోలింగ్ బూత్‌లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి పరిశీలించారు. జగద్గిరిగుట్టలోని మగ్ధూమ్‌నగర్ చైతన్య విద్యానికేతన్ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లను, జిల్లా పరిషత్ హైస్కూల్ పోలింగ్ బూత్‌లను సీపీ పరిశీలించారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు ఏర్పాటు చేసిన సదుపాయాలను ఆయన వీక్షించారు. సీపీతో పాటు బాలానగర్ జోన్ డిసిపి శ్రీనివాస్ రావు, ఎసిపి హనుమంత రావు, జగద్గిరిగుట్ట సిఐ క్రాంతి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ సరళిని పరిశీలించిన పలు పార్టీల అభ్యర్థులు:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సరళిని ఆయా పార్టీల ఎంపి అభ్యర్థులు పరిశీలించారు. నియోజకవర్గం పరిధిలోని చింతల్, సుభాష్ నగర్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్‌ల లోని పలు పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న పోలింగ్ సరళిని బిఆర్‌ఎస్ మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకలు పరిశీలించారు. అదేవిధంగా మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునిత మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డిలు నిజాంపేట్, బహద్దూర్ పల్లి, జగద్గిరిగుట్ట, గాజులరామారం, బౌరంపేట్, ప్రగతినగర్, చింతల్‌లలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఆయా బూత్‌లలో బిజెపి మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్‌కు అనుగుణంగా గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు











**ప్రజాపక్షం/చర్లపల్లి/నాగారం:** పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా కాప్రా పలు డివిజన్‌లో ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాప్రా డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీ విజయ హై స్కూల్‌లో బూత్ నంబర్ 43లో ఉప్పల్ ఎంఎల్‌ఏ బండారి లక్ష్మారెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డి దంపతులు నవజీవన్ పబ్లిక్ స్కూల్‌లో బూత్ నంబర్ 99లో,మాజీ మేయర్ బొంతు రామ్మోహన్,కార్పొరేటర్ బొంతు శ్రీదేవి చర్లపల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి విద్యాలయ పాఠశాలలో, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పోలింగ్ బూత్ 157 లో, నాగారం సెయింట్ బెథానీ స్కూల్ 220 బూత్‌లో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# యాచారంలో 72.79 శాతం ఓటింగ్ నమోదు

### ప్రశాంతంగా ముగిసిన భువనగిరి పార్లమెంటు ఎన్నికలు

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండలంలో భువనగిరి పార్లమెంటు ఎన్నికల ఓటింగ్ శాతం 72.79 శాతం నమోదు అయినట్లు మండల అసిస్టెంట్ ఎలక్ట్రొరల్ అధికారి అయ్యప్ప తెలిపారు. మండలంలో మొత్తం ఓటర్లు 48 వేల 656 ఓటర్లు ఉండగా 35 వేల 415 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.విరిలో పురుషులు 17వేల 890. స్త్రీలు 17 వేల 525 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు.మొత్తం 59 పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికల నిర్వాహణ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంబం అయి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. ముందు ఎన్నికల సరళి మద కొడిగా జరిగాయి. ఎండాకాలం కావడం తో సాయంత్రం 5 గంటలకు ముగియాల్సిన పోలింగ్‌ను 6 గంటల వరకు పోడింగించిన విషయం తెలిసిందె. ఈ నెపథ్యంలో ఓటర్లు ఎలాంటి ఇబ్బంది పడకుండా ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరుగడానికి సహకరించిన వివిధ పార్టీల నాయకులకు, సిబ్బందికి అయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యాచారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్త్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోలింగ్ సరళిని బిజెపి ఎంపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ సందర్శించారు. పోలింగ్ వివరాలను పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు.




## నా ఓటును ఎవరు వేశారు

### మీడియాను ఆశ్రహించిన ఓటర్ సుధకార్.

### స్పందించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/బంట్వారం :** పార్లమెంటు ఎన్నికలలో బాగంగా మండల కేంద్రానికి చెందిన దోరెటి సుధాకర్ అనే ఓటరు ఓటు వేయడానికి రాగా నీ ఓటు ముందే పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేయబడిందని చెప్పగా నేనొక సాధారణ ఓటరును నేను పోస్టల్ బ్యాలెట్ ఎలా వేయగలను, నాఓటు ఎవరు వేశారు అని అధికారులను ప్రశ్నించగా అదంతా మాకు తెలీదు నీ ఓటు వినియోగించబడింది వెళ్ళిపో అంటూ అధికారులు ఓటరును బయటకు గెంటివేశారు. దీంతో అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులతో తన గోడు వినిపించడంతో స్థానిక ఎన్నికల సహాయ అధికారి ప్రవీణ్ కుమార్ ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నారాయణరెడ్డి అనుమతితో ఓటరు సుధాకర్ మద్యాహ్నం 3 గంటలకు తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.



# పోలింగ్‌కు బారులు తీరిన ఓటర్లు






**ప్రజాపక్షం/షాద్‌నగర్:** షాద్‌నగర్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల నిర్వహణకు అధికారులు ఆదివారం రాత్రే ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలకే ప్రారంభమైన పోలింగ్‌కు ప్రజలు హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. షాద్‌నగర్ ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ నందిగామ మండలంలోని తమ స్వగ్రామమైన వీర్లపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధే విధంగా మాజీ ఎంఎల్ఏలు అంజయ్యయాదవ్ కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటలో, ప్రతాప్‌రెడ్డి ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్‌లో, భీష్వ కిష్టయ్య, బక్కని నర్సింహులు లింగారెడ్డిగూడలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని కొన్ని చోట్ల ఈవీఎంలు కొద్దిసేపు మోరాయించడంతో అధికారులు ఆలస్యంగా పోలింగ్‌ను ప్రారంభించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటల వరకు 72.42 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి వెంటకమాధవరావు తెలిపారు. 6 గంటల తరువాత కూడా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ బారులు తీరి ఉన్నారు. పూర్తి స్థాయిలో ఓటింగ్ శాతాన్ని తెలిపేందుకు సమయం పడుతుందని ఆయన తెలిపారు.

# గుజరాత్, కోల్‌కతా మ్యాచ్ రద్దు



న్యూఢిల్లీ : ఐపిఎల్ 17వ సీజన్‌లో భాగంగా నేడు (మార్చి 13న) గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడాల్సి ఉంది. అయితే వర్షం కారణంగా ఆ మ్యాచ్ రద్దయింది. అయితే రెండు జట్లకు చెరో పాయింట్ వచ్చింది. సాయంత్రం నుంచే అహ్మదాబాద్‌లో వర్షం కురుస్తోంది. దీంతో అభిమానులు స్టాండ్స్‌లో అలానే ఉండిపోయారు. సిబ్బంది కూడా మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు. అంతే కాకుండా ఫ్లడ్ లైట్లలోని కొన్ని భాగాలు కూడా సమస్య తలెత్తడం వల్ల వాటిలో కొన్నింటిని పూర్తిస్థాయిలో ఆన్ చేయలేదు. అయితే గుజరాత్‌కు ఈ మ్యాచ్ ఎంతో కీలకం. ఇందులో విజయం సాధిస్తేనే ఆ జట్టుకు ప్లేఆఫ్స్ అవకాశాలు ఉన్నాయి. ఓడితే అధికారికంగా ఎలిమినేట్ అయినట్లే. కోల్‌కతా ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఆ జట్టు 18 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఇక గుజరాత్ ఇప్పటి వరకు 12 మ్యాచ్‌లు ఆడగా, అందులో 5 గెలిచింది. మిగతా 7 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసింది. ప్రస్తుతం ఆ జట్టు చేతిలో 10 పాయింట్లు ఉన్నాయి. చెన్నైతో జరిగిన చివరి మ్యాచ్‌లో గుజరాత్ ఘన విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్‌లు 210 పరుగులు భాగస్వామ్యం వల్ల ఆ జట్టు మంచి స్కోర్ చేసింది.

# మూడు ప్లేసుల కోసం ఐదు జట్ల పోటీ



న్యూఢిల్లీ : ఈ ఏడాది ఐపిఎల్ సీజన్ గ్రూప్ దశలో ఇంకా ఎనిమిది మ్యాచ్‌లే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా జట్లు తమ ప్లేఆఫ్స్ అవకాశాలను దక్కించుకునేందుకు సిద్ధంగా ఉంది. అయితే ఇప్పటికే కోల్‌కతా జట్టు ఒక్కటే అధికారికంగా ఆ జాబితాలోకి చేరుకుంది. ఇక మిగిలిన మూడు స్థానాల కోసం ఏడు జట్లు తలపడుతున్నాయి. ముంబయి, పంజాబ్ తప్ప మిగతా అన్ని జట్లు నాకౌట్ రేసులో ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఆదివారం రాజస్థాన్‌ను చెన్నై, ఢిల్లీని బెంగళూరు ఓడించడం వల్ల ఈ ప్లేఆఫ్స్ రేసు మరింత ఇంట్రెస్టింగ్ సాగనుంది. ఇప్పటికే 13 మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లతో ఉన్న ఢిల్లీ, 12 మ్యాచ్‌లు ఆడి 10 పాయింట్లతో ఉన్న గుజరాత్ మాత్రమే రేసులో ఉన్నాయి. ఆ జట్లు ప్లేఆఫ్స్ చేరడం దాదాపు అసాధ్యమే.

**ఆ రెండింటికే ఛాన్స్:** ప్రస్తుతం 16 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ జట్టు దాదాపు ప్లేఆఫ్స్ చేరినట్టే. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో (పంజాబ్, కోల్‌కతాతో) ఒక్క మ్యాచ్‌లో నెగ్గినప్పటికీ రాజస్థాన్ ప్లేఆఫ్స్‌కు చేరుతుంది. ఒకవేళ ఈ రెండింటిలో ఓడినా అవకాశం ఉంటుంది. కానీ ఈ రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో కాకుండా తక్కువ తేడాతో ఓడాల్సి ఉంటుంది. మరోవైపు సన్ రైజర్స్ హైదరాబాద్ ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడి 14 పాయింట్లతో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో (గుజరాత్, పంజాబ్‌తో) విజయం సాధిస్తే ఈ జట్టుకు ప్లేఆఫ్స్‌లో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. మెరుగైన నెట్ రన్‌రేట్ ఉండటం వల్ల ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించినా కూడా హైదరాబాద్ నాకౌట్‌కు చేరే అవకాశముంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూస్తుంటే రాజస్థాన్, హైదరాబాద్ కచ్చితంగా ప్లేఆఫ్స్ చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**లక్నో డౌటే!:** పైన పేర్కొన్న విధంగా జరిగితే ఆఖరి బెర్తు కోసం చెన్నై, బెంగళూరు, లక్నో మధ్య గట్టి పోటీ నెలకొంటుంది. ప్రస్తుతం 12 పాయింట్లతో ఉన్న లక్నో, మిగిలిన రెండు మ్యాచ్‌లకు గానూ ఢిల్లీ, ముంబయి జట్లతో తలపడనుంది. ఈ జట్టుకు ప్లేఆఫ్స్ చేరడానికి ఇది ఓ మంచి అవకాశం. కానీ, ఈ జట్టుకు నెట్ రన్‌రేట్ ప్రతికూల అంశంగా మారింది. 0.769 నెట్ రన్‌రేట్ ఉన్న లక్నో జట్టు మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో గెలిస్తే తప్ప నాకౌట్‌కు చేరుకునే ఛాన్స్ ఉంటుంది.

**బెంగళూరు ఇలా చేస్తేనే:** ఇదిలా ఉండగా, ఆర్‌సిబి ప్లేఆఫ్స్‌కు చేరాలంటే హైదరాబాద్ ఒకటి లేదా రెండు మ్యాచ్‌ల్లో ఓడాల్సి ఉంటుంది. దాంతోపాటు లక్నో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఒక దాంట్లోనే గెలవాలి. వీటితోపాటు మే 18న చెన్నైతో జరిగే మ్యాచ్‌లో తప్పక విజయం సాధించాల్సి ఉంటుంది. సిఎస్‌కెపై 18 పరుగులు లేకుంటే అంతకంటే ఎక్కువ రన్స్ తేడాతో గెలవాల్సి ఉంటుంది. లేదంటే చెన్నై ఇచ్చిన టార్గెట్‌ను 18.1 ఓవర్లలో ఛేదించాల్సిందే. అప్పుడే సిఎస్‌కె నెట్ రన్‌రేట్‌ను ఆర్‌సిబి అధిగమించినట్లు అవుతుంది.

**చెన్నైకి మరో ఛాన్స్:** ఒకవేళ ఆర్‌సిబి చేతిలో చెన్నై ఓడిన కూడా ఆ జట్టుకు మరో ఛాన్స్ ఉంటుంది. బెంగళూరుపై భారీ తేడాతో కాకుండా స్వల్ప తేడాతో ఓడటమే కాకుండా వాళ్ల నెట్ రన్‌రేట్ పడిపోకుండా చూసుకోవాలి. దీంతోపాటు సన్‌రైజర్స్ మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో ఓడిపోయి వాళ్ల దగ్గర 14 పాయింట్లు ఉండాలి. వీటితో పాటు మే 14న లఖ్‌నవూ మ్యాచ్‌లో ఢిల్లీ ఆ జట్టును ఓడించాలి. శుక్రవారం ముంబయి చేతిలో లక్నో ఓడాలి లేదా స్వల్ప తేడాతో నెగ్గాలి. అప్పుడే నాలుగైదు జట్లు 14 పాయింట్లతో ఉంటాయి. నెట్ రన్‌రేట్ మెరుగ్గా ఉన్న జట్టు ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది.



## 'సలార్ 2' లో ప్రభాస్ భారీ డైలాగ్

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఔట్ అండ్ ఔట్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ సలార్. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టి, సెన్సేషన్ క్రియేట్ చేయడం జరిగింది. ఈ చిత్రం సెకండ్ పార్ట్ పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే మొదటి పార్ట్‌లో ప్రభాస్‌కి ఎక్కువగా డైలాగ్స్ లేవు. అవి ఫ్యాన్స్‌ను కాసింత నిరాశకి గురి చేశాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్రభాస్ కోసం కొన్ని పవర్ ఫుల్ డైలాగ్స్‌ను పార్ట్ 2లో జోడించాడు. సలార్ 2లో ప్రభాస్ భారీ డైలాగ్ ఉందని, ఇది ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇస్తుంది అని సమాచారం. పృథ్వీరాజ్ సుకుమారన్ మెయిన్ విలన్గా నటిస్తున్న ఈ చిత్రంలో శృతి హాసన్ కథానాయికగా నటిస్తోంది. హోంబలే ఫిలిమ్స్ మరో రెండు నెలల్లో సలార్ 2ని సెట్స్ పైకి తీసుకు వెళుతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

## 'విద్యవాసుల అహం' డేట్ ఫిక్స్




రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ ప్రధాన పాత్రల్లో, డైరెక్టర్ మణికాంత్ గెల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం విద్య వాసుల అహం. తన్వికా జస్వికా క్రియేషన్స్ సమర్పణలో, ఎటర్నిటీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నవ్య మహేష్, రంజిత్ కుమార్ కొడాలి, చందన కట్టలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి కళ్యాణి మాలిక్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం రిలీజ్ డేట్‌పై మేకర్స్ సరికొత్త ప్రకటన చేయడం జరిగింది. ఈ చిత్రం థియేట్రికల్ రిలీజ్ కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వలన డైరెక్ట్ డిజిటల్‌గా రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రం మే 17, 2024న రిలీజ్ కానుంది. ప్రముఖ ఓటిటి ప్లాట్ ఫామ్ అయిన ఆహా వీడియో ద్వారా ఈ చిత్రం డైరక్ట్ డిజిటల్ ప్రీమియర్‌గా ఆడియెన్స్ ముందుకి రానుంది. ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి మంచి రెస్పాన్స్ రావడంతో సినిమా పై అందరిలో ఆసక్తి నెలకొంది.



## విజయ్, రష్మికా మూడవ చిత్రం

యంగ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం విడి14. ఈ చిత్రానికి టైటిల్‌ను ఖరారు చేయాల్సి ఉంది. విజయ్ దేవరకొండ పుట్టిన రోజు సందర్భంగా, ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ తమ కొత్త చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. విజయ్‌తో గతంలో టాక్సీవాలా అనే చిత్రాన్ని డైరెక్ట్ చేసిన రాహుల్ ఇప్పుడు పీరియాడికల్ యాక్షన్ డ్రామాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుండి రిలీజైన కాన్సెప్ట్ పోస్టర్ ఆడియెన్స్‌లో, ఫ్యాన్స్‌లో ఆసక్తిని కలిగించింది. లేటెస్ట్ న్యూస్ ఏంటంటే, ఈ చిత్రంలో ఫిమేల్ లీడ్ రోల్‌లో స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న నటించనున్నది. అయితే ఈ న్యూస్‌పై మేకర్స్ నుండి అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే డియర్ కామ్రేడ్ మరియు గీత గోవిందం చిత్రాల్లో వీరిద్దరూ కలిసి నటించారు. ఇది వారికి హ్యాట్రిక్ చిత్రం అని చెప్పాలి. అక్టోబర్‌లో ఈ చిత్రం సెట్స్ మీదకి వెళ్లనుంది. ప్రస్తుతం ఈ చిత్రంకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. ఇది 1854 నుండి 1878 మధ్యకాలంలో జరిగే కథ అని పోస్టర్‌లో పేర్కొన్నారు. తెలుగుతో పాటుగా, హిందీ, కన్నడ, తమిళం, మలయాళం భాషల్లో కూడా రిలీజ్ కానున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

## 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో పొలిటికల్ ఎలిమెంట్




టాలీవుడ్ యంగ్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న విలేజ్ యాక్షన్ డ్రామా గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. ఈ చిత్రం గతేడాది థియేటర్లలోకి రావాల్సి ఉండగా, వాయిదా పడుతూ వస్తోంది. రీసెంట్‌గా ఈ చిత్రంను మే 31, 2024న వరల్‌వైడ్ గా థియేటర్ల లో రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇప్పటికే ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వచ్చి ంది.అయితే ఈ చిత్రం లో పొలిటికల్ ఎలిమెంట్ గట్టిగానే ఉన్నట్లు తెలుస్తోంది. మేకర్స్ రిలీజ్ చేస్తున్న పోస్టర్లు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. విశ్వక్ సేన్ కెరీర్ లో ఈ చిత్రం కమర్షియల్ హిట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌లపై నిర్మిస్తున్నారు. అంజలి కీలక పాత్రలో నటిస్తుండగా, యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్నారు.

# మళ్లీ అమ్మాయిలే టాప్

## సిబిఎస్‌ఇ 10, 12వ తరగతి ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ : విద్యార్థులంతా ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఇ) 10, 12వ తరగతుల ఫలితాలు వచ్చేశాయ్. విద్యార్థులు తాము సాధించిన స్కోరును cbse.gov.in, https://cbseresults.nic.in/ వెబ్‌సైట్‌ల ద్వారా తెలుసుకోవచ్చని సిబిఎస్‌ఇ వెల్లడించింది. రోల్ నంబర్, స్కూల్ నంబర్, పుట్టిన తేదీ, అడ్మిట్ కార్డు నంబర్‌లను ఎంటర్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చని తెలిపింది. అలాగే, డిజీలాకర్, ఉమాంగ్ మొబైల్ యాప్‌ల ద్వారా కూడా రిజల్ట్స్ చూసుకోవచ్చని చెప్పింది.

**2.12లక్షల మందికి 90శాతం కంటే ఎక్కువ మార్కులు:** పదో తరగతిలో మొత్తం 93.60శాతం మంది పాస్ అయ్యారు. 2.12లక్షల మందికి 90శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చాయని సిబిఎస్‌ఇ వెల్లడించి ంది. అబ్బాయిల కంటే అమ్మాయిలే ముందున్నారని చెప్పింది. ఇందులో 47,983 మంది 95శాతానికి పైగా స్కోరు సాధించారని తెలిపింది. అత్యధికంగా తిరువనంతపురంలో 99.75శాతం, విజయవాడలో 99.60 శాతం, చెన్నైలో 99.30శాతం, బెంగళూరులో 99.26శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి మార్చి 13వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి.

**అమ్మాయిలే టాప్:** ఈ ఏడాది 12వ తరగతిలో మొత్తం 87.98 శాతం మంది పాస్ అయ్యారు. 91శాతం ఉత్తీర్ణతతో అమ్మాయిలు రాణించారు. 85.12 శాతం మంది బాలురు ఉత్తీర్ణత సాధించారు. 1.16లక్షల మంది విద్యార్థులకు 90శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చాయని సిబిఎస్‌ఇ వెల్లడించింది. ఇందులో 24,068 మంది విద్యార్థులు 95శాతానికి పైగా స్కోరు సాధించినట్లు బోర్డు వివరించింది. అత్యధికంగా తిరువనంతపురంలో 99.91శాతం, విజయవాడలో 99.04 శాతం, చెన్నైలో 98.47శాతం, బెంగళూరులో 96.95శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపింది. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు 12వ తరగతి పరీక్షలు జరిగాయి. విద్యార్థుల్లో అనారోగ్యకరమైన పోటీని నివారించేందుకు సీబీఎస్‌ఈ బోర్డు గత కొన్నేళ్లుగా మెరిట్ జాబితాలను వెల్లడించకూడదని నిర్ణయించింది.

**ఇకపై ఏడాదికి రెండు సార్లు బోర్డ్ ఎగ్జామ్స్:** సిబిఎస్‌ఇ టెన్త్, ఇంటర్ పరీక్షలను ఏడాదిలో రెండుసార్లు నిర్వహించేలా కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఇటీవలె కసరత్తు ముమ్మరం చేసింది. 202526 విద్యా సంవత్సరం నుంచే ఈ సరికొత్త విధానాన్ని అమలుచేసేలా వ్యూహరచన చేయాలని సిబిఎస్‌ఇని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ఈ పరీక్షల్లో సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టే ఆలోచన లేదని చెప్పాయి.

**వచ్చే నెలలోనే సంప్రదింపులు!:** ఏడాదిలో రెండుసార్లు టెన్త్, ఇంటర్ పరీక్షలను నిర్వహించే అంశంపై పాఠశాలల ప్రిన్సిపాళ్లతో వచ్చే నెలలోనే సంప్రదింపులు జరపనున్నారు. అండర్ గ్రాడ్యుయేషన్ అడ్మిషన్ల షెడ్యూల్‌పై ఎలాంటి ప్రభావం లేకుండా రెండోసారి బోర్డు పరీక్షలు నిర్వహించేలా అకడమిక్ క్యాలెండర్‌ను సిద్ధం చేసేందుకు విధివిధానాలు రూపొందించే పనిలో సిబిఎస్‌ఇ అధికారులు నిమగ్నమైనట్లు సమాచారం.

## హత్య కేసులో టీనేజర్‌కు 14 ఏళ్ళు జైలుశిక్ష

బ్రిస్‌బేన్ : ఆస్ట్రేలియా బ్రిస్‌బేన్‌లో రెండేళ్ళక్రితం అర్ధరాత్రి ఒక ఇంట్లోకి దూసుకువెళ్ళి ఒక మహిళను హత్య చేసిన కేసులో ఒక టీనేజర్‌కు న్యాయస్థానం 14 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. బ్రిస్‌బేన్‌లోని సుప్రీంకోర్టు న్యాయమూర్తి టామ్ సుల్లివాన్ సోమవారం ఈ తీర్పు చెప్పారు. మరో టీనేజర్‌పై కేసు విచారణ జరుగుతోంది. హత్య చేసినప్పుడు 2022లో ఆ టీనేజర్‌కు 17 ఏళ్ళే. ఉత్తర బ్రిస్‌బేన్‌కు 45 కి.మీ దూరంలో ఉన్న నార్త్‌లేక్స్‌లో ప్రశాంతంగా జీవించే ఒక బ్రిటీష్ కుటుంబం ఈ హత్యతో విచ్ఛిన్నమైపోయింది. బ్రిటన్ నుండి పదేళ్ళక్రితం ఆస్ట్రేలియా వచ్చి జీవిస్తున్న ఇద్దరు కుమార్తెలు గల తల్లి ఎమ్మా లోవెల్ (41) ఆమె భర్త ఇంట్లో నిద్రిస్తుండగా కుక్కల అరుపులతో వారు బయట గార్డెన్‌లోకి వెళ్ళారు. అప్పటికే ఇద్దరు టీనేజర్లు వారి గార్డెన్‌లోకి ప్రవేశించారు. అక్కడ జరిగిన ఘర్షణలో లోవెల్‌ను అతి దారుణంగా టీనేజర్లు పొడిచి చంపారు. ఈ దాడిలో ఆమె భర్త, పిల్లలు, హతురాలి తల్లి గాయపడ్డారు.

# అగ్నిపథ్‌ను కొనసాగిస్తారా? ప్రధానికి జైరామ్ రమేష్ సూటి ప్రశ్న



న్యూఢిల్లీ : తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న అగ్నిపథ్ పథకాన్ని కొనసాగిస్తారా అని ప్రధాని నరేంద్ర మోదీని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేశ్ నిలదీశారు. ప్రవేశపెట్టడం ద్వారా దేశ యువతను మోదీ ప్రభుత్వం నమ్మకద్రోహం చేసిందని ఆరోపించారు. యువత ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపే అగ్నిపథ్ పథకంపై ప్రధాని మోదీ అంత పట్టుదలగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఉన్న మోదీకి ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ సోమవారం పలు ప్రశ్నలను 'ఎక్స్'లో సంధించారు. బిహార్‌లోని ముజఫర్ నగర్, పూర్ణియా, భాగల్పూర్ నగరాలలో ఎందుకు ఏయిర్‌పోర్టులు ఏర్పాటు చేయలేదని, ఆ రాష్ట్రంలో చక్కెర బిల్లులు ఎందుకు ఖాళీగా పడి ఉన్నాయని నిలదీశారు. నమామీ గంగే ప్రాజెక్టు చేపట్టిన తరువాత కూడా గంగా నదిలో ఎందుకు కాలుష్యం పెరిగిపోయిందన్నారు. 2019లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ముజఫర్‌నగర్‌లోని పటాహీ ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఏడు నెలల క్రితం కేంద్ర మంత్రి అమిత్ షా ఆ ఎయిర్‌పోర్టు 2023 దీపావళి నాటికి వినియోగంలోకి వస్తుందన్నారని పేర్కొన్నారు. భారతదేశంలో 40 శాతం చెరుకు పంట బిహార్‌లోనే ఉత్పత్తి అవుతుందని, కాని ఆ రాష్ట్రంలో 4 శాతమే చక్కెర ఉత్పత్తి అవుతుందన్నారు. గతంలో 30 చక్కెర మిల్లులు పని చేస్తుండగా , ఇప్పుడు అందులో 11 మాత్రమే ఉన్నాయన్నారు. మోతీపూర్ చక్కెర మిల్లును తెరిపిస్తామని 2014లో మోదీ ఇచ్చిన హామీ ఇప్పటి వరకు ఎందుకు నెరవేర్చలేదన్నారు. నమామీ గంగే పథకం కింద 2014 నుండి ఇప్పటి వరకు రూ.20 వేలు ఖర్చు చేశారని, బిహార్‌లో గంగా నది కింద కాలుష్య ప్రాంతాలు 200 శాతం పెరిగాయన్నారు. రోగ కారక సూక్ష్మ జీవులు 84 ఇంతలు పెరిగాయని తెలిపారు. అగ్నిపథ్ పథకాన్ని బిహార్ ప్రభుత్వం వ్యతిరేకించినప్పటికీ ఎందుకు అమలు చేస్తున్నారని విమర్శించారు. అగ్నిపథ్ ను ఎత్తేస్తామని న్యాయ్‌పత్రలో హామీ ఇచ్చామని జైరామ్ రమేశ్ తెలిపారు.

# ఓటింగ్ శాతంపై పిల్‌ను 17న విచారించనున్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి దశ ఓటింగ్‌కు సంబంధించి బూత్ వారీగా పోలైన ఓట్ల వివరాలను 48 గంటల్లో ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచే విధంగా ఆదేశించాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఎడిఆర్) వేసిన పిటిషన్‌పై ఈ నెల 17న సుప్రీం కోర్టు వాదనలు విననుంది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఎదుట శుక్రవారం రానున్న ఈ కేసులో ఎడిఆర్ తరుపున న్యాయవాది ప్రశాంత్ భూషన్ హాజరుకానున్నారు. అన్ని పోలింగ్ బూత్‌లలో నమోదైన ఓట్ల వివరాలకు సంబంధించిన ఫామ్ 17 సి పార్ట్ 1ను స్పష్టంగా కనపడే విధంగా స్కాన్ చేసి ఓటింగ్ పూర్తయిన వెంటనే అప్‌లోడ్ చేయాలని 2019లో ఎడిఆర్ వేసిన పిల్‌లో భాగంగా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఇంటరిమ్ అప్లికేషన్ (మధ్యంతర దరఖాస్తు)ను ఫైల్ చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నియోజకవర్గ వారీగా కచ్చితమైన ఓటేసిన ఓటర్‌ల వివరాలను ప్రతి దశ పోలింగ్‌లో ఇవ్వాలని, అలాగే నియోజకవర్గం వారీగా కచ్చితమైన ఓట్ల వివరాలను కూడా అందుబాటులో ఉంచాలని ఇసిని ఆదేశించాల్సిందిగా ఎడిఆర్ తాజా మధ్యంతర దరఖాస్తులో సుప్రీం కోర్టును కోరింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మొదటి రెండు దశల పోలింగ్ వివరాలను ఎన్నికల కమిషన్ మొదటి దశ పోలింగ్ పూర్తయిన 11 రోజుల తరువాత ఏప్రిల్ 30న ప్రచురించిందని, రెండవ దశ పూర్తయిన నాలుగు రోజుల తరువాత ఏప్రిల్ 30న ప్రచురించిందని ఎడిఆర్ పేర్కొంది. ఏప్రిల్ 30న ఎన్నికల కమిషన్ పత్రికా ప్రకటనలో ఇచ్చిన వివరాలలో పోలింగ్ రోజు సాయంత్రం 7 గంటలకు ప్రకటించిన శాతాలతో పోల్చితే 56 శాతం పెరిగిందని కోర్టుకు ఫైల్ చేసిన మధ్యంతర దరఖాస్తులో తెలిపింది. పోలింగ్‌లో పాల్గొన్న తుది ఓటర్ల వివరాలను వెల్లడించడంలో అసాధారణ జాప్యం, మొదట విడుదల చేసిన వివరాలతో పోల్చినప్పుడు అసాధారణ రీతిలో ఓటింగ్ శాతం ఐదు శాతానికి పైగా అసాధారణంగా పెరగడం ప్రజల్లో అనుమానాలకు , ఆందోళనకు తావిస్తోందని పేర్కొంది.

# మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రశాంతంగా పోలింగ్

జార్ఖండ్ : జార్ఖండ్ రాష్ట్రంలోని ఓటర్లను పోలింగ్ బూత్ వరకు వెళ్ళకుండా రోడ్డుకు అడ్డంగా నరికివేసిన చెట్లను పోలీసులు తొలగించారు. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా సోనాపి, మోరంగ్‌పొంగా ప్రాంతాలలో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. మొత్తం 1,522 మంది ఓటర్లు ఈ బూత్‌లలో ఓటర్లుగా ఉన్నారు. మావోయిస్టు ప్రభావితమైన ఈ ప్రాంతాలకు పోలింగ్ సిబ్బందిని రైళ్ళు, హెలికాప్టర్‌ల ద్వారా ఎన్నికల కమిషన్ పంపించింది. దశాబ్దాల తరువాత ఈ ప్రాంతాలలో తొలిసారిగా ఓటింగ్ జరిగింది. సింగ్‌భూమ్ ఎస్‌టి రిజర్వు నియోజకవర్గంలో పరిధిలో ఆసియాలోనే అత్యధిక సాంద్రతతో సాల్ అడవి విస్తరించి ఉన్నది. ఇక్కడ మావోయిస్టులు ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఎన్నికల నిర్వహణకు లైవ్ ట్రాకింగ్ ఇవిఎంలు, పోలింగ్ సిబ్బందిని తీసుకుపోయేందుకు జిపిఎస్‌తో కూడిన వాహనాలను వినియోగించారు. మిడిల్ స్కూల్, నుగ్డి, మధ్య విద్యాలయ , బొరేరో వంటి పోలింగ్ కేంద్రాలలో తొలిసారిగా ఓటింగ్‌లో పాల్గొనడం కనపించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కుల్దీప్ చౌధురి వెల్లడించారు. కొన్ని ప్రాంతాలలో 4 5 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేసి పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన బూత్‌లకు చేరుకోగలిగారు. అపరేషన్ అనకొండ వంటి భారీ భద్రతా ఆపరేషన్‌లతో 'విముక్తి ప్రాంతాలు'గా ప్రకటించిన తాల్‌కోబాద్, దాని చుట్టుపక్కల రెండు డజన్‌ల గ్రామాలలో కూడా సుమారు 15 క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. సింగ్‌భూమ్‌లో 14.23 లక్షల ఓటర్లలో 7.27 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈ స్థానం నుండి బిజెపి తరుపున మాజీ ముఖ్యమంత్రి మధు కోడా సతీమణి, సిట్టింగ్ ఎంపి గీతా కోరా, ఇండియా కూటమి తరుపున కాంగ్రెస్ ఎంఎల్‌ఎ జోబా మాంఝీ పోటీ చేస్తున్నారు. గతంలో జార్ఖండ్‌లో ఏకైక కాంగ్రెస్ ఎంపిగా ఉన్న గీతా కోరా ఇటీవలనే బిజెపిలో చేరారు.

# భీకర గాలులతో తల్లడిల్లిన ముంబై

న్యూఢిల్లీ : మహానగరం ముంబయిలో సోమవారం వాతావరణం అతలాకుతలం అయింది. ఉధృతస్థాయి దుమ్మూ ధూళి తుపాన్, వర్షాకాలానికి ముందే తొలి వర్షంతో నగరవాసులు తల్లడిల్లారు. ఇటీవలికాలంలో ఎప్పుడూ లేనంతగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో దుమ్ముతుపాన్ చెలరేగడంతో పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాలు రోడ్ల పైనే నిలిపి వాహనదారులు చాలా సేపటివరకూ షెల్టర్లలో నిలిచిపొయ్యారు. వాతావరణ ప్రతికూలతతో విమానాశ్రయాలలో రాకపోకలు నిలిపివేశారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆకాశం కాటుకు ధట్టించినట్లుగా నల్లగా మారింది. ఇంతకాలం ఉక్కపోతలతో సతమతమయిన నగరవాసులు అకాల భారీ వర్షంతో కొద్దిగా ఉపశమనం పొందారు. అయితే కళ్లుమూసుకుపొయ్యే రీతిలో దుమ్మూతుపాన్ చెలరేగడంతో జనం ఇదేం చోద్యం అనుకున్నారు. ఉన్నట్లుండి వాతావరణం మారింది. రోడ్లపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపొయ్యాయి. ఘట్కోపార్, బాంద్రా కుర్లా, ధరవి ప్రాంతాలలో బలమైన గాలులు వీచాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితిని గమనించి బొంబాయి ఎయిర్‌పోర్ట్‌లో విమానాలను నిలిపివేశారు. దేశంలోనే అత్యంత రద్దీ ఎయిర్‌పోర్టులలో ఒక్కటైన ఇక్కడి ఎయిర్‌పోర్టు చాలా సేపటివరకూ అస్థవ్యస్థ పరిస్థితులు నెలకొన్నాయి. ముంబై ఒక్కటే కాకుండా థానే, ఫాల్ఘాట్, రాయ్‌గఢ్, నాగర్, తూర్పు శివారు ప్రాంతాల్లో రెండుగంటల పాటు ఈదురుగాలులు వీచాయి. పుణే, సతారా ఇతర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడిందని వాతావరణ శాఖ తెలిపింది. పెనుగాలలకు పై కప్పులు కూలిన ఘటనలలో కొన్ని ప్రాంతాలలో ఏడుగురు గాయపడ్డారు. వీరిని రాజావాడి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. శిథిలాల కింద ఉన్న వారిని కాపాడేందుకు సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. ఓ పెట్రోలు బంకు వద్ద ఉన్న 100 మీటర్ల ఎతైన బోర్డు కిందపడింది. దీనితో ఇక్కడున్న వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ధడేలు మంటూ భారీ కటౌటు నేలకు ఒరిగిపడటంతో అక్కడున్న వారు ప్రాణభయంతో పరుగులు తీశారు. పెనుగాలులతో నవీ ముంబైలో కొన్ని చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. గంటల పాటు ముంబైని ఈదురుగాలులు వీడకుండా చుట్టేయడంతో భయానక పరిస్థితి ఏర్పడింది.

# ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదు..!

## ఎన్నికల ప్రచారంలో రాహుల్ సరదా వ్యాఖ్యలు..



రాయ్‌బరేలి : ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఉత్తర ప్రదేశ్ రాయ్‌బరేలీలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విషయం తెలిసిందే. కేరళ వాయనాడ్ ఎంపి స్థానం మరోసారి పోటీ చేస్తున్నారు. అలాగే, కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీలో సైతం బరిలోకి దిగారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ మొన్నటి వరకు పోటీ చేస్తూ వచ్చారు. ఆమె స్థానంలో రాహుల్ గాంధీ పోటీలో ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం ప్రియాంక గాంధీతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో బిజెపి, ఎన్‌డిఎ సర్కారు వైఖరిపై ఆయన తీవ్రంగా స్పందించారు. బిజెపి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా రాయ్‌బరేలితో కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ ఇక్కడి నుంచే పోటీ చేశారన్న రాహుల్.. ఇది తమకు కర్మభూమి లాంటిదన్నారు. సభలో పాల్గొన్న పలువురు జనం రాహుల్ జీ ఎప్పుడు పెళ్లి చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్పందిస్తూ.. 'ఇప్పుడు నేను త్వరలో పెళ్లి చేసుకోక తప్పేలా లేదు (అబ్ జల్దీ హి కర్నీ పడేగీ)' అని నవ్వి అభివాదం చేస్తూ ప్రసంగాన్ని ముగించారు. అక్కడే ఉన్న ప్రియాంక గాంధీ సైతం నవ్వుతూ ఉండడం కనిపించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.